కిషన్‌చందర్ రచనలు-1
రూ॥ 200/-
పేజీలు: 220

ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ, హిమాయత్‌నగర్ (హైదరాబాద్) హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

బిజెపికి ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామా ఆమోదం

బ్రిక్స్ చైర్మన్ హోదాలో అమెరికాను మోదీ ఎదిరించగలడా?

రాష్ట్రానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి

లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 222 | శనివారం | 12-07-2025 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



## పార్లమెంటరీ పోరాటంతోనే దీటైన

# రాజకీయ శక్తిగా నిలుస్తాం

**గ్రామ పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు మరింత బలపడాలి**

### ఖమ్మంలో సిపిఐ శతాబ్ది ముగింపు ఉత్సవాల ద్వారా దేశానికి గొప్ప సందేశం ఇవ్వాలి

- సిపిఐ రాష్ట్ర సమితి సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా

ప్రజాపక్షం/హైదరాబాద్

గ్రామ పంచాయతీ నుండి పార్లమెంట్ స్థాయి వరకు భారత కమ్యూనిస్టు పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ముందుకు సాగాలని సిపిఐ శ్రేణులకు సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా పిలుపునిచ్చారు. పార్లమెంటరీ పోరాటం ద్వారానే దీటైన రాజకీయ శక్తిగా నిలుస్తామన్నారు. వామపక్షాలు, కమ్యూనిస్టుల ఐక్యతకు సిపిఐ కట్టుబడి ఉందని, అదే సమయంలో పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం పెంచుకోవాలని, క్షేత్రస్థాయిలో కమ్యూనిస్టు పార్టీని మరింత బలోపేతం చేయాలని అన్నారు. డిసెంబర్‌లో ఖమ్మంలో జరగనున్న 'సిపిఐ శతాబ్ది ముగింపు ఉత్సవాల'ను జయప్రదం చేయడం ద్వారా దేశం, ప్రపంచానికే ఒక గొప్ప సందేశాన్ని ఇవ్వాలన్నారు.హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో సిపిఐ రాష్ట్ర సమితి సమావేశం శుక్రవారం జరిగింది. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డి.రాజా జాతీయ, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలను వివరించారు. రాజా మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వ నినాదం 'కాంగ్రెస్ ముక్త్ భారత్' కాంగ్రెస్ పార్టీపై ప్రభావాన్ని చూపిందని, ప్రస్తుతం 'మావోయిస్ట్ ముక్త్ భారత్ 'పేరుతో మోదీ ప్రభుత్వం నక్సలైట్లపై కాల్పులు జరుపుతోందని, ఆ తర్వాత 'కమ్యూనిస్టు ముక్త్ భారత్' అనే ప్రమాదం లేకపోలేదన్నారు. అందుకే కమ్యూనిస్టులంతా తరువాయి 2లో

**కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధానం విఫలం : అజీజ్‌పాషా**

"ప్రధాని మోదీ 77 దేశాలను సందర్శించినప్పటికీ పాకిస్తాన్ చేసిన 'పెహల్గామ్ దాడి' తర్వాత ఒక్క దేశం కూడా భారతదేశానికి మద్దతుగా నిలువలేక పోయింది. విదేశీ వ్యవహారాల విధానం విషయంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వైఫల్యం చెందింది. కేంద్రంలో మోదీ అధికారంలో లేనప్పుడు క్రూడ్ ఆయిల్ ధరలు వంద డాలర్లు ఉండేదనని, ప్రస్తుతం క్రూడ్ ఆయిల్ ధరలు 58 డాలర్లుగా ఉండగా, పెట్రోల్ ధర రూ.1.10లకు పెరిగింది."

# ఫీజుల పెంపునకు అనుమతివ్వం

- హైకోర్టులో ఇంజనీరింగ్ కాలేజీలకు చుక్కెదురు
- కాలేజీల అభ్యర్థనను తోసిపుచ్చిన ఉన్నత న్యాయస్థానం
- 6 వారాల్లోగా కమిటీ సిఫార్సులు, ఆపై ప్రభుత్వ తుది నిర్ణయం తీసుకోవాలి
- మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన న్యాయమూర్తి

ప్రజాపక్షం/హైదరాబాద్



ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలకు హైకోర్టులో చుక్కెదురైంది. ఫీజుల పెంపునకు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వబోమని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. 'కాలేజీల వినతి మేరకు ఫీజుల పెంపునకు అనుమతిస్తే తెలంగాణ ప్రవేశాల నియంత్రణ కమిటీ (టిఎఎఫ్ఆర్‌సి) కోరలు పీకేసినట్లు అవుతంది. పల్లు లేని పులి లాగా అవుతుంది. కాలేజీల అభ్యర్థన మేరకు టీఏఎఫ్ఆర్‌సీ సమావేశం నిర్వహించి రిజిస్టర్‌లో నమోదు చేసిన విషయాలను ఆధారంగా ఫీజుల పెంపు సాధ్యంకాదు. టీఏఎఫ్ఆర్‌సీ సమావేశౌ రిజిస్టర్ ఆధారంగా నిర్ణయం తీసుకోడానికి అదేమీ తుది నిర్ణయం కాదు. టీఎఎఫ్ఆర్‌సీ ప్రభుత్వానికి సిఫార్సు మాత్రమే చేస్తుంది. ఈ ప్రక్రియను పూర్తి చేయలేదు. కాలేజీలిచ్చిన ఫీజుల పెంపు ప్రతిపాదనలపై బుధవారం నుంచి టీఏఎఫ్ఆర్‌సీ నిర్ణయం తీసుకోవాలి. ఆ సిఫార్సులపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి. ఈప్రక్రియ మొత్తం 6 వారాల్లో పూర్తి చేయాలి. అంతిమంగా ఫీజుల పెంపుపై హైకోర్టు వెలువరించే తీర్పుకు లోబడి ఉంటాయి. ఈ మేరకు అడ్మిషన్లు పొందే విద్యార్థులకు కన్వీనర్ తెలియజేయాలి. వెబ్‌సైట్, ఇతర విధానాల ద్వారా కూడా కన్వీనర్ తెలియజేయాలి.' అని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఫీజుల పెంపు ప్రతిపాదనలపై టీఏఎఫ్ఆర్‌సీ జరిపిన మీటింగ్ రిజిస్టర్‌లో నమోదు చేసిందని కాలేజీలు చెప్పిన వాదనల మేరకు ఆ రిజిస్టర్‌ను పరిశీలిస్తే.. అందులో సభ్యుల సంతకాలు లేవు. కాలేజీల ఫీజుల పెంపు ప్రతిపాదనలను టీఏఎఫ్ఆర్‌సీ తగ్గించి రిజిస్టర్‌లో నమోదు చేసిందనే కాలేజీల వాదనల మేరకు ఉత్తర్వులు ఇవ్వబోం. రిజిస్టర్‌లో నమోదు తరువాయి 2లో

## 75 ఏళ్లు నిండితే

# దిగిపోవాలి

**ప్రధాని మోదీకి ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ భాగవత్ పరోక్ష సంకేతాలు?**


- సీనియర్‌లను తప్పించిన మోదీ తప్పుకుంటారా? : ప్రతిపక్షాలు
- 2029 వరకు మోదీనే : అమిత్ షా



**పూణె :** తాజాగా ఆర్‌ఎస్ఎఫ్ ఛీఫ్ వ్యాఖ్యలతో త్వరలో 75 ఏళ్ళు పూర్తి చేసుకోనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పదవి నుంచి తప్పుకునే అంశం మరోసారి తెరపైకి వచ్చింది. నాగ్‌పూర్‌లో ఆర్‌ఎస్ఎస్ మోరోపంత్ పింగ్లే స్మృతులతో ప్రచురించిన పుస్తకావిష్కరణ సభలో "75 ఏళ్లు నిండితే ఆగిపోయి ఇతరులకు అవకాశం ఇవ్వాలని ప్రకృతి సంకేతమిస్తుంది'' అని ఆర్‌ఎస్ఎస్ సర్ సంఘ్‌చాలక్ మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారానికి, ఊహాగానాలకు తెరలేపాయి. వచ్చే సెప్టెంబర్ మాసంలో మోదీకి 75 సంవత్సరాలు నిండనుండడంతో ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. పింగ్లేతో హాస్యభరిత సన్నివేశాన్ని భాగవత్ గుర్తు చేసుకుంటూ 75 ఏళ్ళ తరువాత శాలువాతో సన్మానం చేయడమంటే, పదవీ విరమణకు సమయం ఆసన్నమైందని, తరువాత తరానికి అవకాశం ఇవ్వాలని సమాజం మర్యాదపూర్వకంగా గుర్తుచేయడమేనని ఆయన అన్నారని చెప్పారు. దేశ సేవ పట్ల పింగ్లే అత్యంత నిబద్ధడైనప్పటికీ, ఒకసారి వయసు మీదపడిన తరువాత గౌరవప్రదంగా పక్కకు తప్పుకోవాలని విశ్వసించే వారని తెలిపారు. భాగవత్ వ్యాఖ్యలు అంతర్లీనంగా ప్రధాని మోదీని ఉద్దేశించినవేనని విస్తృతంగా వ్యాఖ్యలు వినపడుతున్నాయి. వీటిపై ప్రతిపక్ష పార్టీలు వరుసగా స్పందిస్తున్నాయి. శివసేన (యుబిటి) నేత సంజయ్ రౌత్ మాట్లాడుతూ ఎల్.కె.అద్వానీ, తరువాయి 2లో

## రాజ్యాంగానికి ఇక అచ్చేదిన్

**కాంగ్రెస్ ఎద్దేవా**



**న్యూఢిల్లీ :** రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భాగవత్ 75 ఏళ్ల వయసులో తాను తన పదవినుంచి తప్పుకుంటున్నట్లు చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై విమర్శలతో విరుచుకుపడింది. ప్రధానమమంత్రి విదేశాల నుంచి తిరిగి వస్తున్నప్పుడు మోదీకి సరసంఘ్ చాలక్ భాగవత్ తనకు 75ఏళ్లు నిండాయన్నవిషయాన్ని వెల్లడించారని కాంగ్రెస్ గుర్తుచేసింది. దీనిపై ప్రతిపక్ష కాంగ్రెస్ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ వ్యాఖ్యలను 'మంచివార్త' అని చెప్పింది. ఈ సంవత్సరం భాగవత్‌కు, ప్రధానమంత్రి నరేంద్రమోదీకి 75ఏళ్లు నిండి పదవి నుంచి పక్కకు తప్పుకోనున్న కారణంగా దేశానికి, రాజ్యాంగానికి 'అచ్చేదిన్' అని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ తరువాయి 2లో

# కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

- బిసి రిజర్వేషన్లతో కల్వకుంట్ల కవితకు ఏం సంబంధం?
- తమ ఘనతే అని చెప్పుకోవడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు
- స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై కేబినేట్ నిర్ణయంతో గాంధీభవన్‌లో సంబరాలు

ప్రజాపక్షం/హైదరాబాద్



తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థ ఎన్నికల్లో వెనుకబడిన తరగతుల(బిసి) కు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాన్ని స్వాగతిస్తూ కాంగ్రెస్ బిసి సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా టపాసులు కాల్చి, స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ బిసిలకు 42 శాతం రిజర్వేషన్లతో సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మరోసారి నిరూపితమైందని ఉద్ఘాటించారు. బిసి రిజర్వేషన్లతో కవితకు ఏమి సంబంధం ఉందని ఆయన ప్రశ్నించారు. కవిత చోటా మోటా ధర్నాలు చేసి ఆమె వల్లే బిసి రిజర్వేషన్ సాధ్యమైందని ప్రకటించుకోవడాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఆయన అన్నారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని చారిత్రాత్మక నిర్ణయంగా అభివర్ణించారు. ఈ చారిత్రాత్మక నిర్ణయం తరువాయి 2లో

# 14న కొత్త రేషన్ కార్డులు

- తుంగతుర్తి నియోజకవర్గంలో సిఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా లాంఛనంగా ప్రారంభం

**రాష్ట్రవ్యాప్తంగా 2.4 లక్షల కార్డుల పంపిణీ**

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల జారీకి రాష్ట్ర ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. ఈ నెల 14వ తేదీన తుంగతుర్తి నియోజకవర్గం కేంద్రంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.4 లక్షల కొత్త రేషన్ కార్డుల పంపిణీ చేయనున్నారు. తద్వారా 11.30 లక్షల మంది నిరుపేదలకు ప్రయోజనం చేకూరనుందని ప్రభుత్వం తెలిపింది. గడిచిన ఆరు నెలల కాలంలో రాష్ట్రంలో 41 లక్షల మందికి ప్రభుత్వం కొత్తగా రేషన్‌కార్డులను పంపిణీ చేసిందని, కొత్తగా జారీ చేసిన రేషన్ కార్డులతో కలిపి రాష్ట్రంలో రేషన్ కార్డుల సంఖ్య 94,72,422 కు చేరుతుందని,తద్వారా మొత్తంగా 3 కోట్ల 14 లక్షల మంది లబ్ధి చేకూరనుందని ప్రభుత్వం వివరించింది.

## సామాజిక న్యాయానికి కట్టుబడ్డాం

- ఏ రాష్ట్రం చేయనివిధంగా 1.04 లక్షల ఎన్యూమరేటర్లతో బిసి కులగణన చేశాం
- స్థానిక సంస్థ ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల కోసం చట్టం చేసుకున్నాం
- మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, లక్ష్మణ్
- తిరుమలగిరిలో ముఖ్యమంత్రి సభ ఏర్పాట్ల పరిశీలన



ప్రజాపక్షం/సూర్యాపేటప్రతినిధి

ప్రజాప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సామాజిక న్యాయానికి కట్టుబడి పనిచేస్తుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తిరుమలగిరి నందు ఈనెల 14న ముఖ్యమంత్రి చేతుల మీదుగా నూతన రేషన్‌కార్డుల పంపిణీ ప్రారంభోత్సవం చేసే సభపై జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవార్, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, ఎంపి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఉమ్మడి నల్గొండ జిల్లా తరువాయి 12లో

## కాళేశ్వరంపై కేబినేట్‌లో ఆరు సార్లు నిర్ణయాలు..

# మూడు సార్లు అసెంబ్లీ ఆమోదం

**పిసి ఘోష్ విచారణ కమిషన్‌కు ప్రాజెక్టు పత్రాలు సమర్పించిన మాజీ మంత్రి హరీశ్ రావు**



ప్రజాపక్షం/హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించి అప్పటి రాష్ట్ర మంత్రివర్గంలో (బిఆర్‌ఎస్/టిఆర్‌ఎస్ ప్రభుత్వం) ఆరు సార్లు నిర్ణయాలు జరి గాయని, మూడు సార్లు శాసన సభ ఆమోదించిందని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు తెలిపారు. హైదరాబాద్,బిఆర్‌కె భవన్‌లోని జస్టిస్ పి.సి ఘోష్ విచారణ కమిషన్‌ను హరీశ్‌రావు శుక్రవారం కలిసి తరువాయి 2లో

## 37 అడుగులకు గోదావరి

- స్లూయిస్‌ల దగ్గర మోటార్లు సిద్ధం
- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరికలు




ప్రజాపక్షం/భద్రాచలం

భద్రాచలం వద్దగోదావరి నది వరద నీటితో పరవళ్లు తొక్కుతోంది. ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో నీరు దిగువనున్న గోదావరిలో కలుస్తోంది. మరోప్రక్క గోదావరి ఉపనదులైన ఇంద్రావతి, ప్రాణహితలు సైతం ఉప్పొంగటంతో మరింత వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం భద్రాచలం వద్ద గోదావరి తరువాయి 12లో

## సిఎం రేవంత్ రెడ్డికి బిసి సంఘాల కృతజ్ఞతలు



స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకోవడంపై బిసి సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో బిసి సంఘాల నాయకులు శుక్రవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సిఎంను కలిసిన వారిలో మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ ఉన్నారు.



## బిహార్‌లో ఎన్నికలు

# హైజాక్ చేసేందుకు బిజెపి కుట్ర

- తన విధిని నిర్వర్తించకుండా బిజెపి కోసం పనిచేస్తున్న ఇసి
- 'సంవిధాన్ బచావో' సమావేశంలో రాహుల్‌గాంధీ

**భువనేశ్వర్ :** మహారాష్ట్రలో జరిగినట్లే బిహార్‌లో కూడా రానున్న ఎన్నికలను హైజాక్ చేయడానికి బిజెపి ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. శుక్రవారం కాంగ్రెస్ సంవిధాన్ బచావో సమావేశంలో రాహుల్‌గాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్నారు. రాహుల్‌గాంధీ మాట్లాడుతూ బిహార్ అసెంబ్లీ ఎన్నికలను బిజెపి 'హైజాక్' చేయకుండా నిరోధించాలని ఇండియా కూటమి పార్టీలు నిర్ణయించాయని అన్నారు. మహారాష్ట్ర మాదిరిగానే బిహార్‌లో ఎన్నికలను హైజాక్ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, దేశవ్యాప్తంగా బిజెపి రాజ్యాంగంపై దాడి చేస్తోంది అని రాహుల్ ఆరోపించారు. గురువారం తరువాయి 12లో

# ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలో కలవండి

**కర్రెగుట్టలో తిరిగి గాలింపు మొదలైంది**

**'ప్రజాపక్షం' ఇంటర్వ్యూలో డిజిపి డాక్టర్ జితేందర్**

(బి.వాసుదేవరాజు)



ప్రజాస్వామ్యంలో హింసా మార్గానికి తావులేదని, మావోయిస్టులు ఆయుధాలు అప్పగించి జనజీవన స్రవంతిలో కలవాలని తెలంగాణ రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్ అన్నారు. లొంగిపోయిన మావోయిస్టు నాయకులు, సభ్యులకు పునరావాసం కల్పించి, వారిపై ఉన్న రివార్డులను కూడా వారికే అందజేస్తామని తెలిపారు. అలాగే వారికి ఉపాధి అవకాశాలు కూడా ప్రభుత్వ సహకారంతో అందిస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆయుధాలతో రాజ్యాధికారం సాధించలేరని ఆయన అన్నారు. ఎన్‌కౌంటర్లలో అటు మావోయిస్టు నేతలు, సభ్యులు, ఇటు పోలీసులు మృతి చెందడం సమాజానికి అంత మంచిది కాదని అన్నారు. రాష్ట్రంలో ఉన్న మావోయిస్టులందరూ ఆయుధాలు వదిలి ప్రజలతో కలిసిపోవాలని తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## బలూచ్ మిలిటెంట్ల ఘాతుకం
## 9 మంది ప్రయాణికుల హత్య

**ఇస్లామాబాద్/ కరాచీ:** పాకిస్తాన్‌లో బలూచిస్తాన్ మిలిటెంట్లు మరోసారి చెలరేగిపోయారు. పంజాబ్ ప్రావిన్స్‌కు చెందిన 9 మందిని కిడ్నాప్ చేసి, హత్య చేశారు. బలూచిస్తాన్ అసిస్టెంట్ కమిషనర్ నవీద్ ఆలమ్ తెలిపిన వివరాల ప్రకారం, పంజాబ్‌కు వెళుతున్న రెండు బస్సులను జోబ్ జిల్లా సుర్-దకాయ్ ప్రాంతంలో బలూచ్ మిలిటెంట్లు అడ్డగించారు. వాటి నుంచి తొమ్మిది మంది ప్రయాణికులను కిందకు దింపి, తమతో తీసుకెళ్లారు. ఈ కిడ్నాప్ జరిగిన కొన్ని గంటల్లోనే వారిని కాల్చి చంపేశారు. తిరుగుబాటుదారులు బస్సును అడ్డగించి, గన్నులతో బెదిరించి బస్సులోకి ఎక్కారని, ప్రయాణిస్తున్న వారిని ఐడీ కార్డులు చూపించమని అడిగారని తెలుస్తోంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, శవాలను స్వాధీనం చేసుకున్నారు. బలూచిస్తాన్‌లో వేర్పాటువాదులు ఇలాంటి దాడులకు దిగడం, హత్య చేయడం నిత్యకృత్యంగా మారింది. కాగా, ఈ దారుణానికి ఏ మిలిటెంట్ గ్రూప్ ఇంకా బాధ్యతను ప్రకటించలేదు. ఇలావుంటే, గతంలో బలోచ్ టెర్రరిస్ట్ గ్రూప్స్ ఇలాంటి హత్యలకు పాల్పడ్డాయి.

# ఆసక్తి రేపుతున్న భేటీ

### చైనా విదేశాంగ మంత్రితో యుఎస్ విదేశాంగ మంత్రి చర్చలు

**కౌలాలంపూర్:** అమెరికా, చైనా మధ్య వివిధ అంశాలపై తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో, ఇరు దేశాల విదేశాంగ మంత్రులు భేటీ కావడంట ఆసక్తి రేపుతున్నది. మలేసియాలో జరిగిన సౌత్‌ఈస్ట్ ఏషియన్ నేషన్స్ ఫోరమ్ సమావేశానికి హాజరైన అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియో, చైనా విదేశాంగ శాఖ మంత్రి వాంగ్ యీ భేటీ అయ్యారు. అనంతరం వీరు మీడియాతో మాట్లాడకుండానే వెళ్లిపోవడంతో, చర్చకు వచ్చిన అంశాలపై ఎలాంటి వివరాలు వెల్లడికాలేదు. అయితే, వివిధ దేశాల నుంచి దిగుమతయ్యే వస్తువులపై అమెరికా విధిస్తున్న అధిక టారిఫ్ రేట్లు, జపాన్, దక్షిణ కొరియా దేశాలతో కలిసి అమెరికా చేస్తున్న సైనిక విన్యాసాలు వంటి కీలకాంశాలను వీరు చర్చించి ఉండవచ్చని అంటున్నారు. అయితే, అంతకు ముందు ఆగ్నేయాసియా దేశాల విదేశాంగ మంత్రులను కలిసిన తర్వాత మీడియాతో మాట్లాడిన రూబియో టారిఫ్ అంశాన్ని దాటవేశారు. ఆసియాలో పెరుగుతున్న



చైనా ఆధిపత్యం, శాంతి భద్రతలు వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చాయని తెలిపారు. అమెరికా ప్రతిపాదిస్తున్న అధిక టారిఫ్ రేట్లను మీడియా ప్రతినిధులు ప్రస్తావించగా, 'అది ఒక అంశం మాత్రమే. ప్రధాన చర్చ మాత్రం శాంతి భద్రతలపై కొనసాగింది' అన్నారు. అధిక టారిఫ్‌ను వివిధ దేశాలు వ్యతిరేకిస్తున్న విషయాన్ని ఆయన దాటవేశారు.

### అమెరికా కవ్వింపు చర్యలు

ఆసియాలో అమెరికా కవ్వింపు చర్యలు కొనసాగిస్తున్నది. జపాన్, దక్షిణ కొరియాతో కలిసి సైనిక విన్యాసాల్లో పాల్గొంది. అంతర్జాతీయ నిబంధనలకు విరుద్ధంగా ఉత్తర కొరియా క్షిపణుల తయారీ, ప్రయోగాలను నిర్వహిస్తున్నదని, ఈ చర్యలను వెంటనే మార్చుకోవాలని ఈ మూడు దేశాలు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నాయి. ఉత్తర కొరియా తన సైనిక పాటవాన్ని విపరీతంగా పెంచుకుంటున్నదని, ఇది ఆసియా ప్రాంతంలో భద్రతకు ప్రమాదకరమని వ్యాఖ్యానించాయి. ఒక వైపు అమెరికా విదేశాంగ మంత్రి ఆసియాలో పర్యటిస్తుండగా, మరోవైపు జపాన్, దక్షిణ కొరియాతో కలిసి అగ్రరాజ్యం సైనిక విన్యాసాలు చేయడాన్ని కవ్వింపు చర్యలుగానే భావించాల్సి వస్తుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## మయన్మార్‌లో బౌద్ధారామంపై
# వైమానిక దాడులు

### కనీసం 23 మంది మృతి... 30 మందికి తీవ్ర గాయాలు



**బ్యాంకాక్:** మయన్మార్‌లోని ఒక బౌద్ధారామంపై జరిగిన వైమానిక దాడిలో కనీసం 23 మంది మృతి చెందగా, 30 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో పది మంది పరిస్థితి విషమంగా ఉంది. సగైంగ్ రీజన్‌లోని లిన్ టా లూ గ్రామంలోవున్న బౌద్ధారామంపై దాడి జరిగిన విషయాన్ని 'డెమోక్రాటిక్ వాయిస్ ఆఫ్ బర్మా' ప్రకటించింది. మృతుల సంఖ్య 30 వరకూ ఉండవచ్చని పేర్కొంది. ఈ సంస్థ ప్రకటన ప్రకారం, ఆ బౌద్ధారామంలో సుమారు 150 మంది బౌద్ధులు తలదాచుకుంటున్నారు. వీరంతా సైనిక జుంటా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలను కూడగడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. 2023 ఫిబ్రవరిలో, సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన అంగ్‌సాన్ సూకీ ప్రభుత్వాన్ని కూలదోసిన సైన్యం, పాలనా పగ్గాలను చేజిక్కించుకుంది. అప్పటి నుంచి మయన్మార్‌లో అంతర్యుద్ధ వాతావరణం నెలకొంది. బౌద్ధులను సైనిక ప్రభుత్వం ఉగ్రవాదులుగా పేర్కొంటున్నది. మిలిటెంట్ల స్థావరాలను మాత్రమే లక్ష్యంగా చేసుకొని దాడులు జరిపినట్టు గతంలో ప్రకటించింది. అయితే, తాజా ఘటనపై మయన్మార్ సైనిక ప్రభుత్వం ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు. అయితే, ప్రభుత్వమే ఉద్దేశపూర్వకంగా దాడి చేయించిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



## త్వరలో జిన్‌పింగ్‌తో అల్బనీస్ సమావేశం

**మెల్బోర్న్:** చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో ఆస్ట్రేలియా ప్రధాన మంత్రి ఆంథోనీ అల్బనీస్ త్వరలోనే సమావేశం కానున్నారు. వ్యాపార బృందంతో కలిసి చైనా వెళ్లనున్న అల్బనీస్, అక్కడ బజింగ్, షాంఘై, చెంగ్డూ నగరాలను సందర్శిస్తారు. ఈ క్రమంలోనే జిన్‌పింగ్, చైనా ప్రధాని లీ క్వియాంగ్, నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ చైర్మన్ జావో లెజీ తదితరులతో భేటీ అవుతారు. ఈ పర్యటన వివరాలను ఆస్ట్రేలియా అధికారికంగా ప్రకటించలేదు. అయితే, వాణిజ్య సంబంధమైన పర్యటనగా విశ్వసనీయ వర్గాలు పేర్కొంటున్నాయి. అమెరికా విధిస్తున్న అధిక టారిఫ్ రేట్లు కూడా చర్చకు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలుస్తున్నది.



# వేటుకు సిద్ధంగా ఉండండి

### ఉద్యోగులకు అమెరికా విదేశాంగ శాఖ స్పష్టీకరణ

**వాషింగ్టన్:** అమెరికా విదేశాంగ మంత్రిత్వ శాఖలో ఉద్యోగులపై వేటు ఖాయంగా కనిపిస్తున్నది. కొంత మంది ఉద్యోగులపై వేటు తప్పదని, అందుకు సిద్ధంగా ఉండాలని ఈ శాఖ డిప్యూటీ సెక్రెటరీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయితే, ఎంత మంది ఉద్యోగులను తీసివేస్తున్నారనే విషయంపై స్పష్టత ఇవ్వలేదు. ఉద్యోగులాంతా అమెరికాకు ప్రశంసనీయమైన సేవలు అందించారని మాత్రం ఆ ప్రకటనలో తెలిపారు. ఇలావుంటే, ఈ ఏడాది ఏప్రిల్ మాసంలో 15 శాతం మంది ఉద్యోగులను తొలగించడానికి అనుమతించాల్సిందిగా అమెరికా చట్టసభను విదేశాంగ మంత్రిత్వ శాఖ కోరింది. అయితే, ఆ తర్వాత కాంగ్రెస్‌కు సమర్పించిన నివేదికలో వేటును 18 శాతానికి పెంచింది. గతంలో ఎలాన్ మస్క్ నిర్వహించిన డిపార్ట్‌మెడ్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ తీసుకుంటున్న పలు నిర్ణయాలు, ఉద్యోగులపై వేటు విమర్శలకు కారణమవుతున్నది. ఈ నిర్ణయాలపై పలు వాజ్యాలు దాఖలుకాగా, అమెరికా సుప్రీం కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనితో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల సంఖ్యను తగ్గించడానికి మార్గం సుగమమైంది. ఉద్యోగుల్లో జవాబుదారీతనాన్ని పెంచడంతోపాటు, ఆర్థికంగా దేశాన్ని బలోపేతం చేయడానికి ప్రయత్నిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే.

**నాసాకు తప్పని సంక్షోభం!**

అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా'కు కూడా సంక్షోభం తప్పేలా లేదని అంటున్నారు. వివిధ మీడియా కథనాల ప్రకారం, 2,145 మంది ఉద్యోగులను తప్పించేందుకు నాసా సన్నాహాలు చేస్తోంది. సైన్స్, అంతరిక్ష ప్రయాణం వంటి కీలక మిషన్లపై పనిచేస్తున్న అనుభవజ్ఞులైన ఉద్యోగులపై అమెరికా ప్రభుత్వం చేపడుతున్న బడ్జెట్ కోతర ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. పొలిటికో మీడియా సంస్థ నివేదికను అనుసరించి, జిఎస్ 13, జిఎస్ 15 స్థాయిలో ఉన్న సీనియర్ అధికారులకు ఉద్వాసన తప్పకపోవచ్చు. వీరికి 'గోల్డెన్ షేక్‌హ్యాండ్' ఇచ్చి పదవీ విరమణ చేయించడం లేదా రాజీనామా చేయించడమే ట్రంప్ ప్రభుత్వ లక్ష్యం. నాసాకు చెందిన గోడ్డార్డ్ స్పేస్ సెంటర్ (మెరిల్యాండ్)లో 607, జాన్సన్ స్పేస్ సెంటర్ (టెక్సాస్)లో 366, కెన్నెడీ స్పేస్ సెంటర్ (ఫ్లోరిడా)లో 311, ప్రధాన కార్యాలయం (వాషింగ్టన్)లో 307, లాంగ్లీ రీసెర్చ్ సెంటర్ (వర్జీనియా)లో 281, మార్షల్ స్పేస్ ఫ్లైట్ సెంటర్ (అలబామా)లో 179, గ్లెన్ రీసెర్చ్ సెంటర్ (ఓహాయో)లో 191 మంది చొప్పున ఉద్యోగాలు కోల్పోనున్నారన్నది నివేదిక సారాంశం. ఒకేసారి ఇంతమందిపై వేటు పడితే నాసా ప్రయోగాలకు తీవ్ర విఘాతం ఏర్పడే ప్రమాదం లేకపోలేదు.

# కెనడాపై అమెరికా సుంకాల పోటు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వివాదాస్పద నిర్ణయం తీసుకున్నారు. పొరుగు దేశమైన కెనడా నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై 35 శాతం టారిఫ్ విధిస్తున్నట్టు ప్రకటించారు. కెనడా ప్రధాని మార్క్ కార్నీని ఉద్దేశించి రాసిన ఉత్తరాన్ని ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రుత్ సోషల్‌లో ఉంచారు. ఫెంటనిల్ మత్తు పదార్థాలు కెనడా నుంచే దేశంలోకి ఎక్కువగా రవాణా అవుతున్నదని అమెరికా ఆరోపణ. కెనడా తగిన చర్యలు తీసుకోలేదని పేర్కొంటూ, టారిఫ్‌ని పెంచింది. ఆగస్టు ఒకటో తేదీ నుంచి ఈ కొత్త సుంకాలు అమల్లోకి వస్తాయని, కెనడా ఫెంటనిల్ అక్రమ రవాణాను అడ్డుకోకపోతే, మరిన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంటామని ట్రంప్ హెచ్చరించారు. తమ దేశానికి చెందిన పాల ఉత్పత్తులపై కెనడా 400 శాతం పన్ను వసూలు చేస్తున్నదని ఆరోపించారు. కెనడా తీరు అమెరికా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడమేగాక, జాతీయ భద్రతకు ముప్పు కలిగిస్తున్నదని ట్రంప్ తన పోస్టులో విమర్శించారు.




ఇలావుంటే, ట్రంప్ నిర్ణయాలు, భారీ సుంకాలు కేవలం కెనడాకు మాత్రమే పరిమితం కాలేదు. చైనాతో వాణిజ్య యుద్ధం కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతునే ఉంది. ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత, తీవ్రస్థాయికి చేరింది. బ్రెజిల్‌పై 50 శాతం టారిఫ్‌ను విధిస్తామని ట్రంప్ ఇప్పటికే ప్రకటించారు. విచిత్రంగా, బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సోనారోపై నడుస్తున్న కేసుకు, టారిఫ్ పెంపుదలకు లింకు పెట్టారు. జపాన్, దక్షిణ కొరియా, ట్యునీషియా, మలేషియా, కజాకిస్థాన్, దక్షిణాఫ్రికా, ఇండోనేషియా, మయన్మార్, లావోస్, బోస్నియా, థాయిలాండ్, బంగ్లాదేశ్, ఇరాక్, లిబియా, మోల్డోవా, బ్రునై, ఇండోనేషియా, ట్యునీషియా, శ్రీలంక, సెర్బియా, కంబోడియా, ఫిలిప్పీన్స్ తదితర దేశాలపైన కూడా సుంకాలు పెంచనున్నట్టు ట్రంప్ ఇది వరకే స్పష్టం చేశారు. స్థూలంగా చెప్పాలంటే, అతి కొద్ది దేశాలను మినహాయించి, అన్ని ప్రపంచ దేశాలపై ట్రంప్ సుంకాల పోటు తప్పేలా కనిపించడం లేదు.

## గ్రామీణప్రాంతాల్లో
# మెరుగైన వైద్యసేవలే లక్ష్యం



వైద్య ఆరోగ్యశాఖమంత్రి
దామోదర రాజనర్సింహ్మ

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** వైద్యసేవల్లో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ఆదర్శంగా ఉండేలా వసతులను కల్పించి, పేదప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్రవైద్య ఆరోగ్య, కుటుంబసంక్షేమం, సైన్స్‌అండ్ టెక్నాలజిశాఖల మంత్రి దామోదర రాజనర్సింహ్మ అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు డాక్టర్ కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, కసిరెడ్డినారాయణరెడ్డిలతోకలిసి మంత్రులు జూపల్లి కృష్ణారావు, రోడ్లుభవనాలు, సినిమాటోగ్రఫీశాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్రవైద్య ఆరోగ్యశాఖ, కుటుంబ సంక్షేమం, సైన్స్ అండ్‌టెక్నాలజిశాఖమంత్రి దామోదర రాజనర్సింహ్మ జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈసందర్భంగా మంత్రి రాజనర్సింహ్మ మాట్లాడుతూ తెలంగాణప్రజల అవసరాలు, వైద్యసేవల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ,అత్యాధునిక టెక్నాలజితోకూడిన వైద్యవిద్యను అందించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. వైద్యులను ప్రజలు దేవుడితో పోలుస్తారని, ఆవిధమైన నమ్మకాన్ని ప్రజలకుకల్పిస్తూ గ్రామీణప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ఆస్పత్రులు, మెడికల్ కళాశాలలకు అవసరమైన అన్నిమౌలిక వసతులను కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అందుకు అనుగుణంగానే అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించడంతోపాటు మెరుగైన విద్య అందిస్తున్నామన్నారు. మెడికల్ కళాశాలలో నిమ్స్, ఉస్మానియా స్థాయి వసతులు ఉండాలని కార్పొరేట్‌స్థాయిలో ఆస్పత్రులను తీర్చిదిద్దే ప్రయత్నమన్నారు. ప్రతి 35కిలోమీటర్లకు ట్రామాకేంద్రం, జిల్లాకు ఓనర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ ఆలోచన అన్నారు. రాష్ట్రంలో నాలుగు ప్రధాన నగరాల్లో క్యాన్సర్ నిర్ధారణ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వనమహోత్సవంలో భాగంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్, అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉషారాణి, గ్రంథాలయచైర్మన్ గంగాపురం రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు పాల్గొన్నారు.

## శక్తిగా నిలుస్తాం

(మొదటి పేజీ తరువాయి)

అప్రమత్తమై పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టాలన్నారు.దేశ వ్యాప్తంగా కార్మిక ఉద్యమాల్లో బిజెపి అనుబంధ సంస్థ బిఎంఎస్ చొరబడుతున్నదని, ఇటువంటి పరిణామాల నేపథ్యంలో ఎఐటియుసి, కిసాన్ విభాగాలను రాజకీయంగా మరింత చైతన్యవంతం చేయాలన్నారు.తెలంగాణ రాష్ట్రానికి ఎంతో పోరాట చరిత్ర ఉన్నదని, నిజాంకు వ్యతిరేకంగా పోరాటం చేశామని, అలాంటి గడ్డపై సిపిఐని మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. హిట్లర్ తరహాలో మోదీ కూడా ఎన్నికల్లో గెలిచిన తర్వాత అనేక మార్పులు చేస్తున్నారని, రాజ్యాంగ వ్యవస్థలను, స్వతంత్ర ప్రతిపత్తి సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని రాజా విమర్శించారు. స్వతంత్రంగా ఉండాల్సిన న్యాయ వ్యవస్థ కూడా ప్రమాదంలో పడిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ఫాసిస్టు శక్తులు రాజ్యాంగ, ప్రజాస్వామ్య శక్తులపై దాడి చేస్తున్నాయని, ఈ చర్యల పట్ల ప్రజలలో చైతన్యం తీసుకురావాలన్నారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ప్రభుత్వం భారతదేశాన్ని కార్పొరేట్ నియంత్రణ, ఫాసిస్టు రాజ్యం వైపు నెడుతోందని, లౌకిక, ప్రజాస్వామిక, సంక్షేమ భారత దేశంలో రాజ్యాంగం, న్యాయం, స్వేచ్ఛ, సమానత్వాన్ని దెబ్బతిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు రాష్ట్ర రాజకీయాలపై ప్రవేశపెట్టిన నివేదికను కౌన్సిల్ చర్చించింది. సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, పశ్యపద్మ పాల్గొన్నారు.

**సంతాపం :** సమావేశంలో తొలుత ఇటీవల మరణించిన సిపిఐ నాయకులు పశ్య కన్నమ్మ, రఘుపాల్, సుగుణ, మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతోపాటు 26 మావోయిస్టులు, ఇటీవల గుజరాత్‌లోని గంబీర వంతెన ప్రమాదంలో చనిపోయిన వారికి సమావేశం సంతాపాన్ని తెలియజేస్తూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించింది.

## దిగిపోవాలి

(మొదటి పేజీ తరువాయి)

జశ్వంత్ సింగ్, మురళీ మనోహర్ జోషి వంటి సీనియర్ నాయకులను 75 ఏళ్ళ తరువాత మోదీ బలవంతంగా పదవీ విరమణ చేయించారని, ఆయన కూడా అదే ప్రమాణాలు పాటిస్తారా అనే విషయాన్ని వేచి చూడాల్సి ఉందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నేత అభిషేక్ మనుషింఘ్వీ మాట్లాడుతూ మీరు పాటించని విషయంపై ఉపదేశాలు ఇవ్వడం ప్రమాదకరమని అన్నారు.75 ఏళ్ళ నిబంధన పేరుతో సీనియర్‌లను తప్పించేందుకు మార్గదర్శన్ మండలిని ఏర్పాటు చేశారని, అయినప్పటికీ ప్రస్తుత నాయకత్వం తమకు తాము సడలింపు ఇచ్చుకుంటున్నట్లుగా ఉందని మోదీని ఉద్దేశించి పరోక్షంగా ఎద్దేవా చేశారు.

**2029 వరకు మోదీనే : అమిత్ షా**

ప్రధాని మోదీకి అత్యంత సన్నిహితుడైన కేంద్ర మంత్రి అమిత్ షా స్పందిస్తూ 2023 మే మాసంలోనే ఇలాంటి ఊహాగానాలు వచ్చాయని, వయసు సంబంధిత పదవీ విరమణ విధానమేదీ బిజెపి నిబంధనావళిలో లేదని అన్నారు. 2029 వరకు మోదీనే నాయకత్వ బాధ్యతల్లో కొనసాగుతారని, నిరాధార పుకార్లతో ఇండియా కూటమి నెగ్గలేదని అన్నారు.

## ఇక అచ్చేదిన్

(మొదటి పేజీ తరువాయి)

ఎద్దేవా చేసింది. బుధవారం నాగ్‌పూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ భాగవత్ మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతకర్త మోరోపంత్ పింగ్లే చేసిన ప్రకటన ప్రకారం 75ఏళ్ల వయసులో పదవి నుంచి తప్పుకోవాలని ప్రకటించిన విషయాన్ని ఈసందర్భంగా ఆయన ప్రస్తావించారు. 75 సంవత్సరాల శాలువా మీపై కప్పబడి ఉందని, అంటే మీరు ఒక నిర్దిష్ట వయసుకు చేరుకున్నారని, దాని అర్థం మీరు పక్కకు తప్పుకుని ఇతరులను పనిచేసుకోనివ్వాలని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ భాగవత్ పింగ్లే చేసిన వ్యాఖ్యలను ప్రత్యేకంగా ప్రస్తావించడాన్ని కాంగ్రెస్ లక్ష్యంగా చేసుకుంది. కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ఇన్‌చార్జి కమ్యునికేషన్స్ జైరామ్ రమేశ్ తన 'ఎక్స్' హిందీ పోస్ట్‌లో...'పూర్ అవార్డు జీవి ప్రధానమంత్రి'! మీరు స్వదేశానికి ఎలా తిరిగివచ్చారు? తిరిగొస్తుండగా 2025 సెప్టెంబర్ 17న మీకు 75ఏళ్లు నిండుతున్నాయని సరసంఘ్‌చాలక్ మోహన్ భాగవత్ గుర్తుచేశారు. కానీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా సరసంఘ్‌చాలక్ భాగవత్‌తో మీకు కూడా 2025 సెప్టెంబర్ 11కు 75 ఏళ్లు నిండుతున్నాయని గుర్తుచేయొచ్చు. అయినప్పటికీ ఆ విషయమై మాట్లాడలేదు. 'ఒక బాణం.. రెండు లక్ష్యాలు' అవుతుంది అని జైరామ్ రమేష్ చెప్పారు. కాంగ్రెస్ మీడియా, పబ్లిసిటీ డిపార్ట్‌మెంట్ హెడ్ పవన్ ఖేరా మట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ ఈ వ్యాఖ్యలు చేసినప్పటినుంచి ఉత్సాహం, ఆనందం వెల్లువెత్తాయని పేర్కొన్నారు. భాగవత్ వ్యాఖ్యలను పవన్ ఖేరా ప్రస్తావిస్తూ 'ఈ ఏడాది సెప్టెంబర్ 11కు భాగవత్‌కు 75ఏళ్లు నిండుతాయి. సెప్టెంబర్ 17కు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి 75ఏళ్లు నిండుతాయి. ఈ 11ఏళ్లు దేశం, రాజ్యాంగం, రాజ్యాంగ సంస్థల పరిస్థితి ఆగమాగం అయ్యాయి. అయితే, ఇక మనం సెప్టెంబర్ 17నుంచి ఉపశమనం పొందుతాం. సెప్టెంబర్ 11న మొదటి అడుగు వేయబడుతుంది. ఈ ఇద్దరూ దేశం ఆత్మతో ఆడుకున్నారు' అని ఖేరా ఒక వీడియో ప్రకటనలో తెలియజేశారు. 'అయితే ఇక మనం సంతోషంగా ఉందాం, ఎందుకంటే భారతదేశానికి 'అచ్చేదిన్' రానున్నాయి. ఈదేశ రాజ్యాంగం నరేంద్రమోదీ, మోహన్ భాగవత్ వల్లే నిర్వీర్యం అయ్యాయి. వారు ఇక వెళ్లబోతున్నారు' అని ఖేరా పేర్కొన్నారు.

## అనుమతివ్వం

(మొదటి పేజీ తరువాయి)

చేశారంటే ఫీజుల పెంపునకు టీఏఎఫ్‌ఆర్‌సీ ప్రభుత్వానికి సిఫార్సు చేసినట్లు అవ్వదు. రిజిస్టర్‌ను పరిశీలిస్తే అందులో సభ్యుల సంతకాల్లేవు. ఫీజుల పెంపు కమిటీ సభ్యుల పరిశీలనకు లోబడి ఉంటుందని కూడా రిజిస్టర్‌లో ఉంది. గత జూన్ 18న సమావేశమై కాలేజీల ప్రతిపాదనలు గతంలో సుప్రీం కోర్టు, హైకోర్టుల గైడ్‌లైన్స్‌కు భిన్నంగా ఉన్నాయని, కాలేజీల ప్రతిపాదనలపై ప్రభుత్వం అధికారులతో కమిటీని ఏర్పాటు చేసి అధ్యయనం చేశాక నిర్ణయం తీసుకోవాల్సివుందని కోర్టుకు సమర్పించిన తీర్మానాల్లో ఉంది. దీనినిబట్టి ఫీజుల పెంపునకు టీఏఎఫ్‌ఆర్‌సీ ఆమోదం చెప్పలేదు.. అని కూడా ఆదేశాలిచ్చింది.

ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫీజులు గత బ్లాక్ పీరియడ్ ఫీజులే 2025–26 విద్యా సంవత్సరానికి వర్తిస్తాయంటూ జూన్ 30న ప్రభుత్వం వెలువరించిన జీవో 26ను 11 ఇంజినీరింగ్ కాలేజీలు సవాలు చేసిన పిటిషన్లపై విచారణను ఆగస్టు రెండో వారానికి వాయిదా వేస్తూ జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం మధ్యంతర ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. శుక్రవారంతో కౌన్సెలింగ్ పూర్తయ్యేందుకు ఒక్కరోజు ముందు కాలేజీలు హైకోర్టులో అత్యవసర లంచ్‌మోషన్ పిటిషన్ వేయడం సమర్థనీయం కాదు. అడ్మిషన్ల బిగినింగ్ దశలో కాలేజీలు కోర్టుకు వచ్చాయి. కాలేజీల అభ్యంతరాలపై ప్రభుత్వం, టీఏఎఫ్‌ఆర్‌సీ వేయబోయే కౌంటర్ల పరిశీలన తర్వాత విచారణ చేస్తాం. ఇదే సమయంలో సీబీఐటీకి ఫీజుల పెంపునకు ఉత్తర్వులు వెలువడిన మరో కేసులోని ఆర్డర్‌ను తిరిగి పరిశీలన చేయనున్నట్లు టీఏఎఫ్‌ఆర్‌సీ చెప్పింది. టీఏఎఫ్‌ఆర్‌సీ, ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను ఆగస్టు రెండో వారానికి వాయిదా వేసింది.

## మూడు సార్లు అసెంబ్లీ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన పత్రాలను సమర్పించారు. అనంతరం ఆయన బిఆర్‌కె భవన్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో అప్పటి మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన డాక్యుమెంట్స్‌ను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి,సాధారణ పరిపాలన కార్యదర్శి, నీటిపారుదల కార్యదర్శికి లేఖ రాసినప్పటికీ వారి నుంచి స్పందన రాలేదని వివరించారు. మీడియాలో వస్తున్న వార్తలను దృష్టిలో పెట్టుకుని తమ వద్ద ఉన్న సమాచారాన్ని విచారణ కమిషన్‌కు అందజేశామన్నారు. ఇటీవల సిఎం ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ 50 ఏళ్ల కాంగ్రెస్ ద్రోహ చరిత్రకు కవర్ పాయింట్ ప్రజెంటేషన్ అని ఎద్దేవా చేశారు. తాము తెలంగాణకు 299,ఎపికి 512 టిఎంసి నీటిని కేటాయించేందుకు శాశ్వత ఒప్పందం చేసుకున్నారని పదే పదే అబద్ధం చెప్పడం సిగ్గుచేటన్నారు. ఇది తాత్కాలిక నీటి వినియోగం అని అన్నారు. నీటి పంపకాన్ని ట్రిబ్యునల్ చేస్తుందని, వినియోగం కెఆర్‌ఎంబి చూస్తుందని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా 299 టిఎంసిలు చాలని 2025లో సిఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ ఎందుకు సంతకాలు పెట్టారని ప్రశ్నించారు. కొద్ది నెలల్లో కృష్ణాలో మంచి వాటా రాబోతున్నదని, అహంకారం, వెటకారం వదిలి తెలంగాణకు ఉపకారం చేసే మంచి బుద్ధితో నడుచుకోవాలని సిఎంకు సూచించారు.

## సామాజిక న్యాయం

(మొదటి పేజీ తరువాయి)

వెనుక ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఉన్నారని పేర్కొన్నారు. బిసి నేతలు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, మహేష్‌కుమార్ గౌడ్ తో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రులందరికి బిసి సెల్ నేతలు ధన్యవాదాలు చెప్పారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.కేశవరావ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి ఇతర నేతలు మీడియాతో మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లతో బిసిల కల నెరవేరిందని అన్నారు. సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, అయితే బిఆర్‌ఎస్ నేతలు ఈ విషయంలో అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని వారు విమర్శించారు. ఈ బిల్లుకి సంబంధించి చట్టం ప్రకారం ముందుకు వెళ్తున్నామని, బిల్లుకు అడ్డుపడవద్దని ప్రతిపక్షాలకు వారు విజ్ఞప్తి చేశారు. బిసి రిజర్వేషన్ల విషయంలో రాజకీయం చేయడం తగదని వారు బిఆర్‌ఎస్ నేతలకు సూచించారు. ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ మాట్లాడుతూ బిసిలంటే కెసిఆర్‌లో చులకన భావం ఉందని విమర్శించారు. బిసిలకు న్యాయం చేయాలనే చిత్తశుద్ధితోనే కాంగ్రెస్ ఈ ప్రయత్నం చేస్తోందని అన్నారు. బిసిలతో పాటు ప్రజలందరూ కాంగ్రెస్ ప్రభుత్వానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## జనజీవన స్రవంతిలో కలవండి

(మొదటి పేజీ తరువాయి)

కోరారు. ప్రభుత్వంతో చర్చలకు సిద్ధమని ప్రకటించిన మావోయిస్టులు ఆయుధాలు వీడేందుకు కూడా సిద్ధపడాలని సూచించారు. ఈ మేరకు 'ప్రజాపక్షం' పత్రికకు డిజిపి జితేందర్ బుధవారం ఇచ్చిన ఇంటర్వ్యూ వివరాలు ఇలా ఉన్నాయి.

**ప్రశ్న: మావోయిస్టులే లక్ష్యంగా సాగుతున్న కగార్ ఆపరేషన్ ఎప్పటి వరకు కొనసాగుతుంది?**

**జితేందర్:** జనవరి 2024లో ప్రారంభమైన కగార్ ఆపరేషన్ 2026 మార్చి 31 వరకు కొనసాగుతుంది. ఈ ఆపరేషన్ పూర్తిగా కేంద్ర బలగాల ఆధ్వర్యంలో సాగుతోంది. తెలంగాణ పోలీసులకు సంబంధం లేదు. కగార్ ఆపరేషన్ ద్వారా సాయుధ బలగాలు మావోయిస్టులపై పై చేయి సాధించాయి. ఈ ఆపరేషన్ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రాల సహకారంతో సాగుతోంది.

**ప్రశ్న: ఈ ఆపరేషన్‌లో ఇప్పటి వరకు ఎంత మంది మావోయిస్టులు మృతి చెందారు?**

**జితేందర్:** తెలంగాణ – ఛత్తీస్‌ఘడ్ సరిహద్దుల్లో జరిగిన కగార్ ఆపరేషన్‌లో గత రెండు నెలల్లో 31 మంది మరణించారు. ఇందులో కేంద్ర కమిటీ నాయకులు, డిసిఎం నాయకులు, సభ్యులు ఉన్నారు. ముగ్గురు పోలీసులు కూడా మరణించారు. మే 21న అబూజ్‌మాడ్ ఎన్‌కౌంటర్‌లో ఏకంగా 27 మంది మావోయిస్టులు మరణించారు. వీరిలో నంబాల కేశవరావు, సంగీత, భూమిక, రవిలు ముఖ్యులు. ముగ్గురు గ్రేహౌండ్స్ కమాండోలు రణధీర్, సందీప్, పవన్‌కళ్యాణ్‌లు కూడా మృతి చెందారు.

**ప్రశ్న: ఇప్పటి వరకు రాష్ట్రంలో ఎంత మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపో-యారు..?**

**జితేందర్:** ఈ ఏడాది ఆరు నెలల వ్యవధిలో పదుల సార్లు మావోయిస్టులు పోలీసుల ముందు తమ ఆయుధాలను అప్పగించి లొంగిపోయారు. ఇలా లొంగిపోయిన వారి సంఖ్య ఇప్పటి వరకు 350కి చేరుకుంది. లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం కల్పిస్తున్నాము. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో వారిపై ఉన్న రివార్డులను కూడా వారికే అందిస్తున్నాము. నగదుతో పాటు ఉపాధి కూడా కల్పించడంతో ప్రస్తుతం వారంతా సంతోషంగా జనజీవన స్రవంతిలో మంచి జీవితం గడుపుతున్నారు.

**ప్రశ్న: కర్రెగుట్ట ఆపరేషన్ ముగిసినట్లేనా?**

**జితేందర్:** కగార్ ఆపరేషన్‌లో భాగంగానే భద్రాద్రి కొత్తగూడం జిల్లా ఛతీస్‌ఘడ్ ప్రాంతంలోని కర్రెగుట్ట అటవీ ప్రాతంలో కర్రెగుట్ట ఆపరేషన్ ఏప్రిల్ 21 నుంచి మే 11 వరకు కొనసాగింది. పాకిస్తాన్‌తో యుద్ధ వాతావరణ నేపథ్యంలో తాత్కాలికంగా కర్రెగుట్ట నుంచి పోలీసు బలగాలను కేంద్ర ప్రభుత్వం వెనక్కి రప్పించింది. ప్రస్తుతం కర్రెగుట్ట, అబూడ్‌మాడ్ అడవుల్లో పోలీసుల గాలింపు కొనసాగుతుంది.

**ప్రశ్న: రాష్ట్రంలో పరిస్థితి ఏమిటి?**

**జితేందర్:** కగార్ ఆపరేషన్ వల్ల మావోయిస్టులు అర్బన్ ప్రాంతాలకు రావచ్చనే కేంద్ర నిఘా సంస్థల సూచించడంతో నిఘా వర్గాలతో పాటు తనిఖీలను ముమ్మరం చేశాము. ప్రస్తుతం రాష్ట్రంలో మావోయిస్టుల కదలికలు అంతగా లేవు. అయినా మా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉంది. స్లీపర్ సెల్స్‌పై నిరంతర సమీక్ష, వారికి కౌన్సిలింగ్, సమాజంలో తిరిగి చేరేందుకు సహకారం కొనసాగుతోంది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఘన స్వాగతం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర పర్యటనకు విచ్చేసిన భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్‌కు నేడు సాయంత్రం శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఘన స్వాగతం పలికింది. శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌లో సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ తో పాటు సుప్రీం కోర్ట్ జడ్జి జస్టిస్ పగిడిగంటం శ్రీ నర్సింహలకు రాష్ట్ర హై కోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజయ్ పాల్ తో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామ కృష్ణా రావు, డిజిపి డాక్టర్ జితేందర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి, ఎజి జి.సుదర్శన్ రెడ్డి తదితరులు ఘన స్వాగతం పలికారు.



# ఏడాదిన్నరలోనే రూ.50వేల కోట్లు

* తెలంగాణకు వచ్చిన పెట్టుబడులు
* లైఫ్ సైన్సెస్ రంగంలో కొత్తగా 60వేల మందికి ఉపాధి

**ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**




**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణను 'గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్'గా మార్చేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని, ఆ క్రమంలోనే కేవలం ఏడాదిన్నరలో రూ.50వేల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించగలిగామని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఫలితంగా కొత్తగా 60వేల మందికి ఉపాధి లభించిందన్నారు. శుక్రవారం హైటెక్ సిటీ ట్రైడెంట్ హోటల్‌లో 'ఇటి ఫార్మా టెక్ ఇన్నోవేటివ్ కాంక్లేవ్' రెండో ఎడిషన్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. '2024–25లో రూ.66వేల కోట్ల విలువైన లైఫ్ సైన్సెస్ ఉత్పత్తులను తెలంగాణ ఎగుమతి చేసింది. ప్రపంచానికి కావాల్సిన మూడింట ఒక వంతు వ్యాక్సిన్లను అందిస్తూ హైదరాబాద్ 'వ్యాక్సిన్ రాజధాని'గా ప్రసిద్ధి చెందింది. దేశంలో అతిపెద్ద మెడికల్ డివైసెస్ పార్క్ నుంచి 'మేడ్ ఇన్ తెలంగాణ' స్టెంట్లు, కేథెటర్లు యుఎస్, జపాన్ తో సహా 89 దేశాలకు ఎగుమతి అవుతున్నాయి' అని ఈ సందర్భంగా వివరించారు. 'లైఫ్ సైన్సెస్ లో గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో 5 లక్షల మంది కి కొత్తగా ఉపాధి అవకాశాలను కల్పించాలని మా ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకోసం రూ.లక్ష కోట్లతో దీర్ఘకాలిక పెట్టుబడి వ్యూహాన్ని అమలు చేయబోతున్నాం. అందరి అభిప్రాయాలను సేకరించి వికారాబాద్, నల్గొండ, మెదక్ లలో ఫార్మా విలేజెస్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం' అని చెప్పారు. ''లైఫ్ సైన్సెస్ రంగానికి అవసరమైన అత్యుత్తమ నైపుణ్య మానవ వనరులను అందించాలనే లక్ష్యంతో అంతర్జాతీ య ప్రమాణాలతో త్వరలోనే 'లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేయబోతున్నాం. ఇక్కడ స్వల్పకాలిక, దీర్ఘకాలిక కోర్సులను జీవ శాస్త్ర దిగ్గజ సంస్థల భాగస్వామ్యంతో అందించబోతున్నాం. ఇప్పటికే 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' ద్వారా డాక్టర్ రెడ్డీస్, అరబిందో లాంటి సంస్థలతో కలిసి తెలంగాణ యువతకు శిక్షణ ఇస్తున్నాం. సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్(సీ4ఐఆర్) భాగస్వామ్యంతో సైన్స్ గ్రాడ్యుయేట్లకు లైఫ్ సైన్సెస్ రంగంలో నిపుణులను తీర్చి దిద్దుతు న్నాం' అని పేర్కొన్నారు. 'లైఫ్ సైన్సెస్ రంగంలో 'తెలంగాణ' బ్రాండ్‌ను మరింత విశ్వవ్యాప్తం చేసేందు కు ప్రత్యేకంగా 'తెలంగాణ కాంప్రెహెన్సివ్ లైఫ్ సైన్సెస్ పాలసీ'కి శ్రీకారం చుట్టాం. ఇది చివరి దశలో ఉంది.. ఇప్పటికే మూడు జిల్లా ల్లో నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ల ను ముందే గుర్తించేందుకు ఎఐ ఆధారిత స్క్రీనింగ్‌ను ప్రయోగాత్మకంగా ప్రారంభించాం. సత్ఫలితాలు రావడం తో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వాసుపత్రులు, వైద్య కళాశాలలకు విస్తరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం'' అని వివరించారు. కార్యక్రమంలో పలు దిగ్గజ ఫార్మా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బిజెపి కాంట్రాక్టర్ల కోసమే బనకచర్ల : నారాయణ

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** ఎపి సిఎం చంద్రబాబు ఓవర్ యాక్షన్ వల్లే బనకచర్ల వివాదం తలెత్తిందని నారాయణ అన్నారు. రూ.80 వేల కోట్లతో బనకచర్ల ప్రాజెక్టు చేపట్టారని, అది పూర్తయ్యేనాటికి రూ.2 లక్షల కోట్ల వ్యయం అవుతుందన్నారు. హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, పశ్య పద్మ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కళవేన శంకర్, తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు, ఎం.బాలనరసింహలతో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నారాయణ మాట్లాడారు. బనకచర్ల ప్రాజెక్టులో అవినీతి అక్రమాలు చోటుచేసుకుంటాయని, దాని వెనుక బిజెపి కనుసన్నల్లో కాంట్రాక్టర్లు ఉన్నారని అన్నారు. కాంట్రాక్టర్ల పెట్టుబడితో ప్రాజెక్టు చేస్తే భవిష్యత్తులో టోల్ గేట్ దగ్గర వాహనాల వద్ద డబ్బులు వసూలు చేసినట్లు నీటికి డబ్బులు వసూలు చేస్తారన్నారు. సముద్రంలోకి వెళ్లే నీటితోనే బనకచర్ల కడుతున్నామని చెప్పుతున్నారని అన్నారు. ముందు ఇరు రాష్ట్రాల సిఎంలు చర్చించిన తరువాత, నీటి వాటాలు తెల్చిన అనంతరం ప్రాజెక్టులు నిర్మించుకోవాలన్నారు. ఈ బాధ్యతను కేంద్ర జల సంఘానికి అప్పగించాలని నారాయణ అన్నారు.

దేశంలోని వివిధ రాష్ట్రాల్లో తమ తాబేదార్ల ప్రభుత్వం ఉండాలి తప్ప ఇతరులు ఉండొద్దనే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని సిపిఐ నారాయణ విమర్శించారు. చివరకు తమిళనాడు, కేరళలలో గవర్నర్లు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వ (మంత్రివర్గం) నిర్ణయాలను అమలు చేయకుండా అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

చివరకు బిజెపికి అనుకూలంగా ఉన్నా పుదుచ్చేరి ప్రభుత్వానికి కూడా ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ఎన్నికల కమిషన్ బిజెపి పప్పెట్‌గా మారిందని విమర్శించారు. దేశానికి తలవంపులు తెచ్చేలా ప్రధాని మోదీ పరిపాలన కొనసాగుతున్నదని, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు గులాం మాదిరిగా మోదీ వ్యవహరిస్తున్నారని నారాయణ విమర్శించారు.





తెలంగాణ కనీస వేతనాల సలహామండలి సభ్యులుగా నియమితులైన ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసుఫ్, మహబూబాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన నల్ల సుధాకర్‌రెడ్డి లను అభినందిస్తున్న సిపిఐ నాయకులు

## మోదీ ఎగవేతదారుల పక్షమే : చాడ

ప్రధాని మోదీ బ్యాంకులను ముంచిన కార్పొరేట్‌ల పక్షం అని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. బ్యాంకులను ముంచినవారు విదేశాల్లో విలాసవంతమైన జీవితాలు గడుపుతున్నారని విమర్శించారు. ప్రశ్నించే వారి గొంతులపై కేసులు పెడుతున్నారని, ఈడి, ఐటి, సిబిఐ పేరిట వేదింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా వామ పక్ష పార్టీలు పెద్దఎత్తున మోదీ సర్కార్‌కు వ్యతిరేకంగా ఉద్యమాలు ఉధృతం చేయాలన్నారు. పంచాయతీ ఎన్నికలు ప్రతి ఐదేళ్లకోసారి తప్పనిసరిగా జరగాలన్నారు.

## కెసిఆర్ అసెంబ్లీకి రావాలి : కూనంనేని

మాజీ సిఎం కె.చంద్రశేఖర్ రావు అసెంబ్లీకి వచ్చి కాళేశ్వరం, బనకచర్ల తదితర అంశాలపై ఆయన అభిప్రాయాలు చెప్పాలని కూనంనేని సాంబశివ రావు కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అన్నీ తానే అని చెప్పుకున్న కెసిఆర్ తరువాత తనకు సంబంధం లేదనడంతో ఆయన ప్రతిష్ట పోయిందన్నారు. కాళేశ్వరం, బనకచర్ల రెండు సీరియస్ అంశాలేనని, కెటిఆర్ ప్రెస్‌క్లబ్‌కు వెళ్లడం సమస్యను పక్కదారి పట్టించడమే అన్నారు. ఈ రెండు అంశాలపై చర్చించేందుకు కెసిఆర్ అసెంబ్లీకి వచ్చేందుకు ఎందుకు సిద్ధంగా లేరని ప్రశ్నించారు. కాళేశ్వరం పెద్ద బ్లండర్ (తప్పిదం) అని సాంబశివరావు అన్నారు. బిఆర్‌ఎస్‌కు ఎవరైనా వ్యతిరేకంగా మాట్లాడితే పల్లా రాజేశ్వర్ రెడ్డి, జగదీశ్ రెడ్డి, ఇతర నాయకులు తామే పండింతులమన్నట్లుగా విమర్శలకు దిగుతున్నారని, అందరికి తెలియనిది వారొక్కరికే తెలుసా? అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమా ర్ రెడ్డి మాట్లాడితే వారికేమి తెలుసు అంటూ దబాయింపులకు పాల్పడుతున్నారని, అభిప్రాయాలు చేబితే కూడా దబాయింపులకు పాల్పడమేంటని ప్రశ్నించారు.

**స్థానిక సంస్థల్లో బిసిల రిజర్వేషన్ ఆర్డినెన్స్‌పై హర్షం**

బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేసేందుకు ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకువస్తామని నిర్ణయం తీసుకోవడం ఆహ్వానించదగ్గ పరిణామమని సాంబశివరావు అన్నారు. అయితే తమిళనాడు తరహాలో రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చి అమలు చేస్తే బాగుంటుందని, కేంద్రం ఈ బిల్లును తమ వద్ద పెండింగ్ పెట్టుకోవడం పై సమాధానం చెప్పాలన్నారు.

**జిఒ 282ను రద్దు చేయాలి**

సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలిసో తెలియకో 8 గంటల పనివిధానాన్ని 10 గంటలకు పెంచడం సరైందికాద ని కూనంనేని సాంబశివరావు అన్నారు. ఇది కార్పొరేట్ సంస్థలకు వత్తాసు పలకడమే అవుతుందని, దీనికి సంబంధించిన జి.ఓ 282 ఉపసంహరించుకోకపోతే కార్మికుల ఆందోళన తప్పదని, వారి ఆందోళనకు తాము మద్దతు ఇస్తామన్నారు. ఇటీవల సిగాచి కంపెనీలో జరిగిన ప్రమాదంలో అమాయక కార్మికులు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకొచ్చి, కేవలం రూ.8వేలు, రూ.9 వేల వేతనంతో పనిచేయిస్తున్నారని, ఇంత తక్కు వ వేతనంతో పనులు చేయిస్తున్నప్పటికీ పట్టించుకోని కార్మిక శాఖ సమాధానం చెప్పాలన్నారు. పూర్తి నిర్లక్ష్యంతో సిగాచి కంపెనీ యాజమాన్యం వ్యవహరించిందన్నారు.

**చంద్రబాబు ఆ ఐదు గ్రామాలు తెలంగాణకు ఇవ్వాలి**

పొరుగునున్న ఆంధ్రప్రదేశ్‌లో పురుషోత్తమపట్నంలోని ఆలయ భూముల ఆక్రమణను పరిశీలించేందుకు వెళ్ళిన భద్రాచలం రామాలయం ఇఒ పై దాడి జరగడాన్ని కూనంనేని తీవ్రంగా ఖండించా రు. ఇటువైపు వారు కూడా అటువైపు వారిపై దాడి చేస్తూ, పరిస్థితులు తీవ్రమవుతాయని హెచ్చరించారు. ఈ ఘర్షణల నేపథ్యంలో ఇప్పటికైనా ఆ ఐదు గ్రామాలను తెలంగాణకు వదిలేయాలని, ఇందుకు ఎపి సిఎం చంద్రబాబు బాధ్యత తీసుకోవాలన్నారు.

# బిసి రిజర్వేషన్ల అమలులో దేశానికే ఆదర్శం

**మీడియా సమావేశంలో రేణుకాచౌదరి**



**ప్రజాపక్షం/ఖమ్మం:** అందరికీ న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ప్రజల గురించి ఆలోచించి పని చేసేది కాంగ్రెస్ మాత్రమేనని రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి తెలిపారు. శుక్రవారం సంజీవరెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రేణుకాచౌదరి మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్ అమలుతో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు.

నాడు రాజీవ్ గాంధీ మహిళలకు 33శాతం రిజర్వేషన్‌ను స్థానిక సంస్థల్లో అమల్లోకి తీసు కు వస్తే ఇప్పుడు కొన్ని చోట్ల 50 శాతం కూడా అమలు చేస్తున్నారని ఆమె తెలిపారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంగా దేశవ్యాప్తంగా పరిస్థితులను పరిశీలించి బిసి రిజర్వేషన్ అమలుకు సంబంధించి ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో 42శాతం రిజర్వేషన్లకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని ఆమె తెలిపారు. పదేళ్లు అధికారం లో ఉండి మాట్లాడని కవిత ఇప్పుడు తాను ఉత్తరం రాస్తేనే రిజర్వేషన్లపై ప్రభుత్వం స్పందించిందని అనడం విడ్డూరంగా ఉందన్నారు. కెసిఆర్ బాగుండాలని రేణుకాచౌదరి ఆకాంక్షించారు. బిఆర్‌ఎస్ లో కొడుకు, బిడ్డ, అల్లుడు వ్యవహారం గురించి తాము స్పందించబోమని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

## బిజెపికి ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామా ఆమోదం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామాను బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా ఆమోదించారు. రామచందర్ రావుకు అధ్యక్ష బాధ్యతలు ఇవ్వడం పట్ల రాజాసింగ్ అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే బిజెపికి రాజీనామా చేస్తున్నట్లు గత నెల 30న కిషన్‌రెడ్డికి రాజాసింగ్ లేఖను అందచేశారు. రాజాసింగ్ రాజీనామా లేఖను కిషన్ రెడ్డి అధిష్ఠానానికి పంపా రు. ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామాను ఆమోదిస్తున్నట్లు శుక్రవారం బిజెపి జాతీయ కార్యదర్శి అరుణ్ సింగ్ అధికారికంగా ప్రకటించారు. రాజాసింగ్ ఆరోపణలు పార్టీ సిద్ధాంతానికి, న్యాయ సూత్రాలకు విరుద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. తన రాజీనామా ఆమోదంపై రాజాసింగ్ విడియో సందేశం ద్వారా స్పందించారు. తాను ఎందుకు రాజీనామా చేశానో అనే విషయాన్ని తన రాజీనామా లేఖలో పార్టీ అధిష్టానం చూసినట్లు లేదన్నారు. రాజీనామా ఆమోదంపై కార్యకర్తలు ఆందోళన చెందవద్దన్నారు. తాను మరింతగా దూకుడుగా పనిచేస్తానని అన్నారు.



# ప్రతి మండలానికి లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకం

**రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి రెవెన్యూ గ్రామానికి జిపిఒ, ప్రతి మండలానికి భూ విస్తీర్ణాన్ని బట్టి నాలుగు నుంచి ఆరుమంది వరకు లైసెన్సుడ్ సర్వేయర్లను నియమించబోతున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శిక్షణ పొందిన లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ఈ నెల 27వ తేదీన తుది పరీక్ష నిర్వహిస్తామని, 28, 29వ తేదీలలో జెఎన్‌టియు ఆధ్వర్యంలో ల్యాబ్ ప్రాక్టికల్ పరీక్ష నిర్వహిస్తామని, ఆగస్టు 12 న ఫలితాలను ప్రకటిస్తామని తెలిపారు. తుది పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు 40 రోజుల పాటు అప్రెంటిస్ శిక్షణ ఉంటుందన్నారు.

రెవెన్యూ అధికారులతో మంత్రి పొంగులేటి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూభారతి చట్టంలో రిజిస్ట్రేషన్ సమయం లో సర్వే మ్యాప్ తప్పనిసరి చేసిన నేపథ్యంలో ఇందుకు అవసరమైన సర్వేయర్లను అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో లైసెన్సుడ్ సర్వేయర్ల కోసం దరఖాస్తులను ఆహ్వానించగా, 10 వేలమంది దరఖాస్తు చేసుకున్నారని, ఇందులో తొలి విడతలో 7 వేల మందికి 33 కేంద్రాల్లో మే 26వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభించామన్నారు. ఈ నెల 26తో 50 రోజుల శిక్షణ పూర్తవుతుందని, మిగిలిన 3 వేల మందికి ఆగస్టు 2వ వారం నుంచి శిక్షణ ప్రారంభిస్తామని వివరించారు. రెవెన్యూ, సర్వే విభాగానికి మధ్య అవినాభావ సంబంధం ఉందని, సర్వే విభాగం బలోపేతంతోనే రెవెన్యూ వ్యవస్థలో మెరుగైన సేవలు అందించగలమని, దీనిని దృష్టిలో పెట్టుకొని సర్వే విభాగాన్ని బలోపేతం చేస్తున్నామని, గత పదేళ్ళలో సర్వే విభాగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని అన్నారు. రెవెన్యూ సేవలను సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంలో భాగంగా ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక జిపిఒను నియమిస్తున్నామన్నారు. విఆర్ఒ, విఆర్ఎలకు అవకాశం కల్పించాలనే ఉద్దేశంతోనే అర్హత పరీక్ష నిర్వహించగా 3,554 మంది ఎంపికయ్యారని వివరించారు. మరోసారి అవకాశం కల్పించాలన్న రెవెన్యూ సంఘాల అభ్యర్థన మేరకు ఈ నెల 27న మరోసారి వీరికి అర్హత పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు.

**ఐదు నక్షా గ్రామాల్లో రీసర్వే పూర్తి**

రాష్ట్రంలో నక్షా లేని 413 గ్రామాలకు గాను 5 గ్రామాలలో ప్రయోగాత్మకంగా రీ సర్వేను విజయ వంతంగా పూర్తి చేశామన్నారు. పైలెట్ గ్రామాలైన మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సలార్ నగర్‌లో 422 ఎకరాలు, జగిత్యాల్ జిల్లా భీర్పూ ర్ మండలం కొమ్మనాపల్లి (కొత్తది) గ్రామంలో 626 ఎకరాలు, ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమడలోని 845 ఎకరాలు, ములుగు జిల్లా వెంకటాపురం మండలం నూగురు లో 502 ఎకరాలు, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం షాహిద్ నగర్‌లో 593 ఎకరాలలో మొత్తం ఐదు గ్రామాలలోని 2988 ఎకరాలలో చిన్న వివాదాలకు తావు లేకుండా రైతుల సమక్షంలోనే క్షేత్రస్థాయిలో భౌతికంగా ఈ సర్వేను పూర్తి చేశామన్నారు. ఈ సర్వే ఫలితాలను పరిగణనలోకి తీసుకుని మిగిలిన గ్రామాల్లో కూడా రీ సర్వే నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పొంగులేటి చెప్పారు.



## ప్రజావాణిలో 281 దరఖాస్తులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 281 దరఖాస్తులు అందాయి.పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 67, రెవెన్యూ శాఖకు సంబంధించి 58, విద్యుత్ శాఖకు 24, పౌర సరఫరా శాఖకు 09, ఇందిరమ్మ ఇండ్ల కోసం 44, దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 78 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సిఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

# సంక్షేమంలో ఆదర్శంగా తీర్చిదిద్దాలి

**మంత్రులు కోమటిరెడ్డి, జూపల్లి, దామోదరం**



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రాన్ని సంక్షేమానికి ఆదర్శంగా తీర్చిదిద్దాలని మంత్రులు అన్నారు. శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి,పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు లు సంయుక్తంగా రంగారెడ్డి జిల్లా మాడ్గుల్ మండల కేంద్రంలో 12.70 కోట్ల రూపాయలతో నిర్మించబోయే 30 పడకల ఆసుపత్రి భవనానికి,మాడ్గుల వద్ద కోనాపూర్ నుండి మాడ్గుల వరకు అండ్ మాడ్గుల నుండి దేవరకొండ రోడ్ వరకు రూ.70 కోట్ల వ్యయంతో నిర్మించే బిటి(డబుల్ లైన్) రోడ్డునకు శంకుస్థాపన చేశారు.స్థానిక నాయకు లు అధికారులు మంత్రులకు పూర్ణకుంభంతో స్వాగతం ఘనంగా పలికారు.

అంబేద్కర్, జ్యోతిరావు పూలే, చాకలి ఐలమ్మ విగ్రహాలకు, మాజీ కేంద్రమంత్రి జైపాల్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన రాష్ట్ర మంత్రు లు,స్థానిక శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి లు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో భాగంగా మాడ్గుల వద్ద కోనాపూర్ నుండి మాడ్గుల వరకు, మాడ్గుల నుండి దేవరకొండ రోడ్డు వరకు డబల్ లైన్ రోడ్ పనులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగినదని, ప్రభుత్వం ఏర్పడిన తరువాత అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామని, ఉచిత కరెంటు, రైతులకు 2 లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేశామని, రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడం జరుగుతుందని తెలిపారు.అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇచ్చిన హామీలను అమలు చేసుకుంటూ ముందు తీసుకెళుతున్నామని, సన్న బియ్యానికి 500 రూపాయల బోనస్ ఇస్తున్నామని, ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను ఇస్తున్నామని,200 యూనిట్ల వరకు జీరో బిల్లు కరెంటు ఇస్తున్నామన్నారు. బిసి కులగణన చేపట్టి 42 శాతం చేపట్టడం జరుగుతుందని అన్నారు.

మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ జిల్లాలోని మాడ్గుల కేంద్రంలో ప్రజలకు మెరుగైన వైద్యమును అందించేందుకు గాను మండలంలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులకు నేడు శంకుస్థాపన చేసుకున్నామని, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పలు సంక్షేమ పథకాలను అమలు చేసుకుంటూ ముందుకు వెళ్ళుతున్నామని, త్వరలోనే మహిళా సాధికారత సంపూర్ణంగా తీసుకురావడం జరుగుతుందని, పేదవారికి బాసటగా నిలుస్తూ సంక్షేమానికి తెలంగాణ ఆదర్శంగా నిలవాలని పని చేస్తున్నామని అన్నారు. ఆ తర్వాత మంత్రులు మాడ్గుల మండలంలోని 220 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో కల్వకుర్తి శాసన సభ్యులు కసి రెడ్డి నారాయణ రెడ్డి,జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వేంకటేశ్వర రావు, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్ రెడ్డి, రాష్ట్ర మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్, ఆర్ అండ్ బి అధికారులు, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్లను స్వాగతించిన టిజెఎస్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని తెలంగాణ జన సమితి స్వాగతిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె వినయ్ కుమార్ అన్నా రు. హైదరాబాద్‌లోని టిజెఎస్ కార్యాలయంలో టిజెఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నర్సయ్యగౌడ్ తో కలిసి పల్లె వినయ్ కుమార్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ గత టిఆర్‌ఎస్ ప్రభుత్వం 32 నుంచి 18 శాతానికి రిజర్వేషన్ల ను తగ్గిస్తే, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏకంగా 42 శాతం పెంచ డం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ రిజర్వేషన్ల అమలుతో రాష్ట్రంలో సామాజిక న్యాయం జరుగుతుందని, సామాజిక తెలంగాణ దిశగా వెళ్లేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో టిజెఎస్ నాయకులు బట్టల రామ చందర్, ధారసత్యం, హనుమంత్ రెడ్డి, హనుమంతు గౌడ్, లక్ష్మ ణ్, జైపాల్ రెడ్డి,మాణిక్యం, సురేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



**CHANGE OF NAME**

I, GUNDU RAVI, S/o. GUNDU SAMMAIAH, H.No: 3-12-32, Kumarpally, Hanamkonda (mdl), Hanamakonda (Dist),Telangana., I have changed my Daughter Name from GUNDU SMILY (Old Name) to GUNDU SRI VIDHYA (New Name) for all purpose.

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

NIT No. 10/DB/EE/Alwal Circle/GHMC/2025-26 ప్రకటన తేది: 11.07.2025

**పని పేరు:** ప్రీకాస్ట్ ఆర్‌సిసి ప్రహరీ గోడ నిర్మాణం, **అంచనా విలువ:** రూ.13.50 లక్షలు, **ప్రారంభ తేదీ & సమయం:** 14.07.2025న సా.4.30గం.లకు, **బిడ్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం:** 22.07.2025న సా.4.30గం.ల వరకు, ఇఇ **పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అల్వాల్ సర్కిల్-27, జిహెచ్‌ఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.eprocurement.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అల్వాల్ సర్కిల్-27, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 4931-PP/CL/ADVT/1/2025-26, Date: 11-07-2025

**తెలంగాణ ప్రభుత్వం, రోడ్లు మరియు భవనాల శాఖ**

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B), జిల్లా R&B కార్యాలయం, సూర్యాపేట జిల్లా.

NIT No. 17/D1/PA to EE/SRPT/2025-26, ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు తేది: 05.07.2025

''సూర్యాపేట జిల్లాలోని కండిబండ గ్రామం సమీపంలో కోదాడ్ - రేవూర్ రోడ్డులో కూలిపోయిన వంతెన స్థానంలో కి.మీ. 16/8-10 వద్ద హై లెవల్ వంతెన నిర్మాణం. (ఉప పని: ప్రీ-సర్వే మరియు ప్రాథమిక సబ్ సాయిల్ ఇన్వెస్టిగేషన్ నిర్వహించడం)'' **మొత్తం ఖర్చు సుమారు:** రూ. 5.90 లక్షలు. టెండరుదారులు బిడ్ పత్రాలను ఇ-మార్కెట్ ప్లేస్ అంటే www.eprocurement.gov.in నుండి 10.07.2025 మధ్యాహ్నం 3.00 గంటల నుండి 14.07.2025 మధ్యాహ్నం 3.00 గంటల వరకు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. **బిడ్లను స్వీకరించడానికి చివరి తేదీ: 14.07.2025 లేదా అంతకు ముందు మధ్యాహ్నం 3.30 గంటల వరకు.** మరిన్ని వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అంటే www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిల్లా R&B కార్యాలయం, సూర్యాపేట జిల్లా.

DIPR R.O. No. : 4911-PP/CL/ADVT/1/2025-26, Date: 11-07-2025

**మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం, దమ్మాయిగూడ.**

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా.

టెండర్ నోటీసు నెం. E1/08/DMC/2025-26, టెండర్ నోటీసు తేది: 10.07.2025

కమిషనర్, దమ్మాయిగూడ మున్సిపాలిటీ క్రింద చూపిన విధంగా రిజిస్టర్డ్ సంస్థలు / కాంట్రాక్టర్ల నుండి టెండర్లు / ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లలో పాల్గొనమని ఆహ్వానించడమైనది.

| క్ర.సం. | వివరణ | మొత్తం విలువ (లక్షల్లో) |
| --- | --- | --- |
| 1. | దమ్మాయిగూడ మున్సిపాలిటీలో LED అమర్చిన PCB ప్యానెల్ సేకరణకు EOI | 2.00 |
| 2. | దమ్మాయిగూడ మున్సిపాలిటీ కీసరలోని PHCలో ఉన్న టాయిలెట్ మరమ్మతులు | 1.00 (బాక్స్ టెండర్) |
| 3. | దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని బండ్లగూడ వీకర్స్ సెక్షన్ కాలనీలో అంగన్వాడీ కేంద్రంలోని టాయిలెట్ నిర్మాణం | 1.00 (బాక్స్ టెండర్) |
| 4. | దమ్మాయిగూడ మున్సిపాలిటీలో బోర్ బావుల నిర్వహణ మరియు వీధి దీపాల కోసం లూజ్ మెటీరియల్ | 5.00 |
| 5. | దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని వార్డు నెం.04లోని గోవింద్ సింగ్ హౌస్ నుండి బి.సునీత హౌస్ వరకు భూగర్భ డ్రైనేజీ వేయడం (రీకాల్) | 5.00 |
| 6. | దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని వార్డు నెం.10లోని సిద్దార్థ కాలనీలో ఇ.నెం.7-26/3/1 నుండి ఇ.నెం.7-28/12 వరకు UGD వేయడం | 5.00 |
| | ఇతర అభివృద్ధి పనులు | |

1) దరఖాస్తు ప్రారంభ తేదీ & సమయం: 11.07.2025 ఉదయం 10:30
2) దరఖాస్తు ముగింపు తేదీ & సమయం : 18.07.2025 ఉదయం 10:30
ఇతర వివరణల కోసం దయచేసి మున్సిపల్ ఆఫీస్ R/o: దమ్మాయిగూడ మున్సిపాలిటీ కార్యాలయం, SBI ఎదురుగా, దమ్మాయిగూడ 'X' రోడ్. (లేదా) ఫోన్ నంబర్ +91 9154075628 ని సంప్రదించండి.

సం/- కమిషనర్, దమ్మాయిగూడ మున్సిపాలిటీ.

DIPR R.O. No. : 4859-PP/CL/ADVT/1/2025-26, Date: 11-07-2025

ప్రజాపక్షం
శనివారం, 12 జులై

# బిఆర్ఎస్ దుందుడుకుతనం

ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి దుందుడుకుగా వ్యవహరిస్తూ వార్తల్లో నిలుస్తోంది. గతంలో కూడా రాష్ట్ర ప్రభుత్వానికి ఏదో విధంగా ఆటంకాలు సృష్టించేందుకు ప్రయత్నం సాగించింది. అది హైడ్రా విషయంలో గానీ, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం పక్కనుండే కంచె గచ్చిబౌలి భూముల విషయంలో గానీ చేసిన రాద్ధాంతం అందరికీ గుర్తే. ఇటీవల డోసును మరింత పెంచి, ఏదోరకంగా ఇబ్బందులు సృష్టించడంలో తలమునకలై ఇరాకటంలో పడుతోంది బిఆర్ఎస్. అయినా తన ధోరణిని మార్చుకోవడం లేదు. హైదరాబాద్‌లోని ఒక తెలుగు మీడియా ఛానల్ ప్రధాన కార్యాలయంపై ఆ పార్టీ కార్యకర్తలు దాడి చేసిన ఉదంతం, తదనంతరం నాయకులు చేసిన ప్రకటనలు బిఆర్ఎస్‌లో పెరిగిన అసహనానికి దర్పణం పడుతోంది. నిజానికి ఆ మీడియా సంస్థ తమ యూట్యూబ్ ఛానల్‌లో బిఆర్ఎస్ ముఖ్య నేత కెటిఆర్‌కు సంబంధించి పెట్టిన వీడియోల థంబ్ నెయిల్స్ వాడిన భాష అభ్యంతరకరమైనదే. కానీ, బిఆర్ఎస్ ఆ అంశాన్ని ఎత్తి చూపితే, దానిపై చర్చ జరిగేది. అలా కాకుండా ఏకంగా గులాబీ పార్టీ కార్యకర్తలు ఆ ఛానల్ కార్యాలయానికి వెళ్ళి వీరంగం సృష్టించడంతో అసలు విషయం పక్కకు తొలగింది. రెండు దశాబ్దాలకు పైగా తెలంగాణ ఉద్యమం, పిమ్మట అధికారంలో ఉన్న పార్టీ ఎన్నడూ ఇలాంటి దాడులకు పాల్పడకపోవడమే కలిసి వచ్చింది. ఇప్పుడు దాడి చేయడమే కాకుండా, అడ్డంగా సమర్థించుకున్న తీరు ఆ పార్టీ పట్ల సానుకూలంగా ఉండే వారిలో కూడా ఏహ్యత కలిగించింది. పైగా ఎన్నడూ లేని విధంగా తెలంగాణ ఉద్యమంలో కూడా లేని విధంగా అతివాదంతో వ్యవహరిస్తూ, హైదరాబాద్‌లో స్థిరపడిన పొరుగు తెలుగు రాష్ట్రానికి సంబంధించి దూకుడుగా చేసిన వ్యాఖ్యలు సరైన సంకేతాలను పంపడం లేదు. నిజానికి గత శాసనసభ ఎన్నికల్లో బిఆర్ఎస్ గెలుపొందిన స్థానాలలో అత్యధికంగా గ్రేటర్ హైదరాబాద్ నుండే ఉన్నాయి. అందులో కూడా సెటిలర్లు ఎక్కువ ఉన్న చోట్ల భారీ మెజారిటీనే సాధించింది. ఉన్నట్లుండి బిఆర్ఎస్ భిన్న వైఖరి ప్రదర్శించడం సందేహాలకు తావిస్తోంది.

గత శాసననసభ ఎన్నికల్లో తెలంగాణవాదం బలంగా ఉన్న ప్రాంతాలలో బిఆర్ఎస్ గెలుపొందలేకపోయింది. గతంలో ఉద్యమానికి దన్నుగా నిలిచిన ఉత్తర తెలంగాణ, గ్రామీణ తెలంగాణ ప్రాంతాలలో కూడా ఓట్లు తగ్గాయి. త్వరలో స్థానిక ఎన్నికలు జరుగనుండడంతో తమకు దూరమైన తెలంగాణ వాదాన్ని తిరిగి ఉపయోగించుకునేందుకే ఈ తతంతగమనే మాట వినపడుబతోంది. అంతే కాకుండా ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన టిడిపి అధినేత చంద్రబాబునాయుడు తెలంగాణపై దృష్టి పెట్టనున్నట్లు సంకేతాలిచ్చారు. తెలంగాణ రాష్ట్రం తొలి ఎన్నికల్లో టిడిపి 15 స్థానాలు గెలుచుకున్నప్పటికీ, అనంతరం పరిణామాల్లో ఆంధ్రకే పరిమితమైంది. అప్పుడు ఇక్కడి టిడిపి ఎంఎల్‌ఎలు, కార్యకర్తల్లో సింహభాగం బిఆర్ఎస్ బాటపట్టారు. ఇప్పుడు టిడిపి అధికారంలో ఉండడంతో పాటు, కేంద్రంలో దానిపై ఆధారపడిన బిజెపి ప్రభుత్వం ఉండడంతో బిఆర్ఎస్‌లో ఆందోళన నెలకొందని చెప్పొచ్చు. ఏపిలో కూటమిగా ఉన్న టిడిపి, బిజెపి, జనసేనలు, తెలంగాణలో కూడా కలిసి పోటీ చేస్తాయనే ప్రచారం జరుగుతున్నది. కేంద్రంలో, ఏపిలో అధికారంలో ఉన్న టిడిపి ఒకవేళ దృష్టి సారిస్తే తమ పార్టీలో ఉన్న పాత టిడిపి శ్రేణులు ఆ పార్టీ వైపు మొగ్గుతాయేమోననే అనుమానాలు కూడా బిఆర్ఎస్‌లో వ్యక్తమవుతున్నాయి. కాబట్టి నష్టనివారణలో భాగంగా, తాము అధికారంలో ఉన్నప్పుడు మరిచిన తెలంగాణ సెంటిమెంట్‌ను తిరగదోడి, కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. అందుకే బనకచర్ల విషయంలో సెంటిమెంట్‌ను రెచ్చగొట్టి లబ్ధి పొందేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నా, గతంలో వారి ప్రభుత్వమే గోదావరి జలాలను రాయలసీమకు పంపొచ్చని చేసిన అధికారిక ప్రకటనల ముందు అది పని చేయకుండా పోతుంది. అందుకే నీటి పేరుతో ఎంత రెచ్చగొట్టినా సెంటిమెంటు ఫార్ములా పని చేయడం లేదు. నిస్పృహ, అసహనంలో కొట్టుమిట్టాడుతున్న ప్రతిపక్ష పార్టీ ఏదో ఒక అంశంతో రెచ్చగొట్టేందుకు వెనుకాడడం లేదు. అసెంబ్లీలో చర్చకు ప్రతిపక్ష నేత కెసిఆర్ రావాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాలుపై కెటిఆర్ తనతో చర్చకు రావాలని ప్రెస్‌క్లబ్‌కు వెళ్ళిన తీరూ వారికి ఆశించిన ఫలితమివ్వలేదు. దీంతో బిఆర్ఎస్ నేతలు ఇష్టమొచ్చినట్లు తూలనాడడమే పనిగా పెట్టుకొని, వితండవాదానికి దిగుతున్న వైనాలు కూడా ద్యోతకమవుతున్నాయి. సోషల్ మీడియా వార్‌కు తోడు ఇటీవల ఒక ఛానల్‌లో జరిగిన చర్చలో కాంగ్రెస్ నేతపై ఒక బిఆర్ఎస్ నేత చేయి చేసుకున్న తీరు అందుకు పరాకాష్ఠ. ఇది రాజకీయ అనారోగ్య వాతావరణానికి దారితీసి, పరిస్థితి చేజారిపోయే ప్రమాదం కనపడుతోంది. ఇప్పటికైనా ఇలాంటి విపరిణామాలకు చెక్ పెట్టాల్సిన గురుతర బాధ్యత ప్రతిపక్ష నేతపై ఉన్నదని విజ్ఞులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రభుత్వాన్ని నిలదీసేందుకు, జవాబు దారీని చేసేందుకు, తమ అభిప్రాయాలను, అభ్యంతరాలను వ్యక్తీకరించడం ద్వారా ప్రజల దృష్టిని ఆకర్షించడమే కాకుండా, వారిని తమ వైపు తిరిగి మలుపుకునేందుకు ప్రతిపక్షానికి చట్టసభ(అసెంబ్లీ)నే అత్యున్నత ప్రజాస్వామిక వేదిక.

# బ్రిక్స్ చైర్మన్ హోదాలో అమెరికాను మోదీ ఎదిరించగలడా?



నిత్యా చక్రవర్తి

అభివృద్ధి చెందుతున్న దేశాల రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలపై పెరుగుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దాడుల నేపథ్యంలో, దక్షిణ భూగోళం ప్రయోజనాలను పరిరక్షించే వ్యక్తిగా భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిష్టను బ్రెజిల్‌లో జూలై 6, 7 తేదీల్లో జరిగిన 17వ బ్రిక్స్ సదస్సు పాక్షికంగా పునరుద్ధరించడానికి సహాయపడింది.

ప్రధాని జూలై 2–9 పర్యటనలో ఘనా, ట్రినిడాడ్ టొబాగో, అర్జెంటీనా, నమీబియాలకు అధికారిక సందర్శనలు ఉన్నాయి. సదస్సు ముగిసిన తర్వాత బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డా సిల్వాకు (ఆయననే లూలా అని పిలుస్తారు) ఆయన అధికారికంగా అతిథిగా కూడా ఉన్నారు. భారత ప్రధాని పర్యటన సందర్భంగా దక్షిణ భూగోళంలోని ఈ ఐదు దేశాలతో జరిగిన చర్చలు, సంతకాలు చేసిన ఒప్పందాలతో గ్లోబల్ సౌత్‌కు భారతదేశాన్ని స్నేహపూర్వక పెద్ద ఆర్థిక శక్తిగా నిలబెట్టడానికి సహాయపడ్డాయి.

*ప్రస్తుతం అభివృద్ధి చెందుతున్న దేశాలపై ట్రంప్ విధించిన ఏకపక్ష సుంకాల రేట్లను వ్యతిరేకించడం ద్వారా వాటి వాణిజ్య ప్రయోజనాలను రక్షించడమనేది ప్రధాన సమస్య. ఈ పోరాటానికి 2026లో 18వ బ్రిక్స్ సదస్సుకు అధ్యక్షుడిగా వస్తున్న నరేంద్ర మోదీ నాయకత్వం వహించాలి. డొనాల్డ్ ట్రంప్‌కు వ్యతిరేకంగా బలమైన వైఖరి తీసుకోకుండా ఆయన ఈ పోరాటానికి నాయకత్వం వహించలేరు. అమెరికా అధ్యక్షుడి సహాయం పొందడానికి ఇంత పెట్టుబడి పెట్టిన తర్వాత ఆయన ఆ విధంగా చేస్తారా? ఈ ఏడాది చివర్లో అమెరికా ప్రాయోజిత క్వాడ్ సదస్సు భారతదేశంలో జరగనుంది.*

రియో డి జనీరోలో జరిగిన బ్రిక్స్ సదస్సు సంయుక్త ప్రకటనలో గాజాలో ఇజ్రాయెల్ చర్యలను ఖండించడంలో, అలాగే ఇరాన్‌పై దాడులను ఖండించడంలో భారతదేశం వైఖరి మార్పు అనేది ముఖ్యమైన ఫలితం. అమెరికా పేరు చెప్పనప్పటికీ, ఈ తీర్మానంలో భారతదేశం సంతకం చేయడం గత వైఖరి కంటే ముందడుగు వేయడమే. పాలస్తీనావాసులను ఇజ్రాయెల్ హతమార్చడంపై, అలాగే ఇరాన్ ఎలాంటి కవ్వింపు పాల్పడనప్పటికీ అమెరికా ఆ దేశంపై పెద్ద దాడి చేసి, అణు సదుపాయాలతో పెద్ద భాగాన్ని కూల్చివేసిన విషయంలో అంతకు ముందు వైఖరికి ఇది భిన్నం.

ఈ ఏడాది జూలై 6,7 తేదీల్లో జరిగిన బ్రిక్స్ సదస్సు వరకు, దక్షిణాఫ్రికా, బ్రెజిల్‌తో సహా దక్షిణ భూగోళంలోని ప్రముఖ దేశాల దృష్టిలో భారతదేశం అంటే ట్రంప్‌కు విశ్వసనీయ మిత్రదేశంగా, బ్రిక్స్ లేదా ఎస్‌సిఒ పనితీరు కంటే క్వాడ్‌పై ఎక్కువ ఆసక్తి చూపే దేశంగా సందేహిస్తున్నదంగా ఉండేది. బ్రెజిల్, దక్షిణాఫ్రికా అధ్యక్షులు నెతన్యాహును అరెస్టు చేయాలని, ఆయనను యుద్ధ నేరస్థుడిగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నప్పుడు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనంగా ఉన్నారు. మన ప్రభుత్వం ఇజ్రాయెల్‌తో ఆర్థిక, రక్షణ సంబంధాల విస్తరణ ప్రణాళికలను కొనసాగించింది. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం సమయంలో కూడా ఇజ్రాయెల్‌లో భారత కార్మికులు, సాంకేతిక నిపుణులను ఉద్యోగాలు చేయడానికి భారతదేశం అనుమతించింది.




ఇప్పుడు రియో సదస్సులో దక్షిణ భూగోళ ప్రయోజనాలను గట్టిగా సమర్థించడం ద్వారా భారత ప్రధాని ప్రతిష్ట పాక్షికంగా పునరుద్ధరించబడిన ఆయన బ్రిక్స్ సమావేశంలో ఇచ్చిన వాగ్దానాన్ని ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేయాలి. భారతదేశం 2026లో బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించనుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ భారతదేశంలో సదస్సును నిర్వహిస్తారు. దక్షిణ భూగోళానికి సంరక్షకుడిగా ఈ పదవి ఆయనకు పెద్ద బాధ్యతలను అప్పగించింది. ఆయన దక్షిణ భూగోళ ప్రయోజనాలను నిరంతరం చూసుకోవాలి.

ప్రస్తుతం అభివృద్ధి చెందుతున్న దేశాలపై ట్రంప్ విధించిన ఏకపక్ష సుంకాల రేట్లను వ్యతిరేకించడం ద్వారా వాటి వాణిజ్య ప్రయోజనాలను రక్షించడమనేది ప్రధాన సమస్య. ఈ పోరాటానికి 2026లో 18వ బ్రిక్స్ సదస్సుకు అధ్యక్షుడిగా వస్తున్న నరేంద్ర మోదీ నాయకత్వం వహించాలి. డొనాల్డ్ ట్రంప్‌కు వ్యతిరేకంగా బలమైన వైఖరి తీసుకోకుండా ఆయన ఈ పోరాటానికి నాయకత్వం వహించలేరు. అమెరికా అధ్యక్షుడి సహాయం పొందడానికి ఇంత పెట్టుబడి పెట్టిన తర్వాత ఆయన ఆ విధంగా చేస్తారా? ఈ ఏడాది చివర్లో అమెరికా ప్రాయోజిత క్వాడ్ సదస్సు భారతదేశంలో జరగనుంది. సదస్సులో పాల్గొంటారని భావిస్తున్న ట్రంప్‌ను ప్రసన్నం చేసుకోవడానికి ఆతిథ్యం ఇస్తున్న నరేంద్ర మోదీ సార్వభౌమమైన ప్రతిధి చేయవలసి ఉంటుంది. 2026లో మళ్ళీ ఆయనే ఆతిథ్యం ఇవ్వాల్సిన బ్రిక్స్ సదస్సులోని కీలక సమస్యలకు భంగం వాటిల్లకుండా భారత ప్రధానమంత్రి ఈ క్వాడ్ సదస్సును ఎలా నిర్వహిస్తారో?

బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సోనారోపై విచారణ పేరుతో అధ్యక్షుడు లూలా ప్రభుత్వ ఉత్పత్తులపై తమ ప్రభుత్వం 50% సుంకాన్ని విధిస్తుందని డొనాల్డ్ ట్రంప్ బుధవారం ప్రకటించారు. బ్రెజిలియన్ చట్టాల ప్రకారం జరుగుతున్న విచారణతో సుంకాల రేటును ముడిపెట్టడం ద్వారా ట్రంప్ బ్రెజిల్ అంతర్గత వ్యవహారాల్లో నేరుగా జోక్యం చేసుకుంటున్నారు. బోల్సోనారో అధ్యక్షుడు లూలాకు వ్యతిరేకంగా తిరుగుబాటుకు ప్రేరేపించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఆయన కఠినమైన మితవాద రాజకీయ నాయకుడు, ట్రంప్ అనుచరుడు, అలాగే నరేంద్ర మోదీ స్నేహితుడు. వాస్తవానికి, రాజకీయ విశ్లేషకులు ట్రంప్, బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సోనారో, అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలే, ఫ్రాన్స్ నేషనల్ ర్యాలీ సుప్రీమో మేరీ లీపెన్, భారత ప్రధాని నరేంద్ర మోదీని ప్రపంచ పచ్చి మితవాదపక్షంలో భాగంగా చేర్చారు.

ట్రూత్ సోషల్‌లో లేఖలను పోస్ట్ చేస్తూ, అమెరికా అధ్యక్షుడు బుధవారం మరో ఏడు దేశాలను, అంటే ఫిలిప్పీన్స్, బ్రూనై, మోల్డోవా, అల్జీరియా, లిబియా, ఇరాక్, శ్రీలంకలను లక్ష్యంగా చేసుకొని ఆగస్టు 1 నుంచి అమెరికాకు వాటి ఎగుమతులపై కఠినమైన సుంకాలను ప్రకటించారు. ఇప్పటివరకు భారతదేశం–అమెరికా వాణిజ్య ఒప్పందం కుదరలేదు. అయితే, చర్చలు తుది దశలో ఉన్నాయి. భారతదేశ వ్యవసాయ, పాల ఉత్పత్తుల రంగంలోకి ప్రవేశించడానికి భారతీయ చర్చల బృందంతో అమెరికా ఎలాంటి రాయితీలను రాబట్టిందో ఇంకా తెలియరాలేదు. చర్చలకై మూడోసారి భారత ప్రతినిధివర్గం వాషింగ్టన్‌కు వెళుతున్నది.

బోల్సోనారోకు వ్యతిరేకంగా న్యాయపరమైన చర్యలను నిలిపివేయాలన్న ట్రంప్ డిమాండ్‌ను బ్రెజిల్ అధ్యక్షుడు లూలా తిరస్కరించాడు. బ్రెజిలియన్ దిగుమతులపై 50% సుంకం వాణిజ్య లోటును పూడ్చడం అవసరమని ట్రంప్ చేసిన వాదనను కూడా లూలా తిరస్కరించారు. వాస్తవానికి అలాంటి లోటు లేదు. ట్రంప్ ఆరోపణలకు అధ్యక్షుడు లూలా ఒక్కొక్క అంశం వారీగా సమాధానం ఇచ్చారు. బ్రెజిల్ స్వతంత్ర సంస్థలతో కూడిన సార్వభౌమ దేశం అని, ఏ రకమైన జోక్యాన్ని అంగీకరించబోదని స్పష్టం చేశారు.

అమెరికా అధ్యక్షుడు బుధవారం డజన్ల కొద్దీ దేశాలపై సుంకాలను పెంచడానికి షెడ్యూల్ సిద్ధమైంది. ఈ వారం ప్రారంభంలో ఆయన తాజాగా మరో మూడు వారాల ఆలస్యమవుతుందని చెప్పి, ఆగస్టు 1 వరకు సమయం తీసుకున్నట్లు ప్రకటించారు. అయితే ఆ రోజు నాటికి వైట్‌హౌజ్‌తో ఒప్పందం కుదుర్చుకోకపోతే దేశాలు ఎదుర్కొనే కొత్త రేట్లను ప్రకటించడం ప్రారంభించారు. బంగ్లాదేశ్, జపాన్, దక్షిణ కొరియాతో సహా 14 దేశాల నుండి దిగుమతి చేసుకున్న వస్తువులపై 40 శాతం వరకు అమెరికా సుంకాలను ట్రంప్ సోమవారం ప్రకటించారు. ట్రంప్ బుధవారం మరో 11 దేశాలకు లేఖలు రాశారు.

బ్రిక్స్ సదస్సు ప్రకటన వెలువడిన వెంటనే, డాలరీకరణను ప్రోత్సహిస్తున్నాయని ఆ దేశాలపై 10 శాతం అదనపు సుంకాన్ని విధించనున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ నిర్ణయం భారతదేశాన్ని వెంటనే ప్రభావితం చేస్తుంది. కాబోయే బ్రిక్స్ అధ్యక్షుడిగా భారత ప్రధానికి ఈ అదనపు పెంపును, అలాగే బ్రెజిల్‌పై అనవసరమైన కారణాలతో భారీ 50 శాతం సుంకాన్ని విధించడాన్ని వ్యతిరేకించే తక్షణ బాధ్యత ఉంది. దక్షిణ భూగోళ నాయకుడిగా భారత ప్రధాని ఈ సున్నితమైన అంశంపై ట్రంప్‌కు సమాధానం ఇస్తారా, ఆయనను ఎదుర్కొంటారా?

భారతదేశానికి ఇప్పుడు తన విస్తారమైన జనాభా, వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థతో దక్షిణ భూగోళం సహజ నాయకుడిగా తన పాత్రను పోషించడానికి పెద్ద అవకాశం ఉంది.ఈ విషయాన్ని విదేశాంగ శాఖకు వదిలేస్తే, దక్షిణ భూగోళం ప్రధాన చోదక శక్తిగా భారతదేశం తన పాత వైభవాన్ని తిరిగి పొందగలదు. కానీ,గత ఐదు సంవత్సరాలుగా భారత ప్రధాని పూర్తిగా తన సొంత సిద్ధాంతం ఆధారంగా విదేశీ దౌత్య ప్రణాళిక పనిని చేపట్టారు. ఇది దౌత్యపరమైన ఏకాకితనానికి దారి తీసింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత మన భారతీయ దౌత్యవేత్తలు మరింత ఇబ్బంది పడుతున్నారు.

భారతదేశం తన దౌత్య సవాళ్లను నిశితంగా సమీక్షించి, 2025, 2026లో దేశ ప్రయోజనాలకు అనుగుణంగా మోదీ సిద్ధాంతాన్ని సవరించాల్సిన సమయం ఆసన్నమైంది. ట్రంప్ ప్రభుత్వం పెట్టిన ఒత్తిళ్లను ధిక్కరించడం ద్వారా, దక్షిణ భూగోళానికి నిజమైన నాయకుడిగా ఆవిర్భవించేందుకు, భారతదేశ విదేశాంగ విధానం భవిష్యత్ దిశను రూపొందించేందుకు 2026లో బ్రిక్స్ అధ్యక్ష హోదా భారతదేశానికి అరుదైన అవకాశాన్ని ఇచ్చింది. భారతదేశం తన వ్యూహాన్ని పునరుద్ధరిస్తుందా లేదా అమెరికాను అనుసరించే పాత మార్గాన్ని కొనసాగిస్తుందా అనేది మన శక్తిమంతమైన ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ఆధారపడి ఉంటుంది.


# ప్రపంచ మహిళా శక్తికి మారుపేరు మలాలా



నోబెల్ శాంతి పురస్కారాన్ని పొందిన అతి చిన్న వయస్కురాలిగా మలాలా యూసఫ్‌జాయ్ రికార్డును నెలకొల్పడం మనకు తెలుసు. కేవలం 17 సంవత్సరాల వయస్సులోనే ఆమె బాలికలకు విద్యా హక్కు, లింగ సమానత్వం, మహిళా సాధికారత లాంటి సామాజిక సవాళ్లను అతి చిన్న వయస్సులోనే చేపట్టి ప్రపంచ మానవాళి దృష్టిని ఆకర్షించిన మలాలా యూసఫ్‌జాయ్ జన్మదినం జూలై 12 సందర్భంగా ఐరాస నేతృత్వంలో ప్రతి ఏటా మలాలా దినోత్సవం పాటించడం ఆనవాయితీగా మారింది. అసమాన ధైర్య సాహసాలకు ప్రతీకగా నిలిచిన చిన్నారి ప్రపంచ మానవాళిని ప్రభావితం చేసిన అతి కొద్ది మందిలో ఒకరుగా పేరుగాంచింది. ఒక బిడ్డ, ఒక టీచర్, ఒక పుస్తకం, ఒక కలం ప్రపంచాన్ని మార్చగలవు అని నమ్మే మలాలా యూసఫ్‌జాయ్ పాకిస్థాన్‌లోకి ఒక చిన్న పట్టణం మింగోరాలో 1997 జూలై 12న జన్మించింది. 2007లో ఆ చిన్న పట్టణం తాలిబన్ తీవ్రవాదులు అధీనంలోకి తీసుకొని బాలికలు పాఠశాలకు వెళ్లవద్దని, సంగీతం/టీవీలు చూడవద్దని మూర్ఖంగా నిషేధం విధించారు. చదువు మీద అమిత ఆసక్తి కలిగిన మలాలా ధైర్యంగా తాలిబన్ల నిర్ణయాన్ని ఎదిరించి, 2009లో బిబిసి ఉర్దూ మీడియాకు ఈ విషయం గూర్చి రాసింది. ఇందుకు ప్రతీకారంగా 2012లో ఆమెను తాలిబాన్ ముష్కరులు కాల్చడంతో తీవ్రంగా గాయపడి, ఆ దాడి నుంచి బయటపడి ఇంగ్లాండ్‌లో చికిత్స తీసుకొని, అక్కడే తన కుటుంబంతో స్థిరపడింది. 2013 జూలై 12న తన 16వ పుట్టిన రోజున మలాలా యూసఫ్‌జాయ్ ఐక్యరాజ్యసమితిలో ఒక శక్తివంతమైన ప్రసంగం చేసి ప్రపంచాన్ని నివ్వెర పరిచింది. అదే రోజున ఐరాస చొరవ తీసుకొని మలాలా యూసఫ్‌జాయ్ పుట్టిన రోజు జూలై 12న ప్రతి ఏటా మలాలా దినోత్సవం పాటించాలని ప్రపంచ దేశాలను కోరడం జరిగింది. ఐ యామ్ మలాలా అనే పేరుతో తన ఆత్మకథను పుస్తకరూపంలోకి తెచ్చి ప్రపంచ మానవాళికా ప్రేరణగా నిలిచింది. ప్రాణాంతక దాడికి భయపడకుండా బాలికల విద్య హక్కు కోసం గళం విప్పి నిప్పులు చెరిగిన మలాలా కోట్ల మంది చిన్నారులకు స్ఫూర్తినిచ్చే అసాధారణ చిన్నారిగా నిలిచింది. అమ్మాయిలు చదువుకొని, ఎదిగి, సమాజంలో నాయకురాళ్లుగా నిలవాలని మలాలా జీవితం మార్గనిర్దేశనం చేస్తున్నది. సవాళ్లను, పేదరికాన్ని ఎదిరిస్తూ బాలికలు చదువుకోవాలని మలాలా ధైర్యంగా పిలుపును ఇస్తున్నది. బాలికలు, మహిళలను రెండవ శ్రేణి వ్యక్తులుగా చూడడం తగదని పురుషాధిక్య సమాజాన్ని మేల్కొలిపేందుకు నిరంతరం కృషి చేస్తున్న మలాలా మనందరికీ ఆదర్శప్రాయురాలిగా నిలుస్తున్నది. పుస్తకం, కలం మాత్రమే శక్తివంతమైన ఆయుధాలని పిలుపును ఇవ్వడం, కత్తి, కలంతో పాటు స్త్రీ శక్తి కూడా అత్యంత బలవంతమైనవే అని గళం విప్పిన మలాలా ప్రభావం నేడు ప్రపంచ బాలికలకు దారి దీపంగా మారింది. మలాలా జీవిత కథ స్ఫూర్తిదాయకం. బాలికల, యువతులకు సాధికారత కల్పించాలనే మలాలా సందేశం నిజం కావాలని, లింగ సమానత్వం సాధించడానికి మనందరం కృషి చేయాలి.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఐఐటి, ఎన్ఐటి, నీట్ శిక్షణ లభించేనా?

విద్య జీవితానికి వెలుగునిస్తుంది. విద్య లేని వాడు గుడ్డివాడితో సమానం అంటారు. విద్య మనలోని మనోవికాసాన్ని వెలిగిస్తుంది. మార్గదర్శలా తోడుగా నిలుస్తుంది. పురాతన కాలంలో విద్యను జ్ఞానానికి మార్గంగా భావించారు. అలాంటిది జీవితంలో ఎంతో ప్రాముఖ్యం కలిగిన విద్య, పేదలకు ఇంకా అందని ద్రాక్షలా మిగిలిపోవడం విచారకరం. కేవలం మతపరమైన విద్య మాత్రమే కొనసాగిన ఉపనిషత్తుల కాలంలోనే (క్రీస్తు పూర్వం 400 వందల సంవత్సరాలనుండి 600 సంవత్సరాల మధ్యకాలం) విద్యలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. అంటే, విద్య గొప్పతనాన్ని, విలువను, అప్పుడే తెలుసుకోగలిగారని గుర్తుంచుకోవాలి. తర్వాత కాలంలో ఎక్కడ కూడా విద్య అలసత్వానికి గురికాలేదు. వేలసంవత్సరాల తర్వాత ఎంతో పరిజ్ఞానం పెరిగి, శాంకేతికతను సంతరించుకున్న ప్రస్తుత కాలంలో, పాలకులు విద్యపై పట్టింపు లేని తనంతో వ్యవహరించడం వల్లనే, ప్రభుత్వం నిర్వహిస్తున్న జూనియర్ కళాశాల విద్య పోటీ పరీక్షలకు దీటుగా నిలబడలేక, నిరుపేద గ్రామీణ విద్యార్థులకు ఉన్నత అవకాశాలు కల్పించడంలో వెనుకబడి నిరాదరణకు గురవుతోందని చెప్పాలి. పోటీ ప్రపంచంలో గ్రామీణ విద్యార్థులు విద్యలో రాణించాలి అంటే, ప్రభుత్వం అందించే విద్యా విధానంలోనే సమూల మార్పులు రావాలి. ఎట్టకేలకు ఇన్నాళ్లకు రాష్ట్ర ప్రభుత్వం విద్యకు కొంత ప్రాముఖ్యతను ఇచ్చే అవకాశం ఉందని లీలగా అని పిస్తోంది. అలాగే రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత అంశాల్లో విద్య చేరిందా అనే సందేహం కూడా కలుగక మానదు. ఇందుకు కారణం మారుమూల అటవీ ప్రాంతం అయిన పెద్దపల్లి జిల్లా, ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ ప్రభుత్వ పాఠశాలలో తీసుకువచ్చిన విద్యావిధానమే. అక్కడి విద్యార్థులు 'టీ ఫైబర్' ప్రాజెక్టు కింద పర్ ఫ్లెక్సిటీ ఏఐ ట్యూల్స్‌ను ఉపయోగిస్తున్నారంటే నమ్మలేకుండా ఉంది. అలాగే సంగారెడ్డి జిల్లా అందోల్, నారాయపేట జిల్లా మద్దూరు గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టు కింద ప్రయోగాత్మకంగా అమలు చేయడం సంతోషించదగ్గ విషయం. ఆయా పాఠశాలల్లోని 8,9,10 తరగతుల విద్యార్థులకు ఇంటర్నెట్ పాఠాల కొరకు, డిజిటల్ బోర్డ్స్, మానిటర్స్ ఏర్పాటు చేసి ఉపాధ్యాయులు వీటి ద్వారానే విద్యా బోధన చేయడం ప్రభుత్వ విద్యలో విప్లవాత్మకమార్పు కిందనే చూడాలి. విద్యా విధానంలో ఏదో మార్పులకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది అని, ప్రజలు చర్చించుకుంటున్న ఈ తరుణంలో, ప్రభుత్వం ఇదే ఒరవడిని కొనసాగిస్తూ, రాష్ట్ర వ్యాప్తంగా, పాఠశాల స్థాయిలో 6వ, తరగతి నుండి 9వ, తరగతి వరకు ఫౌండేషన్ విద్యావిధానాన్ని ప్రవేశ పెట్టాలి. దాని అవశ్యకతను గుర్తించి ప్రణాళికలు రచించాలి. ప్రతీ విద్యా సంవత్సరం పాఠశాలల ప్రారంభానికి ముందు నుండి నిర్వహించే, బడిబాట కార్యక్రమంలోనే, మన ప్రభుత్వ స్కూల్‌లో ఫౌండేషన్ విద్య ప్రారంభిస్తున్నామని గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలి. అదే సమయంలో అన్ని స్థాయిల్లో పాఠశాల విద్యా ప్రక్షాళనకు అంకురార్పణ జరగాలి. అప్పుడే ప్రయివేట్ పాఠశాలలకు, కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ విద్య మనగలుగుతుంది. పాఠశాలలలో ఫౌండేషన్ విద్య, కళాశాలల్లో ఐఐటీ, నీట్, వంటి ప్రత్యేక శిక్షణతో, నిత్యం అధ్యయనం, అధ్యాపనం అన్నట్టుగా అధ్యాపకుల టైమ్‌టేబుల్ మారిపోవాలి. దీనికి చిత్తశుద్ధితో కూడిన ఒక గట్టి ప్రయత్నం జరగాలి. అందుకు ముందుగా అధ్యాపకులకు ప్రత్యేక శిక్షణ కూడా ఇవ్వాలి. గ్రామీణ విద్యార్థులు పాఠశాల విద్యను పూర్తి చేసుకొని, పేదరికాన్ని జయించాలని, విద్యతో సంఘంలో సమాన అవకాశాలు పొందాలని ఎన్నో ఆశలతో ప్రభుత్వం అందించే ఉచిత విద్య కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళితే, అక్కడ వారిని మానసికంగా సంసిద్ధులను చేసి, ఉన్నతంగా తీర్చిదిద్దే వాతావరణం కల్పించక పోవడం (నిర్వాహణ లోపం)తో, కళాశాల విద్య నుండే వెనుదిరిగి దినసరి కూలీలుగా దైనందిన జీవితాన్ని గడిపే పిల్లలు పల్లెల్లో కనిపించడం నేడు పరిపాటిగా మారిపోయింది.



రాష్ట్రంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న 430 జూనియర్ కళాశాలల్లో, సుమారు లక్షా అరవై వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే వీరిలో పోటీ పరీక్షలు ఎదుర్కొనే సామర్థ్యం ఎందుకు కొరవడుతుందో ఖచ్చితంగా ఆలోచించాలి. అదే సమయంలో, రాష్ట్రంలో ఉన్న కార్పొరేట్ కళాశాలల్లో ప్రయివేట్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు పోటీ పరీక్షల్లో నెగ్గి ప్రభుత్వం అందిస్తున్న ఐఐటి, ఎన్ఐటి, వైద్య విద్య అవకాశాలను గణనీయంగా తన్నుకుపోవడం మనం చూస్తూ నే ఉన్నాం. అంటే ప్రభుత్వం నిర్వహిస్తున్న కళాశాలల్లో చదివే విద్యార్థులకు అదే ప్రభుత్వం నిర్వహించే పోటీ పరీక్షలు పాసయ్యే శక్తి సామర్థ్యాలు లేకపోవడం ఇక్కడ విడ్డూరంగా అనిపిస్తుంది. ఇదంతా సరైన పర్యవేక్షణ లేని విద్యావిధానం వల్లనే అని చెప్పక తప్పదు. ప్రభుత్వాలు మారినా, విద్య పట్ల వారి దృక్పథంలో మార్పు రానప్పుడు ప్రభుత్వాలు అందించే ఉచిత విద్య అయోగ్యంగానే మారుతుంది. ప్రతిసారీ విద్యా సంవత్సరం మొదలవడంతోనే, విద్యాభివృద్ధికి (కళాశాలల మౌలిక సదుపాయాల కొరకు) చాలా మొత్తంలో నిధులు కేటాయిస్తున్నామని అర్భాటపు ప్రకటనలు చేసే ప్రభుత్వాలు, అంతే చిత్తశుద్ధితో పూర్తి స్థాయి పర్యవేక్షణతో ప్రభుత్వ కళాశాలల్లో చదివే గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, ఐఐటి, నీట్ వంటి పోటీ పరీక్షల కోసం ప్రత్యేక శిక్షణ అందిస్తే, ఆ అవకాశం అందిపుచ్చుకొని వారు తమ జీవితాలను మార్చుకుంటారు. యోగ్యులుగా మిగులుతారు. సమాజంలో బాధ్యత గల పౌరులుగా భాగస్వామ్యం అవుతారు. అలా కాకుండా, బాహ్య ప్రపంచానికి ప్రభుత్వ పెద్దల ప్రకటనలు, నాలుగు గోడల మధ్యలో జరిగే విద్యాశాఖ అధికారుల సమీక్షలతో ప్రయోజనం ఉండదు. విధానపరమైన లోపాలను సవరించకుండా, కళాశాలల్లో విద్యార్థుల చేరిక కోసం కళాశాల ప్రిన్సిపాల్స్‌పై ఎంత ఒత్తిడి చేసినా లాభం ఉండదు. అందుకే అందరికీ ప్రభుత్వ విద్య తప్పనిసరి చేయాలి. అటు వైపుగా ప్రభుత్వం ఆలోచించాలి. ఇక తెలంగాణ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ నుండి అనుబంధం కోసం, దరఖాస్తు చేసుకోవడంలో ప్రభుత్వం నిర్వహించే జూనియర్ కళాశాలలే సంశయిస్తుండటం, దరఖాస్తు చేయడం కోసం చివరి క్షణాల వరకు వేచి చూడటం వంటి పరిణామాలు విస్మయాన్ని కలిగించక మానదు. ఇలాంటి పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని, ప్రభుత్వం ఇకనైనా విద్యకు అత్యంత ప్రాధాన్యతను కల్పిస్తూ, గొప్ప సంకల్పంతో, ఒక క్రమపద్ధతి ప్రకారం కార్యాచరణ తీసుకుంటే, అద్భుతాలు చేయవచ్చు. అసలు ప్రయివేట్ విద్యా విధానాన్ని ప్రభుత్వం త్యజించినప్పుడే విద్యలో సమాన అవకాశాలు వస్తాయనేది జగమెరిగిన సత్యం. రాజ్యాంగంలో పొందపరిచినట్లు అందరికీ నాణ్యమైన విద్య ప్రభుత్వమే అందించాలి. బయటి దేశాలు అభివృద్ధి చెందుతున్నాయి అంటే, అందుకు కారణం అక్కడ విద్యను ప్రభుత్వమే అందించడం వల్ల సాధ్యపడుతుందని గమనించాలి. అయినా సరే, మన జూనియర్ కళాశాలల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులకు కొదువలేదు. వీరికి తోడు, ప్రభుత్వం కళాశాలల్లో కొత్తగా జూనియర్ లెక్చరర్స్‌గా నియామకం చేసినవారు కూడా ఎంతో ప్రతిభావంతులు కావడం కలిసి వచ్చే అంశం. వారికి సరైన లక్ష్యాలను నిర్దేశించి, మట్టిలో మాణిక్యాలను వెలికి తీసే బాధ్యతను ప్రభుత్వం నిజాయితీగా తీసుకున్న నాడు, గ్రామీణ విద్యార్థుల భవితతో పాటు తరాలు మారిన తలరాత మారని స్థితిలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల గతిని మార్చిన వారు అవుతారు.

— ధీరన్ కొడారి
8008200664

## ప్రైవేట్ ఉపాధ్యాయుల
# జీవితాలు అమానవీయం

లేఖ

తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 15,360 ప్రైవేట్ పాఠశాలలు, అందులో 1,40,000 విద్యార్థులు, 41,360 మంది ఉపాధ్యాయులు ఉన్నారని ఒక అంచనా. ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులు, తక్కువ జీతాలతో, తల్లి దండ్రుల అధిక అంచనాలతో బాధ పడుతున్నారు. వీరికి ఉద్యోగ భద్రత కరువు.. వారు తీవ్రమైన పనిభారం, వేగంగా మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ఒత్తిడిని కూడా ఎదుర్కొంటున్నారు. ప్రైవేట్ పాఠశాలలో కఠినమైన విద్యా ప్రమాణాలతో విద్యార్థుల మార్కులు సాధించడానికి ఉపాధ్యాయులపై యాజమాన్యాలు ఒత్తిడి పెంచుతున్నాయి.

ఉపాధ్యాయులు తరగతుల్లో పాఠాలు చెప్పడమే కాకుండా పాఠశాలలు నిర్వహించే ఇతర కంప్యూటర్, ఫీజు వసూలు చేసే పనులు కూడ చేయవలసి వస్తుంది.పిల్లలు పరీక్ష ఫలితాల్లో మార్కులు తక్కువ వస్తే బలి పశువుగా మారేది ఉపాధ్యాయులే. తల్లిదండ్రులను, పిల్లలను కౌన్సెలింగ్ చేయడం, సాయంత్రం, సెలవుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించడం వలన ఉపాధ్యాయులు కుటుంబ సభ్యులతో గడిపే అవకాశం కోల్పోతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో బోధించే ఉపాధ్యాయుల కంటే ఎక్కువ విద్యార్హతలు ఉన్నను వారి కంటే తక్కువ వేతనం పొందుతూ ఉన్నారు. కాంట్రా క్ట్ ఆధారిత ఉద్యోగాల వలన వారికి ఎటువంటి ఉద్యోగ భద్రత లేకుండా ఉంది. పిఎఫ్, గ్రాట్యుటీ, వైద్య భీమా లాంటి సౌకర్యాలు లేకుండా ఎటువంటి సామాజిక, ఆర్థిక, ఆరోగ్య భద్రత లేకుండా జీవిస్తున్నారు. అధిక గంటలు ఏకబిగిన తరగతుల్లో భోదించడం వలన గొంతు ఇన్ఫెక్షన్లు, స్వర పేటిక దెబ్బ తినే ప్రమాదం ఉంది. బోధనకై ఎక్కువ సేపు నిలబడటం వలన వెన్ను నొప్పు, మోకాలి నొప్పులతో బాధ పడటం జాలి కలగక మానదు. తక్కువ జీతాలు ఎక్కువ పని ఒత్తిడి వలన ప్రైవేట్ ఉపాధ్యాయుల జీవితాలు అమానవీయంగా ఉన్నాయి. ప్రభుత్వ విద్యా అధికారులు ప్రైవేట్ పాఠశాలను తనిఖీ చేసినప్పుడు కేవలం విద్యార్థుల సంఖ్య, రిజిస్ట్రేషన్ పేపర్లు చూడటం తప్ప, ఉపాధ్యాయుల జీత భత్యాల, వారి ఉద్యోగ భద్రతల గురించి చర్చించుట లేదు, కార్పొరేట్ పాఠశాలల వాణిజ్య ప్రకటనలతో విద్యార్థులు చెల్లించే ఫీజులతో కోట్లకు పడగలెత్తిన్న వారిని ప్రశ్నించే నాథుడు కరువైనాడు. ఎప్పుడో ఒకసారి కార్పొరేట్ పాఠశాల విద్యార్థి ఏదో కారణంతో మరణించగానే విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీలు చేసే ధర్నా, నిరసన ఒక రోజుకు పరిమితం.నిత్యం శ్రమ దోపిడీకి గురవుతున్న ఉపాధ్యాయులు పరిస్థితి ఏమిటి? ప్రైవేట్ ఉపాధ్యాయులు ఎటువంటి హక్కులు లేకుండా, అటు కార్మిక హక్కులు ఇటు ఉపాధ్యాయ హక్కులు లేకుండా జీవిస్తున్నారు. ఉపాధ్యాయ సంఘ నాయకులు ప్రభుత్వ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్, వేతన పెంపు, ప్రమోషన్స్ గురిం చి ప్రభుత్వాలతో చర్చ జరుపుతున్నారు. కానీ ప్రైవేట్ ఉపాధ్యాయుల మాటేమిటి? ఒకే వృత్తిలో పని చేసే వారి పట్ల వివక్షత ఉండరాదు. టీచర్స్ నుంచి శాసన మండలికి ఎన్నికైన సభ్యులు కూడా వీరి గురించి నోరు మెదపకపోవడం బాధాకరం. గిగ్ వర్కర్ల కొరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ బోర్డ్ ఏర్పాటు చేసినట్లుగా ప్రైవేట్ ఉపాధ్యాయులను కూడా గిగ్ వర్కర్ల జాబితాలో చేర్చి వీరికి సామాజిక, ఆర్థిక, ఆరోగ్య భద్రత కల్పించే అవసరం ఎంతైనా ఉంది.

— ఆళవందార్ వేణుమాధవ్
8686051752, హైదరాబాద్


# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## జమిలి ఎన్నికల పార్లమెంటరీ కమిటీ ముందుకు మాజీ సిజెఐలు

**న్యూఢిల్లీ :** భారత మాజీ ప్రధాన న్యాయమూర్తులు జె.ఎస్. ఖేహర్, డి.వై. చంద్రచూడ్ శుక్రవారం జమిలి ఎన్నికల బిల్లును పరిశీలిస్తున్న పార్లమెంటరీ కమిటీతో సమావేశమయ్యారు. 'ఒక దేశం– ఒకే ఎన్నిక' అనే భావన రాజ్యాంగం ప్రాథమిక నిర్మాణాన్ని ఉల్లంఘించడం లేదని, కానీ ప్రతిపాదిత చట్టంలో ఎన్నికల కమిషన్‌కు ఉన్న అధికారం ఎంతవరకు ఉందో ప్రశ్నించాలని ఇద్దరు న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారని వర్గాలు తెలిపాయి. దేశంలో ప్రజాస్వామ్య పార్లమెంటరీ వ్యవస్థ ప్రయాణంపై వారు కొన్ని సూచనలు కూడా చేశారు. బిజెపి ఎంపి పి.పి. చౌదరి నేతృత్వంలోని పార్లమెంటు సంయుక్త కమిటీ బిల్లుపై తమ సిఫార్సును సిద్ధం చేస్తున్న నేపథ్యంలో న్యాయనిపుణులతో సంప్రదింపులు జరుపుతోంది. భారతదేశ మాజీ ప్రధాన న్యాయమూర్తులు యు.యు. లలిత్, రంజన్ గొగోయ్ గతంలో కమిటీ ముందు హాజరయ్యారు. వీరిద్దరు ఏకకాల ఎన్నికల రాజ్యాంగబద్ధతను ప్రశ్నించనప్పటికీ, వారు బిల్లులోని కొన్ని అంశాలను ప్రశ్నించి సూచనలు అందించారు.

## సుప్రీం తీర్పు ఓటు హక్కును కాపాడుతుందని ఆశిస్తున్నాం : కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** బిహార్‌లో ఎన్నికల కమిషన్ చేపట్టిన ప్రత్యేక ఇంటెన్సివ్ ఓటర్ల జాబితా సవరణను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పిటిషనర్లలో ఎవరూ స్టే కోరలేదని స్పష్టం చేస్తోందని కాంగ్రెస్ పేర్కొంది. ఈ తీర్పు అధిక సంఖ్యలో ఓటర్లను ఓటు హక్కును కోల్పోకుండా కాపాడుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది. ఈ ఏడాది చివర్లో ఎన్నికలు జరగనున్న బిహార్‌లో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఎన్నికల సమయంలో ఆధార్, ఓటరు ఐడి, రేషన్ కార్డులను చెల్లుబాటు అయ్యే పత్రాలుగా పరిగణించాలని సుప్రీంకోర్టు గురువారం ఎన్నికల సంఘాన్ని కోరింది. కాగా, సుప్రీంకోర్టు అధికారికంగా జారీ చేసిన ఆదేశాలను అనుసరించి, ఎన్నికల సంఘం ఇప్పుడు బిహార్‌లోని ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణలో ఎపిక్, ఆధార్ కార్డులు, రేషన్ కార్డులను చేర్చాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. సుప్రీంకోర్టు స్టేకు నిరాకరించడంపై ఇసి స్పిన్ స్పష్టంగా బయటపడిందన్నారు. పిటిషనర్లలో ఎవరూ స్టే కోరలేదని ఆర్డర్‌లోని 7వ పేజీ స్పష్టం చేస్తోందని, ఉద్దేశపూర్వకంగా తప్పుదారి పట్టించే ఇటువంటి హెడ్‌లైన్ నిర్వహణ రాజ్యాంగ అధికారానికి తగినది కాదన్నారు. అయితే సుప్రీంకోర్టు తీర్పును తప్పుగా అర్థం చేసుకున్నారని బిజెపి ఆరోపించింది.

# 'క్రాస్‌రోడ్డు'పై...భారతదేశ జనాభా

### పాపులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా వెల్లడి
### అది ఒక సంక్షోభం కాదని స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** అధిక జనాభా లేదా సంతానోత్పత్తి తగ్గదలపై భయాందోళన కలిగించే చర్చలకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా మహిళలు, యువత, వృద్ధులకు అవకాశాలు, గౌరవం, హక్కులు కల్పించే విధానాలపై కేంద్రం దృష్టి సారించాలని పాపులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా (పిఎఫ్ఐ) కోరింది. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం2025 సందర్భంగా ఎన్‌జిఒ పాపులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన ఒక ప్రకటనలో భారత దేశ జనాభా సవాళ్లు సంఖ్య గురించి కాదు కానీ న్యాయం, సమానత్వం, మానవ సామర్థ్యంలో పెట్టుబడి కోసమని నొక్కిచెప్పింది. 'భారతదేశ జనాభా కథ ఒక సంక్షోభం కాదు, ఇది ఒక కూడలి' అని పాపులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పూనమ్ ముత్రేజా ఈ సందర్భంగా జరిగిన ఒక కార్యక్రమంలో అన్నారు.యువత తమకు కావాల్సిన కుటుంబాలను, ఆశాజనకమైన ప్రపంచాన్ని సృష్టించడానికి వారిని శక్తివంతం చేయాలనే ప్రపంచ థీమ్‌తో ప్రపంచజనాభా దినోత్సవాన్ని జరుపుకుంటోంది. భారతదేశం జనాభా సంఖ్యలతో పోలిస్తే న్యాయం, సమానత్వం, మానవవనరులలో పెట్టుబడితో ముడిపడి ఉందని ఎన్‌జిఒ వాదించింది. 'మనం అధిక జనాభా పతనం'అనే భయాందోళనల మధ్య ఊగిసలాడటం మానేసి, బదులుగా నిజంగా ముఖ్యమైన వాటిపై దృష్టి పెట్టాలి. అవి నాణ్యత, పునరుత్పత్తి, స్వయం ప్రతిపత్తి, సమ్మిళిత ప్రజా పెట్టుబడి' అని ఆమె వెల్లడించింది. ఫౌండేషన్ ప్రకటన విధాన రూపకర్తలకు మూడు కీలక రంగాలపై దృష్టి సారించింది. 'మొదటిది లింగభేదాన్ని గ్రహించడం. సంతాన నిరోధక శస్త్ర చికిత్సకు అతీతంగా వివిధ రకాల గర్భ నిరోధకాలు,



వాటిలో మహిళలు బాధ్యతలను పంచుకోవడం. పురుషులు కేవలం మద్దతుదారులుగా మాత్రమే పరిష్కారంలో భాగస్వాములు కావాలి. నివాసంలో, కార్యాలయంలో మహిళల భద్రతను నిర్ధారించడం పురుషుల బాధ్యత అని ముత్రేజా చెప్పారు. 'కుటుంబ నియంత్రణ చాలాకాలంగా స్త్రీ బాధ్యతగా చూడబడుతోంది. కానీ పునరుత్పత్తి ఆరోగ్యం ఉమ్మడి బాధ్యత' అని ఆమె తెలిపారు.250మంది యువకులు, ముఖ్యంగా కౌమారదశలో ఉన్నటువంటి బాలికలకు విద్య, నైపుణ్యాభివృద్ధి , పునరుత్పత్తి ఆరోగ్యం, మానసిక శ్రేయస్సులో పెట్టుబడి పెట్టడం ద్వారా సమగ్ర వృద్ధిని సాధించడానికి భారతదేశానికి ఒక ప్రత్యేక అవకాశం ఉంది. మూడవది వెండి డివిడెండ్‌కు సిద్ధం కావడం.2050నాటికి దాదాపు ఐదుగురు భారతీయులలో ఒకరు 60ఏళ్లు పైబడినవారు ఉంటారని గమనించి వృద్ధుల సంరక్షణ, పెన్షన్లు, ఆరోగ్య సందరక్షణ, వయస్సుకు అనుకూలమైన మౌలిక సదుపాయాలలో తక్షణ పెట్టుబడులు పెట్టాలని , వృద్ధులను ఆధారపడినవారుగా కాకుండా కీ లకమైన సహాయకులుగా చూడాలని పాపులేషన్ ఫాం డేషన్ ఆఫ్ ఇండియా పిలుపునిచ్చింది.' మన విధానాలలో ప్రజలను ముఖ్యంగా మహిళలు,యువకులు, వృ ద్ధులను కేంద్రీకరిస్తే, జనాభా ధోరణులు సంక్షోభాలు ఉండవని తెలిపింది. మరింత న్యాయమైన స్థితిస్థాపక భ విష్యత్తుగా ఉంటాయి' అని పిఎఫ్ఐ ప్రకటన సూచించింది.

## బిహార్‌లో కోటి మంది లబ్ధిదారులకు పెన్షన్ అందజేత



**పాట్నా :** బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ సీనియర్ సిటిజన్లు, వితంతువులు, వికలాంగులు సహా 1.11 కోట్ల మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నెలకు రూ.1,100 చొప్పున పెంచిన పెన్షన్ మొత్తంలో మొదటి విడతను పంపిణీ చేశారు. శుక్రవారం పాట్నాలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆరు వేర్వేరు పెన్షన్ పథకాల కింద రూ.1,227 కోట్లకు పైగా జమ చేసినట్లు అధికారులు తెలిపారు. బీహార్ ప్రభుత్వం జూన్ 24న పెన్షన్ మొత్తాన్ని నెలకు రూ.400 నుండి రూ.1,100కు పెంచింది. కాగా, వృద్ధులు సమాజంలో ఒక ముఖ్యమైన భాగమని, వారికి గౌరవప్రదమైన జీవితాన్ని అందించడం తమ ప్రభుత్వం ప్రధాన ప్రాధాన్యత అని సిఎం నితీశ్ కుమార్ అన్నారు. ఆ దిశగా ప్రయత్నాలు చేస్తామన్నారు. పెన్షన్ మొత్తాన్ని ప్రతి నెల 10వ తేదీన పంపిణీ చేసేలా చూస్తామని కుమార్ పేర్కొన్నారు. బిహార్ ప్రభుత్వం రాష్ట్రంలోని మహిళల సమగ్ర అభివృద్ధికి కూడా కట్టుబడి ఉందని ఆయన అన్నారు. తమ ప్రభుత్వం మహిళల సాధికారత, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని, వారి విద్య, భద్రత, ఉపాధికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా మహిళా సాధికారత పరంగా తాము ఉదాహరణగా నిలిచామన్నారు. 2005కు ముందు, మునుపటి ప్రభుత్వం మహిళలకు ఏమీ చేయలేదని, తాము అధికారం చేపట్టిన తర్వాతే నిజమైన మార్పు ప్రారంభమైందని నితీశ్ చెప్పుకొచ్చారు. బిహార్‌లో ప్రతిపక్షాలతో చేతులు కలిపి గతంలో తాను 'తప్పులు' చేశానన్నారు. 'ఇధార్ ఉధార్' (ఇక్కడ, అక్కడ) రెండుసార్లు దారి తప్పాను. కానీ ఇప్పుడు, నేను ఎన్‌డిఎతో ఉన్నాను. ఎప్పటికీ కూటమితోనే ఉంటాను. రాష్ట్ర అభివృద్ధి కోసం పని చేస్తా' అని స్పష్టం చేశారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ఇందిరా గాంధీ జాతీయ వృద్ధాప్య పెన్షన్ పథకం, ముఖ్యమంత్రి వృద్ధజన్ పెన్షన్ యోజన, ఇందిరా గాంధీ జాతీయ వితంతు పెన్షన్ పథకంతో సహా ఆరు పెన్షన్‌లను నిర్వహిస్తుంది. ఈ పథకాలకు మధుబని జిల్లాలో అత్యధికంగా 5,53,848 మంది లబ్ధిదారులు ఉన్నారు. తరువాత పాట్నాలో 5,26,339 మంది లబ్ధిదారులు ఉన్నారని అధికారులు తెలిపారు. 71,971 మంది లబ్ధిదారులతో, షేక్‌పురాలో అత్యల్పంగా 7.95 కోట్ల రూపాయలు పంపిణీ చేసినట్లు వారు తెలిపారు.

# పదే పదే అడగొద్దు

### సిఎం మార్పుపై ప్రశ్నలకు మీడియాపై డికె శివ కుమార్ అసహనం

**బెంగళూరు :** కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేస్తానని ప్రకటించిన నేపథ్యంలో, ఈ విషయంపై అన్ని ప్రశ్నలకు సిఎం సమాధానమిచ్చారని డిప్యూటీ సిఎం డికె శివకుమార్ తెలిపారు. 'ముఖ్యమంత్రి ఇప్పటికే మీ అన్ని ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. నేను అదే పదే పదే చెప్పడం సముచితం కాదు, మీరు కూడా అడగడం సరికాదు' అని శివకుమార్ న్యూఢిల్లీ నుండి తిరిగి వచ్చిన తర్వాత బెంగళూరు విమానాశ్రయంలో విలేకరులతో అన్నారు. సిద్ధరామయ్య, శివకుమార్ ఇద్దరూ ఈ వారం ప్రారంభంలో కాంగ్రెస్ హైకమాండ్‌ను కలవడానికి ఢిల్లీ వెళ్లిన విషయం తెలిసిందే. 'మేము లేనప్పుడు మీరు (విలేకరులను చూపిస్తూ) మా అంతర్గత విషయాల గురించి ఎందుకు భయపడుతున్నారు?' అంటూ చర్చలు అధికార పంపిణీ ఏర్పాటు గురించి అనే ఊహాగానాలను శివకుమార్ తోసిపుచ్చారు. మే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించిన తర్వాత, ముఖ్యమంత్రి పదవి కోసం సిద్ధరామయ్య, శివకుమార్ మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. ఆ సమయంలో వచ్చిన నివేదికల ప్రకారం, వారు రొటేషనల్ సిఎం ఫార్ములాపై అంగీకరించారని, దీని ప్రకారం శివకుమార్ రెండున్నర సంవత్సరాల తర్వాత 2025 నవంబర్‌లో బాధ్యతలు స్వీకరిస్తారని తెలుస్తోంది. అయితే, పార్టీ అలాంటి ఒప్పందాన్ని ఎప్పుడూ ధృవీకరించలేదు. కాగా, పార్టీలో సిఎంగా బాధ్యతలు స్వీకరించడానికి తనకు మద్దతు పెరుగుతోందని అడిగినప్పుడు, శివకుమార్ స్పందిస్తూ దాన్ని వదిలేయండి. మీలో చాలా మందికి ఆకాంక్షలు కూడా ఉన్నాయి అని అన్నారు. నాయకత్వ మార్పు గురించిన ప్రశ్నలపై మరింత వ్యాఖ్యానించడానికి ఆయన నిరాకరించారు.



ఈ సమయంలో మీ ప్రశ్నలకు నేను సమాధానం చెప్పను అని ఆయన అన్నారు. ఢిల్లీ పర్యటన సందర్భంగా ఎటువంటి రాజకీయ చర్చలు జరగలేదని ఆయన అన్నారు. పార్టీ కార్యకర్తలను బోర్డులు, కార్పొరేషన్ల చైర్మన్లుగా, సభ్యులుగా నియమించడంపై తాము చర్చించామన్నారు. అందరు ఎమ్మెల్యేలు తమ అభిప్రాయాలను సమర్పించినందున తాము ఇప్పుడు చివరి దశలో ఉన్నామని, హైకమాండ్‌తో మరో రౌండ్ చర్చలు పేర్లను ఖరారు చేయడంలో సహాయపడతాయన్నారు. గురువారం సిద్ధరామయ్య ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ కర్ణాటకలో నాయకత్వ మారు పై ఊహాగానాల గురించి అడిగినప్పుడు అత్యున్నత పదవికి 'ఖాళీ' లేదని అన్నారు. 'ముఖ్యమంత్రి పదవికి ఖాళీ ఉందా? నేను మీ ముం దు ఉన్నాను. నేను కర్ణాటక ముఖ్యమంత్రిని. శివకుమార్ చెప్పి ంది అదే, నేను కూడా చెబుతున్నాను... ఖాళీ లేదు' అని ఆయన అన్నారు.



## ట్రక్కు లోయలో పడి 5 మంది కార్మికులు మృతి

**రాయ్‌పూర్ :** ఛత్తీస్‌గఢ్‌లోని కబీర్‌ధామ్ జిల్లాలో బోర్‌వెల్ తవ్వుతున్న ట్రక్కు ఒక చిన్న లోయలో పడిపోవడంతో ఐదుగురు కార్మికులు మృతి చెందగా, మరో నలుగురు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. కుక్దూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చాటా గ్రామం సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగిందని కబీర్‌ధామ్ అదనపు పోలీసు సూపరింటెండెంట్ పుష్పేంద్ర సింగ్ బాఘేల్ తెలిపారు. ఆ వాహనం పొరుగున ఉన్న మధ్యప్రదేశ్ నుండి వస్తోందని ఆయన చెప్పారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, తొమ్మిది మందితో కూడిన ట్రక్కు ఒక చిన్న లోయలో పడి బోల్తా పడిందని ఆయన చెప్పారు. ప్రయాణికులలో ముగ్గురు అక్కడికక్కడే మరణించారని, మరికొందరిని ఆసుపత్రికి తరలించారని, అక్కడ మరో ఇద్దరు మృతిచెందారని అధికారి తెలిపారు. గాయపడిన నలుగురు వ్యక్తులు చికిత్స పొందుతున్నారని, మృతుల గుర్తింపు ఇంకా తెలియాల్సి ఉందని ఆయన అన్నారు.

# 22 మంది నక్సల్స్ లొంగుబాటు



**నారాయణ్‌పూర్ :** ఛత్తీస్‌గఢ్‌లో మరో 22 మంది నక్సల్స్ లొంగిపోయారు. అభుజ్‌మడ్ ప్రాంతంలో చురుకుగా వ్యవహరిస్తూ తమ తలలపై మొత్తంగా రూ.37.5 లక్షల రివార్డు ఉన్న మాయిస్టులు శుక్రవారం ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్ జిల్లాలో లొంగిపోయారని ఒక సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. మాడ్ డివిజన్ మావోయిస్టుల పరిధిలోని కుతుల్, నెల్నార్, ఇంద్రావతి ఏరియా కమిటీలకు చెందిన వీరి బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బిఎస్ఎఫ్), ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటిబిపి) అధికారుల ముందు లొంగిపోయారు. 'బోలు' మావోయిస్టు భావజాలం, నిషేధిత సంస్థలో పెరుగుతున్న అంతర్గత విభేదాలతో నిరాశ చెందామని లొంగిపోయిన నక్సలైట్లు పోలీసులకు చెప్పారని నారాయణ్‌పూర్ పోలీసు సూపరింటెండెంట్ రాబిన్సన్ గురియా తెలిపారు. జిల్లాలోని మాడ్ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులతో పాటు, వేగంగా రోడ్ల నిర్మాణం ద్వారా కూడా వారు ప్రభావితులయ్యారని, సాధారణ జీవితాన్ని గడపాలని కోరుకున్నారని ఆయన అన్నారు. ఆయుధాలు వదులుకున్న నక్సలైట్లలో డివిజనల్ కమిటీ సభ్యుడు మంకు కుంజమ్ (33) తలపై రూ. 8 లక్షల రివార్డు, హిడ్మే కుంజమ్ (28), పున్న లాల్ అలియాస్ బోటి (26), సనిరామ్ కొర్రం (25) అనే ముగ్గురు ఏరియా కమిటీ సభ్యులపై రూ. 5 లక్షల చొప్పున రివార్డు ప్రకటించినట్లు అధికారి తెలిపారు. పదకొండు మంది కేడర్లకు ఒక్కొక్కరికి రూ. లక్ష రివార్డు, మరో ఏడుగురు కేడర్లకు రూ. 50,000 రివార్డు ప్రకటించినట్లు ఆయన తెలిపారు. నరాన్‌పూర్ పోలీసులు, నరాయణ్‌పూర్ జిల్లా రిజర్వ్ గార్డ్ ఐటిబిపి, బిఎస్ఎఫ్ నక్సల్స్ లొంగుబాటులో కీలక పాత్ర పోషించాయని, ఈ పరిణామం అగ్రశ్రేణి మావోయిస్టు కేడర్లకు భారీ దెబ్బగా మారిందని, నక్సల్ రహిత మాడ్ కల సాకారం అవుతోందని గురియా చెప్పారు. లొంగిపోయిన నక్సలైట్లందరికీ ఒక్కొక్కరికి రూ. 50,000 సహాయం అందించామని, ప్రభుత్వ విధానం ప్రకారం వారికి పునరావాసం కల్పిస్తామని ఆయన చెప్పారు. ఈ లొంగుబాటుతో ఈ సంవత్సరం ఇప్పటివరకు జిల్లాలో 132 మంది నక్సలైట్లు హింసను విడిచిపెట్టారని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి ప్రశంసిస్తూ, నక్సలైట్లు ఇప్పుడు తుపాకులను పక్కనపెట్టి అభివృద్ధి పథంలో కలిసి నడవాలనుకుంటున్నారన్నారు. 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వం (కేంద్రంలో మరియు రాష్ట్రంలో బిజెపి పాలన) మార్చి 31, 2026 నాటికి నక్సలిజాన్ని నిర్మూలించడానికి కట్టుబడి ఉందని ఆయన అన్నారు.

## పటిష్ట భద్రత మధ్య కన్వర్ యాత్ర ప్రారంభం

**డెహ్రాడూన్ :** పటిష్ట భద్రతా ఏర్పాట్ల మధ్య శుక్రవారం కన్వర్ యాత్ర ప్రారంభమైంది. గంగా జలాన్ని సేకరించడానికి వేలాది మంది కన్వర్యలు పవిత్ర నగరం హరిద్వార్‌కు చేరుకున్నారు. ఉదయం నుండి హరిద్వార్‌లోని వివిధ ఘాట్‌ల వద్ద కాషాయ సముద్రం కనిపించింది. ఘాట్‌ల వద్ద కన్వర్యలు స్నానం చేసి నీటిని సేకరించారు. ప్రతి సంవత్సరం సావన్ మాసం ప్రారంభంతో వివిధ రాష్ట్రాల నుండి కన్వర్యలు హరిద్వార్‌లోని గంగా జలాన్ని తీసుకెళ్లి వారి స్వస్థలాలలోని శివాలయాలలో 'జలాభిషేకం' చేస్తారు. కాగా, ఉత్తరాఖండ్ డిజిపి దీపం సేథ్ మాట్లాడుతూ 7,000 మందికి పైగా పోలీసులు, పారామిలిటరీ దళాలు, జల పోలీసులు (నదులు, ఘాట్‌ల వెంట మునిగిపోయే సంఘటనల కోసం మోహరించబడ్డారు), నిఘా అధికారులు, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం, ప్రాంతీయ సాయుధ కాన్స్టాబులరీ (పిఎసి), ఉగ్రవాద నిరోధక దళాన్ని కన్వర్ యాత్ర భద్రత కోసం మోహరించామని చెప్పారు. కన్వర్ యాత్ర సజావుగా సాగడానికి డ్రోన్‌లు, సిసిటివి, సోషల్ మీడియా ట్రాకింగ్ ద్వారా ప్రతి అనుమానాస్పద కార్యకలాపాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఉత్తరాఖండ్ ప్రభుత్వం కూడా సాధువులు, సాధువులుగా నటిస్తూ ప్రజలను, ముఖ్యంగా మహిళలను మోసం చేసే సామాజిక వ్యతిరేక శక్తులపై 'ఆపరేషన్ కలనేమి'ని ప్రారంభించింది. ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి మాట్లాడుతూ 'ఇది ప్రజల మతపరమైన మనోభావాలను దెబ్బతీయడమే కాకుండా సామాజిక సామరస్యం, సనాతన సంప్రదాయ ప్రతిష్టను కూడా దెబ్బతీస్తోందన్నారు. ఏదైనా మతానికి చెందిన ఎవరైనా ఇలాంటి చర్యలు చేస్తున్నట్లు కనిపిస్తే, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కన్వర్ యాత్రలో పాల్గొనేవారి సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతోంది. గత సంవత్సరం, కన్వర్ యాత్ర సందర్భంగా నాలుగు కోట్లకు పైగా కన్వర్లు హరిద్వార్, రిషికేశ్‌కు చేరుకున్నారు. ఈ సంవత్సరం ఆరు నుండి ఏడు కోట్ల మంది కన్వర్లు వస్తారని ప్రభుత్వ అధికారులు తెలిపారు.



## మహిళా సంఘాలకు రూ.344 కోట్ల వడ్డీ లేని రుణాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహిళా స్వయం సహాయక సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.344 కోట్ల వడ్డీ లేని రుణాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈమేరకు సర్ప్‌కు ఆర్థిక శాఖ నిధులను విడుదల చేసింది. ఇందులో రూ. 300 కోట్లు గ్రామీణ మహిళ సంఘాలకు, రూ. 44 కోట్లు పట్టణ మహిళా సంఘాలకు కేటాయించింది. శనివారం నుంచి ఈ నెల 18 వరకు మహిళా సంఘాల ఖాతాల్లో వడ్డీలు జమకానున్నాయి. దీనికి సంబంధించిన చెక్కులను అన్ని నియోజకవర్గాల్లో మంత్రులు, ఎంఎల్‌ఎలు పంపిణీ చేయనున్నారు. ప్రమాద బీమా, రుణ బీమా చెక్కులను కూడా పంపిణీ చేయనున్నారు. కాగా గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో వడ్డీలేని రుణాలు నిలిచాయి, సుమారు రూ.3000 కోట్ల వరకు బకాయిలు పెట్టినట్టు అధికార వర్గాలు పేర్కొన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సకాలంలో వడ్డీలేని రుణాల చెల్లించారు. దీంతో మహిళా సంఘాల ఆర్థిక కార్యకలాపాల్లో అనూహ్య వృద్ధి కనిపించింది. మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క చొరవతోనే మహిళా సం ఘాలకు రుణాలు మంజూరయ్యాయని మహిళా స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు తెలిపారు.



## రాష్ట్రంలో మరో 18 దత్తత కేంద్రాలు..

### 2 బాలల సంరక్షణ కేంద్రాల ఏర్పాటు
### దస్త్రిపై మంత్రి సీతక్క సంతకం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా మరో 18 ప్రత్యేక దత్తత కేంద్రాలు (ఎస్ఎఎఎస్), రెండు బాలల సంరక్షణ కేంద్రాలను (చిల్డ్రన్ హోమ్స్) ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనల దస్త్రంపైన మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క శుక్రవారం సంతకం చేశారు. కాగా సిఎం ఆమోదం లభించిన వెంటనే ఈ కేంద్రాల ఏర్పాటుకు అధికారిక ప్రక్రియ ప్రారంభంకానుంది. తెలంగాణలో శిశు సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోంది, అనాథలు లేదా తల్లిదండ్రులు వదిలి వేసిన పిల్లలను దత్తత కేంద్రాల్లో సంరక్షిస్తూ, వారికి అన్ని అవసరాలను అందించడంతో పాటు, నిబంధనల ప్రకారం దత్తత ఇచ్చే ప్రక్రియను చేపడుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో 15 జిల్లాల్లో 17 దత్తత కేంద్రాలు ఉన్నాయి. వీటికి అదనంగా 18 కొత్త కేంద్రాల ఏర్పాటుతో మొత్తం దత్తత కేంద్రాల సంఖ్య 35కు చేరనున్నాయి. పిల్లల అక్రమ విక్రయాలు, అనధికార దత్తతలపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. దీనికి కొనసాగింపుగా దత్తత కేంద్రాలు, బాలల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కొత్తగా ఏర్పాటయ్యే కేంద్రాల నిర్వహణ, పిల్లల బాగోగుల కోసం ఏటా రూ. 5.44 కోట్లు ఖర్చు అవుతాయని రాష్ట్ర ప్రభుత్వం అంచనాలను సిద్ధం చేసింది. అందులో 60 శాతం (రూ. 3.26 కోట్లు) కేంద్ర ప్రభుత్వం, మిగిలిన 40 శాతం (రూ. 2.17 కోట్లు) రాష్ట్ర ప్రభుత్వం భరించనుంది. ఈ కేంద్రాల్లో సేవలందించేందుకు 228 మంది సిబ్బందిని అవుట్ సోర్సింగ్ విధానంలో నియమించనున్నారు. ముఖ్యమంత్రి సంతకం అనంతరం ఈ ప్రాజెక్టు అమలు ప్రారంభంకానున్నాయి.

## హైకోర్టులో కెవియట్ దాఖలు చేసి.. బిసి రిజర్వేషన్ల ఆర్డినెన్స్ ఇవ్వాలి

### : ఎమ్మెల్సీ కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్:** స్థానిక సంస్థలల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే చిత్తశుద్ధి రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటే హైకోర్టులో కెవియట్ దాఖలు చేసి, ఆర్డినెన్స్ జారీ చేయించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. తెలంగాణ జాగృతి, యునైటెడ్ ఫూలే ఫ్రంట్ నాయకులతో కలిసి హైదరాబాద్ లోని తన నివాసంలో కవిత శుక్రవారం మీడియాతో మాట్లాడారు. సవరణ బిల్లుకు గవర్నర్ ఆమోదం తెలిపి, ఆర్డినెన్స్‌జారీ చేయాలని, వెంటనే ఆమోదం తెలిపేలా బిజెపి రాష్ట్ర నాయకులు గవర్నర్‌పై ఒత్తిడి పెంచాలని సూచించారు. బిసి రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ తీసుకొస్తామన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రకటనతో తాము పిలుపునిచ్చిన రైల్ రోకోను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని ప్రకటించారు.బిసి రిజర్వేషన్ల బిల్లును ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత కేంద్ర మంత్రి బండి సంజయ్ తీసుకోవాలని, షెడ్యూల్ 9లో బిసి రిజర్వేషన్లను పొందుపర్చి, రాజ్యాంగ పరమైన భద్రత కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో యుపిఎఫ్ కన్వీనర్ బొల్లా శివశంకర్, తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, నాయకులు రూప్ సింగ్, వరలక్ష్మి , లలితా యాదవ్, సంపత్ గౌడ్, కొట్టాల యాదగిరి, నరేందర్ యాదవ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆందోళనకు రంగం సిద్ధం

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ శాఖలు, సొసైటీలు, ప్రభుత్వ అనుబంధ సంస్థలలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ హక్కుల కోసం ఈనెల 12న హైద్రాబాద్‌లోని ఇందిరపార్కు లో మహాధర్నాలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ జెఎసి కమిటి అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.శివశంకర్ అన్నారు. అంతకు ముందు జెఎసి రాష్ట్ర అధ్యక్షులు పులి లక్ష్మయ్య, జిల్లా అధ్యక్షులు చీకూరి అశోక్‌లు మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టి.శివశంకర్ మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఏజెన్సీ వ్యవస్థను రద్దుచేసి ప్రభుత్వ కార్పోరేషన్ ద్వారా ఉద్యోగ భద్రత కల్పించాలని, రాష్ట్రవ్యాప్తంగా సుమారు రెండు లక్షల మందికి పైగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని వీరి కుటుంబాల సంఖ్య 8 లక్షల దాకా ఉండగా, ఈ సమస్యపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. ఈ ధర్నాలో ప్రతి ఉద్యోగి తప్పకుండా పాల్గొని ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## కరపత్రాల ఆవిష్కరణ



**ప్రజాపక్షం/చందంపేట:** నల్గొండ జిల్లా చందంపేట మండల సిపిఐ మహాసభ ఈనెల 15న నిర్వహించనున్న నేపథ్యంలో సిపిఐ పార్టీ 100 వ సంవత్సరంలో ప్రవేశించిన తరుణంలో సిపిఐ శత జయంతి ఉత్సవాలకు సంబందించి శుక్రవారం ఉమ్మడి చందంపేట మండల కార్యదర్శులు ఉప్పునూతల వెంకటయ్య, బొమ్ము అచ్చయ్య ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరించారు. దేవరకొండ పట్టణంలోని సాయిరమ్య ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించనున్నారని ఈ శత జయంతి ఉత్సవాలకు ఉమ్మడి మండలంలోని సిపిఐ పార్టీ కార్యకర్తలు, యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో మొగుళ్ళ వెంగలయ్య, బాలు, శేఖరర్‌రెడ్డి, పాండురంగారెడ్డి, మదేల్, మహేష్, రామాంజనేయులు, దేవ్‌లాల్, కిష్టయ్య, లాలయ్య, హనుమంతు, శివ పాల్గొన్నారు.



## కుటుంబ నియంత్రణను ప్రొత్సహించాలి

### రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి

**ప్రజాపక్షం/యాదాద్రి :** జనాభా పెరుగుదల వలన కలిగే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరు కుటుంబ నియంత్రణ ప్రోత్సహించాలని రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా ఏరియా ఆసుపత్రి నుండి భువనగిరి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఇట్టి ర్యాలీని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచంలో ఇప్పటికే భారతదేశం జనాభాలో మొదటి స్థానంలో ఉందని, దాదాపుగా 150 కోట్ల మంది ప్రజలతో భారతదేశం ముందుందన్నారు. ఈ విధంగా జనాభా పెరుగుట వలన మానవుల అవసరాలకు కావలసిన అనేకమైనటువంటి వనరులను సమకూర్చలేక భారతదేశము ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉంటుందన్నారు. విద్య, ఉద్యోగం, ఉపాధి, గృహం , ప్రకృతి పరమైనటు వంటి వనరులను సమకూర్చుకోలేక ఆర్థికంగా ఇబ్బంది పడే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ పాండు, ప్రోగ్రామ్ ఇంచార్జి డాక్టర్ యశోద, ప్రోగ్రాం అధికారులు, హెల్త్ ఎడ్యుకేటర్స్, ఎం.పి.హెచ్.ఓలు, సూపర్వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

### ఎస్‌పి శరత్ చంద్ర పవార్



**ప్రజాపక్షం/నందికొండ:** సాగర్‌లో రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తెలిపారు. సాగర్ లోని ప్రధాన రహదారిపై ఉన్న మూలమలుపుల వద్ద తరచూ రోడ్డు ప్రమా దాలు జరిగి అనేకమంది ప్రాణాలు కోల్పోతున్న సందర్భంగా శుక్రవారం ఆయన సాగర్ లో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే కొన్ని ముఖ్యమైన బ్లాక్ స్పాట్ లను గుర్తించారు. ముఖ్యంగా దయ్యాల గండి మూలమలుపు, డౌన్ పార్క్ వద్ద ముత్యాలమ్మ గుడి మూలమలుపు, బుద్ధవనం, శివమ్ హోటల్ మూల మలుపులను ప్రధాన బ్లాక్ స్పాట్లు గా గుర్తించి ఈ ప్రాంతా లలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై సంబంధి త అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రోడ్ సేఫ్టీ వింగ్ సిఐ అంజయ్య , నేషనల్ హైవే డి ఈ మురళీకృష్ణ, ఎలక్ట్రికల్ ఎస్‌ఈ వి. గీత,ఏఈ కే.శేఖర్, ఫారెస్ట్ ఎఫ్ డి ఓ రాఘవరావు మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ సతీష్ , ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కల్ప న,సాగర్ సిఐ శ్రీను నాయక్ విజయపురి టౌన్ ఎస్ఐ జి ముత్తయ్య పాల్గొన్నారు.

## ముంపు ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం చూపెట్టాలి

### నాలా ఆక్రమ కట్టడం ఆపకపోతే సిపిఐ పోరాటం : శేఖర్‌రెడ్డి

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని వలిగొండ రోడ్డు లో సర్వే నంబర్ 176 నాలా కల్వర్టు వద్ద చేపడుతున్న అక్రమ కట్టడాన్ని నిలుపుదల చేసి చౌటుప్పల్ ఊర చెరువు అలుగు ముంపు నుండి రాంనగర్ ,శాంతి నగర్ కాలని వాసులను రక్షించాలని తక్షణమే విచారణ జరిపి నాలా పరిరక్షించి ముంపు ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం చూపెట్టాలని సీపీఐ మండల పార్టీ అధ్యక్షులు పల్లె శేఖర్ రెడ్డి పత్రిక ప్రకటన ద్వారా అధికారులను కోరారు.నాలా ఆక్రమణ పై సమగ్ర విచారణ జరిపి ముంపు ప్రాంతాల కాలని ప్రజలకు న్యాయం జరగకపోతే భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని అధికారులను హెచ్చరించారు. పేద ప్రజలకు ఎక్కడ ఆపద వస్తే అక్కడ ప్రజలపక్షాన ఎర్రజెండా నిలబడి ఉదమిస్తుంది అని తెలిపారు.గతం లో వర్షాలు అధికంగా కురిసి చౌటుప్పల్ ఊర చెరువు అలుగు పారడం తో జాతీయ రహదారి ఉత్తరభాగం పూర్తిగా నీట మునిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. అలాగే గతంలో నాలాలో అక్రమ కట్టడాలు నిలిపివేయాలని గత జిల్లా కలెక్టర్ కూడా నాలా ను సందర్శించి ఆదేశాలు జారీ చేశారని, ప్రస్తుత ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి నాలా ను పర్యవేక్షించి గత సమస్య పునరావృతం కావద్దని నాలాలో అక్రమ కట్టడాలు ఎవరు చేపట్టిన సహించేది లేదని అధికారులకు ఆదేశాలు జారీ చేశారని గుర్తు చేశారు. మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు స్పందించి తక్షణమే విచారణ చేపట్టి ముంపు ప్రాంతాల ప్రజలకు శాశ్వత పరిష్కారం చేపట్టాలని కోరారు.

## రుణాల మంజూరులో జాప్యంపై రైతుల నిరసన

**ప్రజాపక్షం/హాలియా:** పంట అదును దాటిపోతున్న బ్యాంకు రుణాలు ఇవ్వడంలో అధికారుల చేస్తున్న జాప్యాన్ని నిరసిస్తూ శుక్రవారం హాలియా యూనియన్ బ్యాంకు వద్ద యాచారం, పులిమామిడి, అన్నారం గ్రామాలకు చెందిన రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ తమ రుణాలను రెన్యూవల్ చేసుకునేందుకు రెండు నెలలుగా బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా అధికారులు నిర్లక్ష్యం చేయడంపై వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు రుణాలు ఇవ్వడంలో చేస్తున్న ఆలస్యం మూలంగా తాము అప్పులు తెచ్చి విత్తనాలు తెచ్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు అధికారులు రుణాల చెల్లింపులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్టాఫ్ కొరత ఉందంటూ తమను పట్టించుకోవడంలేదని తెలిపారు. బంగారం తాకట్టు రుణాలు, వ్యవసాయ రుణాలు రెన్యువల్ చేసేందుకు రోజుల తరబడి జాప్యం చేస్తున్నారని దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయ ని అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత నెల రోజుల క్రితం బ్యాంకు అకౌంట్ లో డబ్బులు వేస్తే రోజుకు రూ.10 వేల నుండి రూ.20 వేలు మాత్రమే ఇస్తున్నారని దీంతో ఎరువులు విత్తనాలు రైతు కూలీల చెల్లింపులు చేయలేకపోతున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా బ్యాంకు అధికారులు స్పందించి త్వరగాగతిన రుణాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.



# యాదాద్రి థర్మల్ ద్వారా వచ్చే ఏడాది విద్యుత్

### రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్



**ప్రజాపక్షం/నల్లగొండ (దామరచర్ల ) :** యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లోని 5వ యూనిట్ పనులను జనవరి, 2026 నాటికి పూర్తి చేసి విద్యుత్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని,పవర్ ప్లాంట్ లోని ముఖ్యమైన పనుల పూర్తి పై అధికారులు ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ ఆదేశించారు.శుక్రవారం అయన దామరచర్ల మండలం లో ఉన్న యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను రాష్ట్ర జెన్కో సిఎండి డాక్టర్ ఎస్. హరీష్ తో కలిసి సందర్శించారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ విద్యుత్తు ఉత్పత్తి యూనిట్‌ను,పవర్ స్టేషన్‌కు బొగ్గు సరఫరా చేసే మార్షలింగ్ యార్డును, కూలింగ్ టవర్లు, స్విచ్ యార్డ్, తదితర యూనిట్లను ప్రిన్సిపల్ సెక్రెటరీ తిరిగి పరిశీలించారు.ఈ సందర్భంగా వనమహోత్సవం కింద పవర్ ప్లాంట్ ఆవరణలో మొక్కలు నాటారు.అనంతరం వై టి పి ఎస్ సమావేశ మందిరంలో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ఇంజనీరింగ్ అధికారులు, బిహెచ్ఇఎల్ ,జెన్కో అధికారులతో సమీక్ష నిర్వహించారు. వై టి పి ఎస్ చీఫ్ ఇంజనీర్ రమేష్ బాబు వైటిపిఎస్ ప్రస్తుత పరిస్థితిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రిన్సిపల్ సెక్రెటరీ, సీఎండీలకు వివరిస్తూ 2015 జూన్లో తలపెట్టిన ఈ ప్రాజెక్టు పనులు అక్టోబర్ 2017 లో ప్రారంభం అయ్యాయని,సవరించిన అంచనాల ప్రకారం 36,131.99 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ యూనిట్లలో ప్రస్తుత పరిస్థితిని ఆయన తెలియజేశారు.అనంతరం ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ జనవరి నుండి విద్యుత్ కు ఏర్పడే డిమాండ్ ను దృష్టిలో ఉంచుకొని అనుకున్న సమయానికంటే ఒక నెల ముందుగానే 5 వ యూనిట్ పనులు పూర్తి చేసి విద్యుత్ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు.రబీ సీజన్ తో పాటు, వేసవి ప్రారంభమవుతున్న దృష్ట్యా వై టి పి ఎస్ అధికారులు, అలాగే బీహెచ్ఈఎల్ ఇంజనీరింగ్ అధికారులు వీటన్నింటిని పరిగణనలో తీసుకొని 5 యూనిట్ ద్వారా ఫిబ్రవరి, 2026 లో కాకుండా, జనవరి, 2026 లోనే విద్యుత్ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. వై టి పి ఎస్ లోని ముఖ్యమైన పనులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, ప్రత్యేకించి పర్యావరణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ,టౌన్షిప్ పనులు నిర్దేశించిన సమయంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, అలాగే సివిల్ పనులపై సైతం ప్రత్యేక దృష్టిని నిలపాలని ,ప్రాజెక్టు పనుల్లో నాణ్యత ఉండేలా చూడాలని, ప్రతి పనిలో నాణ్యతను అభివృద్ధి చేసే విధంగా అధికారులు చూడాలన్నారు. తక్కువ ధరకు బొగ్గును తీసుకునే విధంగా అధికారులు మార్గాలు అన్వేషించాలని, థర్మల్ పవర్ స్టేషన్ పరిధిలో ఎక్కువ మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ,మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, వైటీపీఎస్ కోల్ డైరెక్టర్ నాగయ్య, సివిల్ డైరెక్టర్ అజయ్ ,థర్మల్ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి, థర్మల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లక్ష్మయ్య, సివిల్ సీఈ శ్రీనివాసరావు, బీహెచ్ఈఎల్ సిఇ సురేష్, బీహెచ్ఈఎల్ఈడి వినోద్ జాకబ్ ఈ సమీక్ష సమావేశానికి హాజరయ్యారు.



## బిసిల సాధికారతకు కాంగ్రెస్ కృషి

### దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్

**ప్రజాపక్షం/చింతపల్లి :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి వారి సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్ అన్నారు. మండల పరిధిలోని తీదేడు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ ఓ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి, గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బాలునాయక్ శుక్రవారం ప్రారంభించారు. వనమహూత్సవ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి మొక్కలు నాటారు. తీదేడు గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన గ్రీన్ కో కంపెనీ వాళ్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అనంతరం గొల్లపల్లి గ్రామానికి చెందిన కున్న అజయ్ విద్యుత్ షాక్‌తో మరణించిన విషయం తెలుసుకొని ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, ఆ పార్టీ అధ్యక్షుడు నాగభూషణం, భవాని పవన్ కుమార్, వెంకటయ్య గౌడ్, జితేందర్ రెడ్డి, యాదయ్య గౌడ్, శ్రీనివాస్ యాదవ్, హరినాయక్, కొండల్, దావలయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

## భూ భారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి:** పెండింగులో ఉన్న భూ భారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసీ కాన్ఫరెన్సు హాల్ నందు భూ భారతి, రేషన్ కార్డుల ధృవీకరణ, మీ సేవ దరఖాస్తులు, ఎఫ్‌లైన్ పిటిషన్లపై అన్ని మండలాల తాహసిల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి ద్వారా భూమి వివాదాలు తగ్గి రైతులకు భూ యజమానులకు శాశ్వత న్యాయం జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. భూమి సమస్యలపై ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో, రెవెన్యూ, సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, పరిష్కరించాలని ఆదేశించారు. అన్ని దరఖాస్తులపై తదుపరి చర్యలకు ముందు త్వరితగతిన నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. అసైన్‌మెంట్ భూముల సమస్యలను పూర్తిగా పరిశీలించి, నివేదికను సమర్పించాలని అన్నారు. దరఖాస్తులు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలని అన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. పెండింగులో ఉన్న రేషన్ కార్డుల దరఖాస్తులను వెంటనే పూర్తి చేసి, అదనపు కుటుంబ సభ్యుల చేర్పు, అనర్హుల తొలగింపు ప్రక్రియలను వేగంగా పూర్తి చేయాలని అన్నారు. మీ సేవ దరఖాస్తులు, ఎఫ్‌లైన్ పిటిషన్లు కొన్ని నిర్ణీత కాల పరిమితిని మించి పెండింగులో ఉన్న వాటిని అత్యవసరంగా పూర్తి చేసి ప్రజలకు ఆలస్యం లేకుండా సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ, జిల్లా పౌర సరఫరాల అధికారి స్వామి కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డు ఏడీ రామ్ చందర్, అన్ని మండల తాహసీల్దార్లు పాల్గొన్నారు.



# యువత గంజాయి బారిన పడకుండా చర్యలు

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** యువత, విద్యార్థులు, ప్రజలు గంజాయి బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఎం.హనుమంత రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం మినీ మీటింగ్ హాల్ లో జిల్లా లో గంజాయి నియంత్రణపై నిర్వహించిన సమావేశంలో డిప్యూటీ పోలీస్ కమిషనర్ అక్షాంక్ష్ యాదవ్ , అడిషనల్ డిసిపి లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయిపై ఉక్కుపాదం మోపాలని పోలీస్, ఎక్సైజ్, డ్రగ్స్ ఇన్స్పెక్టర్, వైద్య, విద్యా, అటవీ, ఆర్టీసీ, సంబంధిత అధికారులను సమన్వయం చేసుకుంటూ జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చాలని అన్నారు. జిల్లాలో అవగాహన సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు.గంజాయి మీద దృష్టి పెట్టి, యువతను, విద్యార్థులను గంజాయి, ఇతర మత్తు పదార్థాల నుండి కాపాడాలన్నారు. యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిస కాకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. యువతకు వాటి వల్ల కలిగే నష్టాలపై వివరించాలని, ఎక్కువగా పాఠశాలలు, కళాశాలలు ఉన్న చోట నష్టాలపై ఎక్కువ ఫోకస్ పెట్టాలని అన్నారు. గంజాయి చాలా ప్రమాదకరమైనదని భవిష్యత్తును అంధకారం లోకి తీసుకువెళ్తుందనే విషయాలను యువతకు తెలియజేయాలన్నారు. జిల్లాకు సరిహద్దు రాష్ట్రాల నుండి గంజాయి పదార్థాలు రాకుండా అన్ని చెక్ పోస్ట్ లలో గట్టి నిఘా పెంచి పటిష్ఠ చర్యలు చేపట్టాలని, జిల్లాలో గంజాయి పంట సాగును గుర్తించాలన్నారు. రవాణా, అమ్మకాలపై ప్రత్యేక నిఘా పెట్టి మూలాలతో సహా గంజాయి రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్సైజ్ అధికారులు చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థిని, విద్యార్థులకు అవసరమైతే భవిష్యత్తును నాశనం చేసే గంజాయిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో లో చదివే పిల్లలకు డ్రగ్స్ పై వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించాలన్నారు. తెలంగాణ సాంస్కృతిక కళాకారుల ద్వారా గంజాయి పై గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. డిప్యూటీ పోలీస్ కమిషనర్ అక్షాంక్ష్ యాదవ్ మాట్లడుతూ సంబంధిత అధికారులు అందరూ కార్యచరణ ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు డ్రగ్స్ నియంత్రణలో పోలీస్ శాఖ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ ల వద్ద గట్టి నిఘా ఉంచామని తెలిపారు. జిల్లా లోని పాఠశాలలు, కళాశాలల్లో, గంజాయి, మత్తు పదార్థాల వలన కలిగే నష్టాలపై యువతకు అవగాహన సదస్సులు నిర్వహించాలని అన్నారు. జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లా గా తీర్చి దిద్దేందుకు సమాచారం అందించడంలో ప్రతి ఒక్కరి సహకారం అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి, రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి, ఎక్సైజ్ సూపర్నెంట్ విష్ణుమూర్తి, జిల్లా అటవీశాఖ అధికారి పద్మజ, జిల్లా అధికారి మనో, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## భూ వివాదంలో మహిళలపై దాడి



**ప్రజాపక్షం/మోతె:** మండల పరిధిలోని రావిపహడ్ రెవిన్యూ గ్రామమైన అప్పన్న గూడెం గ్రామంలో వారసత్వ భూమి కోసం తిరుగుతున్న కుటుంబ మహిళలపై అమానుషంగా దాడి జరిగిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. భూమికి సంబంధించిన సర్వే నెంబర్లు 589/ఇ, 589/ఈ, 590/ఆ విస్తీర్ణంలో రెండు ఎకరాల 11 గుంటల భూమి తమ తండ్రిఐన ఏనుగు సురేందర్‌రెడ్డి సంపాదించిన భూమిలో ఇద్దరు కుమార్తెలు ఏనుగు సింధు, బింధులు వెళ్లగా వారసురాళ్లపై వారి మేనత్త పొలగం నీరజ బంధువులతో కలిసి బంధుత్వాన్ని మరిచి తీవ్రంగా దాడికి పాల్పడిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. భూమి అసలైన వారసులు తామేనని ఏనుగు సురేందర్‌రెడ్డి కుమార్తెలు వారి నాన్న చనిపోయిన తర్వాత ఆయన సంపాదించిన భూమి అక్రమంగా పట్టా చేసుకుని తమను భౌతికంగా దాడి చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయుధాలతో దాడి చేయగా మా తలలకు, చేతులకు బలంగా గాయాలయ్యాయని అన్నారు. మాకు పొలగం నీరజ కుటుంబంతో ప్రాణహాని ఉన్నదని బోరున ఏడ్చారు. గత కొద్దిరోజుల క్రితం తప్పుడు రికార్డులు సృష్టించి పట్టాలు చేసిన దాంట్లో మా భూమి ఉందని, ఈ భూమిని ఆర్ఐ మన్సూర్‌అలీ అక్రమంగా పట్టా చేసిందని జిల్లా కలెక్టర్ అట్టి భూమిని రికార్డుల నుండి తొలగించడం జరిగిందని తెలిపారు. కొన్ని ఏండ్లుగా జిల్లా కలెక్టర్,తహసిల్దార్, ఆర్ ఐ అధికారులను కలిసిన ఎలాంటి స్పందన రాలేదని వాపోయారు. స్థానికులు, గ్రామపెద్దలు ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, సర్వే నెంబర్ల ఆధారంగా భూమి హక్కును వారికి కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేటరూరల్:** సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. శుక్రవారం బాలెంల పల్లె దవాఖానను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని సూచించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకి అందుబాటులో ఉండాలన్నారు. రక్తహీనతతో బాధపడుతున్న పెషెంట్స్ ఎంత మంది ఉన్నారు. వాళ్ల చికిత్స పై అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ఆవరణలో వాటర్ ట్యాంక్ ను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా క్లీన్ చేయాల్సిందిగా గ్రామ కార్యదర్శిని అదేశించారు. వ్యాధి నిరోదక టీకాలు వేసే రోజు పెషెంట్స్ వచ్చినప్పుడు కూర్చోవడానికి వీలు ఉండటంలేదని డాక్టర్ చెప్పగా వెంటనే వెయిటింగ్ షెడ్ నిర్మించాలని గ్రామ కార్యదర్శిని అదేశించారు. ఈ నివేదికను రెండు రోజుల్లో ఇవ్వాలని అదేశించారు. అనంతరం బాలెంల ప్రాథమిక పాఠశాల సందర్శించి సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించి నాల్గవ తరగతి క్లాస్‌లోకి వెళ్లి సుశాంత్ అనే విద్యార్థిని ఇంగ్లీష్ అనుష్క అనే బాలికను తెలుగు చదివించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి తెలుగు, ఇంగ్లీష్ భాషలలో పట్టు సాధించాలని అన్నారు. టాయిలెట్స్ శుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ లేకుండా చూడాలని, నీటి గుంతలు ఉండే ప్రదేశంలో మట్టి పోయించాలని గ్రామ కార్యదర్శికి అదేశించారు. అంగన్‌వాడీ కేంద్రంను సందర్శించి సెంటర్‌లో ఎంతమంది పిల్లలు ఉన్నారు. వారికి అందుతున్న మెనూ వివరాలను తెలుసుకున్నారు. అనంతరం పిల్లల చేత పదాలు చదివించారు. కలెక్టర్ మాట్లాడుతూ మోడల్ అంగన్‌వాడీ కేంద్రంగా మార్చటానిఇక ప్రతిపాదనలు పంపాలని, టాయిలెట్స్ ఎత్తు పెంచుకోవాలని, వాటర్ ట్యాంకు నిర్మాణం చేయాల్సిందిగా అదేశించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అధికారి మణిరత్నం, ప్రాథమిక పాఠశాల హెడ్‌మాస్టర్ నీరజలత, ఉపాధ్యాయులు రేణుక, ఎల్లమ్మ, అంగన్‌వాడీ టీచర్ నాగమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరాజు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదలకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్యం

### రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ రమేష్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** పేదలకు కార్పోరేట్ స్థాయిలో ఉచిత వైద్యం అందుతుందని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పోరేషన్‌చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ముఖ్యమంత్రి సహాయనిధిని 18 మంది లబ్ధిదారులకు రూ.7.81 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరునెలల వ్యవధిలోనే 55 మందికి రూ.24.70, 500నియోజకవర్గంలో అందించినట్లు తెలిపారు. బిసిలకు రాజ్యాధికారమే లక్ష్యంగా బిసి గణన చేయించి 42 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత సిఎం రేవంత్‌రెడ్డికి దక్కిందన్నారు. ఈ సర్వే ఎంతో శాస్త్రీయంగా జరిగిందన్నారు. రైతుల సంక్షేమం కోసం పెద్దపీట వేయడం జరిగిందని చెప్పారు. ఈనెల 14వ తేదీన అర్హులైన వారికి రేషన్‌కార్డులను అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలో ప్రారంభించబోతున్న నూతన రేషన్‌కార్డుల పంపిణీకి సిఎం రేవంత్‌రెడ్డి వస్తున్నందున ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ ఊర రామ్మూర్తియాదవ్, నాయకులు ముదిరెడ్డి రమణారెడ్డి, నేరెళ్ల మధుగౌడ్, వెంకన్న నాయక్, పిల్లల రమేష్‌నాయుడు, మాజీ కౌన్సిలర్లు వెంకన్న, వెలుగు వెంకన్న, జ్యోతి, కరుణాకర్ పాల్గొన్నారు.

## ఆరోగ్య సంరక్షణకు పరిశుభ్రత కీలకం

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** వాతావరణ మార్పులు, వర్షకాలం వేగంగా దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకునే దిశగా పరిశుభ్రతను అలవర్చుకోవాలని మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి సూచించారు శుక్రవారం 100 రోజుల ప్రణాళికలో భాగంగా 36వ వార్డులో ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో నీటి నిల్వలతో దోమల ఉత్పత్తి అధికమవుతుందని, వాటివల్ల డెంగ్యూ, మలేరియా లాంటి వ్యాధులు విస్తరించే అవకాశం ఉండటంతో ప్రతి ఒక్కరు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తాగునీటిని కాచి చల్లారిన తర్వాత వాడాలని, పాత ట్యాంకులు, డ్రమ్ములు, బిందెల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అన్నారు. తడి, పోడి హనికరమైన చెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనాలకు ఇవ్వాలని కోరారు. శిధిలావస్థలో ఉన్న భవనాలను వెంటనే కూల్చివేయాలని, ప్రజల భాగస్వామ్యంతోనే ఆరోగ్యకరమైన సూర్యాపేటను నిర్మించగలమన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ డిఈ సత్యారావు, సానిటరి ఇన్స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు శివప్రసాద్, శ్వేత, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

## 'గార్డియన్'లో ఎంఇఒ హేమలత విచారణ



ప్రజాపక్షం/జమ్మికుంట: జమ్మికుంట పరిసర ప్రాంతంలో అతి తక్కువ ఫీజుతో ప్రైవేట్ విద్యను అందిస్తున్న గార్డియన్ స్కూల్‌పై మడిపల్లి గ్రామానికి చెందిన యాకూబ్ అనే వ్యక్తి హెచ్ఆర్‌సిలో ఫిర్యాదు చేయడంతో శుక్రవారం మండల విద్యాధికారి హేమలత పాఠశాలకు విచారణ నిమిత్తం హాజరయ్యారు. ఎంఈవో పలుమార్లు ఫిర్యాదుదారునికి ఫోన్ చేసి పాఠశాలకు రావాల్సిందిగా కోరగా స్పందన లేకుండా పోయింది. అన్ని రకాల వసతులను పరిశీలించారు. ఫిర్యాదుదారుడి కోసం కొంతసేపు వేచి చూసి వెళ్లారు.

## పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు



ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: ప్రతి ఒక్కరు ప్రకృతిని కాపాడుకోవాల్సిన భాద్యత ఉంటుందని ఫారెస్టు సెక్షన్ అధికారి సకారం నాయక్ అన్నారు.ప్రతి ఏటా వనమహోత్సవం జరుగుతుందన్నారు. చెట్లను కాపాడితే అవి మనల్ని కాపాడతాయని మీడియాతో అన్నారు. గొల్లపల్లి,గుండారం అటవీ పరిధిలో వనమహోత్సవాన్నినిర్వహించారు.శుక్రవారం మొక్కలను నాటారు. ఎస్సై మోతిరాం,అప్పర్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు,గుండారం గ్రామప్రజలు,ఫారెస్టు అధికారులు తదితరులున్నారు.

## నంబర్ ప్లేట్ లేని వాహనాలు సీజ్



ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు జగిత్యాల డీఎస్పీ సూచనలతో శుక్రవారంనాడు జగిత్యాల పట్టణంలో జగిత్యాల టౌన్ సిఐ కరుణాకర్, ట్రాఫిక్ ఎస్సై మల్లేషంతో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నెంబర్ ప్లేట్, బండి పత్రాలు సరిగ్గా లేని 70 వాహనాలను గుర్తించి వాటిని సీజ్ చేసి వారికి చలాన్లు విధిస్తూ వాహనదారులకు నెంబర్ ప్లేట్ కచ్చితంగా అమర్చుకోవాలని కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇకపైన జగిత్యాలలో వాహనదారులు అందరు నెంబర్ ప్లేట్లు సరిగా ఉండే విధంగా చూసుకుంటూ ట్రాఫిక్ రూల్స్ ని క్రమం తప్పకుండా పాటించాలని రాంగ్ రూట్ ప్రయాణం చేయవద్దని వారన్నారు. మైనర్లలకు వాహనాలు ఇవ్వకూడదని ఒకవేళ ఇచ్చినట్టు ఐతే తల్లిదండ్రులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని జగిత్యాల టౌన్ సిఐ కరుణాకర్, ట్రాఫిక్ ఎస్సై మల్లేషం హెచ్చరించారు.

## గీతా విద్యాలయంలో బోనాల పండుగ



ప్రజాపక్షం/చొప్పదండి: తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయానికి ప్రతిబింబం బోనాల పండుగ అని గీతా విద్యాలయం పాఠశాల డైరెక్టర్ లింగారావు అన్నారు. బోనాల పండుగను పురస్కరించుకుని పాఠశాలలో శుక్రవారం బనాల సంబురాలను నిర్వహించారు. విద్యార్థులు పోతురాజులు, పెద్ద పులుల వేషధారణతో ఆకట్టుకున్నారు. డిజె పాటలకు నాట్యాలతో అమ్మవారికి విద్యార్థులు, ఉపాధ్యాయులు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి స్థానిక పోచమ్మ గుడిలో బోనాలు సమర్పించారు. పాఠశాల చైర్మన్ ఆనంద రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తలిదండ్రులు పాల్గొన్నారు.

## టిజిఎంఆర్ పాఠశాలలో తనిఖీ



ప్రజాపక్షం / ధర్మపురి : జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్. లత శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని వంట గదిని, సరుకులను పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థినులతో ఏర్పాటు చేసిన మాక్ పోలింగ్‌లో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం అదనపు కలెక్టర్ లత విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. పదవ తరగతి పరీక్షా ఫలితాలలో పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ తహశీల్దార్ సుమన్, ఎంపిడివో రవీందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రావు, మేనేజర్ బాలే గంగాధర్, సానిటరీ ఇన్స్పెక్టర్ చిట్యాల గంగాధర్, పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. జ్యోతి పాల్గొన్నారు.

## గంజాయితో పట్టుబడిన యువకుడు


ప్రజాపక్షం/జగిత్యాలటౌన్: జగిత్యాలలో గంజాయి కలకలం రేపింది. గురువారం రాత్రి పట్టణ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సందర్భంగా అనుమానస్పందంగా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. తనిఖీ వాహనాలలో 120 గ్రాముల గంజాయి బయటపడింది. వెంటనే అతడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతడు పెగడపల్లి మండలానికి చెందినమల్యాల అజయ్‌గా గుర్తించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్ఐ కుమారస్వామి తెలిపారు.

## ఆకట్టుకున్న జనాభా దినోత్సవ ర్యాలీ



ప్రజాపక్షం/జమ్మికుంట: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని ఆరోగ్య ఉపకేంద్రాల వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆద్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ చందన, మోహన్‌రెడ్డి హెల్త్ ఎడ్యుకేటర్ ఆద్వర్యంలో శుక్రవారం జమ్మికుంట పట్టణంలోని పురవీధుల గుండా తిరుగుతూ అవగాహన కల్పించారు. కుటుంబ నియంత్రణ, లింగ సమానత్వం, పేదరికం, మాతృ ఆరోగ్యం, మానవ హక్కులు, జనాభా సమస్యలపై అవగాహన పెంచడమే జనాభా దినోత్సవ లక్ష్యమన్నారు. రత్నకుమారి, అరుణ, కుసుమ కుమారి, సదానందం, సాయికుమార్, సిబ్బంది నరేందర్, సరళ, మంజుల, సాజిదా పర్వీన్, సావిత్రి, సంధ్య వాణి, రాధా, ఆశాలు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



ప్రజాపక్షం/ఇల్లందకుంట: ఇల్లందకుంట మండల కేంద్రంలో 17 మంది లబ్దిదారులకు 7 లక్షల విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను హుజురాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అందజేశారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేదల పట్ల చిత్తశుద్ధితో పని చేస్తుందని, అర్హులైన వారందరికీ ఆదర్శమైన ప్రజాపాలన అందిస్తామని తెలిపారు.

# మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

### కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి



ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధి: మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, ఆకుకూరలు, కూరగాయలు తృణధాన్యాలతో కూడిన సమతుల్య ఆహారం తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కోతిరాంపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆద్వర్యంలో శుక్రవారం సభ జరిగింది. ఈ సభకు హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు తమ ఆరోగ్యంపై దృష్టి పెట్టాలన్నారు. సుమారు 50 వేల ఖరీదు చేసే ఆరోగ్య మహిళ ఉచిత వైద్య పరీక్షలను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరు నెలలకు ఒకసారి చేయించుకోవాలని సూచించారు. దీనివల్ల అనేక వ్యాధులనుముందస్తుగా గుర్తించి ప్రాణాపాయం నుంచి తప్పించవచ్చని తెలిపారు. ఆరోగ్య మహిళ పరీక్షల ద్వారా ఏడాది కాలంలో 13 మంది మహిళలకు క్యాన్సర్ వ్యాధిని మొదటి దశలోనే గుర్తించడం జరిగిందని అన్నారు. ముఖ్యంగా మహిళా గ్రూపు సభ్యులు తప్పనిసరిగా ఈ సేవలు వినియోగించుకుని ఇతర మహిళలకు అవగాహన కల్పించాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణీ, బాలింతలకు, పిల్లలకు అనేక సేవలు అందుతున్నాయని, ఆహారంతో పాటు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తున్నారని, ఈ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. బిపి, షుగర్ వంటి వ్యాధులకు సంబంధించిన అన్ని మాత్రలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో లభిస్తాయని, ఖర్చు పెట్టి బయటకొనవద్దని తెలిపారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలను సంప్రదించినా ఈ మాత్రలను ఉచితంగా అందిస్తారని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణీలకు నాలుగు ఉచిత వైద్య పరీక్షలతో పాటు టిఫా స్కానింగ్ చేయిస్తున్నామని తెలిపారు. చదువు మధ్యలో ఆపేసిన స్వయం సహాయక సంఘాల సభ్యులు ఓపెన్ స్కూల్‌లో చేరి పదవ తరగతి, ఇంటర్ పూర్తి చేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, మెప్మా పిడి వేణుమాధవ్, సిడిపివో సబిత, వైద్యారోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యావరణ సంరక్షణ అందరి బాధ్యత

### పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : పర్యావరణాన్ని సంరక్షించడం మనందరి బాధ్యతని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లిపట్టణంలోని ప్రభుత్వ ఐ.టి.ఐ ప్రాంగణంలో స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావుతో కలిసి వన మహోత్సవంలో మొక్కలు నాటారు. కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాలలో పచ్చదనం పెంచే దిశగా మనమంతా సంయుక్తంగా కృషి చేయాలని, ప్రతి ఒక్కరూ బాధ్యతతో మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ మొక్కలను కాపాడటం మనందరి బాధ్యతగా ప్రజలు ముందుకు రావాలని, మన పనిగా భావించి మొక్కలను పెంచాలని, అప్పుడే గ్రీనరీ పెరుగుతుందన్నారు. మొక్కలు నాటడంతో పాటు ఎన్ని బతుకుతున్నాయి అనేది కీలకమన్నారు. 10 లక్షల నిధులు మంజూరు చేసి వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.పెద్దపెల్లి జిల్లా హెడ్ క్వార్టర్ లో నూతనంగా జరిగిన రొడ్డు నిర్మాణాల వెంబడి మొక్కలు నాటాలని అన్నారు. ఈ సమావేశంలో పెద్దపల్లి వ్యవసాయ కమిటీ చైర్ పర్సన్ స్వరూప, సుల్తానాబాద్ వ్యవసాయ కమిటీ చైర్మన్ ప్రకాష్ రావు, జిల్లా అటవీ అధికారి శివయ్య,ఆర్డీవో రంగారావు, పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, తహసిల్దార్ రాజయ్య, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల లబ్ధిదారులకు ఉచిత ఇసుక స్లిప్పులు

### సిద్ధిపేట కలెక్టర్ హైమావతి



ప్రజాపక్షం/ సిద్ధిపేట ప్రతినిధి : జిల్లాలో ఎక్కడ ఇసుక నిల్వలు ఉన్నా యో పరిశీలించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక పంపిణికి టోకన్లు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ హైమావతి తహశీల్దార్, ఎంపిడిఓలకు ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం గురించి జిల్లా అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, అబ్దుల్ హమీద్, జిల్లా అధికారులు, ఆర్డీఓ, తహాశీల్దార్, ఎంపిడిఓలు,మున్సిపల్ కలెక్టర్లతో కలెక్టర్ హైమావతి సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ మోయతుమ్మెద వాగు ,కూడవెల్లి వాగు,వాటి ఉప కాల్వలో ఇసుక నిల్వలు ఉన్న మండలాల్లో సమస్య లేదని, మిగత దగ్గర మండలాల్లో సైతం వాగుల్లో ఇసుక తీసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎంపిడిఓ తహాశీల్దార్ లకు ఇసుక కావాలని రిక్వెస్టు పెట్టుకోవాలన్నారు. ఇసుక స్లిప్‌ను తప్పనిసరిగా ట్రాక్టర్ వద్ద ఉండాలన్నారు.

# అధునాతన టెక్నాలజీ వల్లే నేరాల నియంత్రణ సాధ్యం



ప్రజాపక్షం / కోనరావుపేట : వార్షిక తనిఖీల్లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కొనరావుపేట పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే, తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా పోలీస్ విధులు ఉండాలని,నేరాల నియాత్రణయే లక్ష్యంగా గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ పై దృష్టి సారిస్తు గ్రామాలను తరచు పర్యటిస్తూ ఇన్ఫర్మేషన్ వ్యవస్థ పటిష్టం చేయాలన్నారు. పెండింగ్లో ఉన్న కేసులు,కోర్టు కేసులు,పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న కేసుల వివరాలు,శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకొని పెండింగ్లో ఉన్న కేసులపై రివ్యూ చేసి పోలీస్ స్టేషన్ అధికారులు,సిబ్బంది పనితీరు భేషుగ్గా ఉందని అభినందించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో 5ఎస్ అమలు చేసిన తీరు,విధులు నిర్వహిస్తున్న సిబ్బంది యొక్క డ్యూటీలు వారికి ఉన్న సమస్యలు గురించి అడిగి తెలుసుకుని,రికార్డ్ రూమ్,రైటర్ రూమ్ తదితర అన్ని విభాగాలు క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ శాఖ నూతన టెక్నాలజీ అధునాతన టెక్నాలజీ ఉపయోగిస్తున్న దాని గురించి అధికారులకు సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. బ్లూ కోల్ట్, పెట్రో కార్ సిబ్బంది, అధికారులు పెట్రోలింగ్ సమయంలో స్టేషన్ పరిధిలోని చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు నిర్వహించే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని,రౌడీషీటర్స్, హిస్టరీ షీటర్స్, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా కఠినతరం చేస్తూ తరచు తనిఖీ చేయాలన్నారు.మల్కపేట గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో అధికారులతో కలసి మొక్కలు నాటిన అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన వాలీబాల్ కోర్టు ప్రారంభించి వారితో కలసి వాలీబాల్ ఆడారు. ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, సి.ఐ వెంకటేశ్వర్లు,ఎస్.ఐప్రశాంత్‌రెడ్డి ఉన్నారు.

# అభివృద్ధిని ఓర్వలేకే 'గంగుల' నిరాధార ఆరోపణలు

### 'సుడా' చైర్మన్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి



ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధి:కరీంనగర్ జిల్లా అభివృద్ధిని చూసి ఓర్వలేక బిఆర్ఎస్ నేతలు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి దుయ్యబట్టారు. బిఆర్ఎస్ పాలనలో అద్భుతాలు సృష్టిస్తే ఇప్పుడు అవన్నీ ఆగిపోయినట్లు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి చేసినవ్యాఖ్యలను పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. శుక్రవారం కరీంనగర్ డిసిసి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆనాడుప్రతిపక్ష కాంగ్రెస్‌పార్టీగా ఆందోళన చేశామని, ఈనాడు అధికార కాంగ్రెస్ ప్రభుత్వంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. పదేళ్లలో ప్రజలకిచ్చి హామీలు నెరవేర్చకుండా మోసం చేసి మేడిగడ్డ ప్రాజెక్టు కట్టిన తొమ్మిది నెలల్లోనే కూలిపోయిన మాదిరిగా బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు అదే విధంగా ఉన్నాయని విమర్శించారు. కరీంనగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ అధికారులు పూర్తి చేశారని, అందులో అర్హులైన బిఆర్ఎస్, బిజెపి కార్యకర్తలతో పాటు అన్ని పార్టీల వారున్నారని తెలిపారు. టెక్నికల్‌గా ఇందిరమ్మ కమిటీ నియామకం కొంత ఆలస్యమైందని,త్వరలో అందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పేర్కొన్నట్లు గతంలో చింతకుంటలోని 640 డబుల్ బెడ్‌రూం ఇండ్ల విషయంలో ఆందోళన చేసిందివాస్తవమేనని, పది సంవత్సరాలలో వాళ్లు కట్టింది అవి మాత్రమేనని, వాటిని సైతం పూర్తి చేసి ఇవ్వలేకపోయారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సంవత్సరానికి 3500 చొప్పున అర్హులైన లబ్దిదారులకు ఇండ్లు మంజూరు చేస్తున్నామని, ఆ 640 డబుల్ బెడ్‌రూం ఇండ్లను త్వరలో పూర్తి చేసి లాటరీ పద్ధతిలో లబ్దిదారులకు అందజేస్తామని నరేందర్ రెడ్డి తెలిపారు. ఎండి తాజ్, కొరివి అరుణ్ కుమార్, శ్రావణ్ నాయక్, దన్న సింగ్, దండి రవీందర్, ఆస్తాపురం రమేష్, కుర్ర పోచయ్య, అనిల్ కుమార్, సుదర్శన్, జొన్నల రమేష్, మాసూమ్ ఖాన్, అంజయ్య, రాజ్‌కుమార్ ఉన్నారు.

## దోనూర్‌లో ఒకరు దారుణహత్య



ప్రజాపక్షం / ధర్మపురి : జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం దోనూర్ గ్రామంలో వ్యక్తి దారుణహత్యకు గురైన సంఘటన గురువారం రాత్రి కలకలం రేపింది. ఎస్సై ఉదయ్ కుమార్ కథనం మేరకు దోనూర్ గ్రామానికి చెందిన గొల్లన రవి(45)కి పక్కింట్లో ఉండేగొల్లన నాగరాజుల మధ్య కొంతకాలంగా ఇంటి గట్టు విషయంలో గొడవలు జరుగుతున్నాయి. కాగా రవి కొత్త ఇంటి నిర్మాణం కోసం పిల్లర్ గుంతలు తవ్వకాలు చేయిస్తుండగా గమనించిన నాగరాజు హద్దు విషయంలో గొడపపడ్డారు. రవిని చంపాలని నిర్ణయించుకున్న నాగరాజు పథకం ప్రకారం ఇంటి నుండి తీసుకువచ్చిన కత్తితో పొట్టలో, ఇతర శరీర భాగాలలో పొడిచాడు. గమనించిన రవి కొడుకు విష్ణు అడ్డుకోబోగా అతనిపై సైతం కత్తితో దాడి చేయగా గాయపడ్డాడు. చికిత్స కోసం జగిత్యాలకు తరలించగా చికిత్స పొందుతూ రవి చనిపోయినట్లు ఎస్సై తెలిపారు. మృతుడు రవి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్సై ఉదయ్ కుమార్ కేసు నమోదు చేయగా సిఐ రాం నర్సింహ రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఉత్తమ సర్జన్‌గా పెంచలయ్య

### కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : అంతర్జాతీయ జనాభా దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం పోతుగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గతేడాది జిల్లాలో అత్యధిక ఆపరేషన్లు చేసినందుకుగాను కలెక్టర్ సందీప్ కుమార్ ఝు ప్రముఖ ప్రభుత్వ సర్జన్ డా. పెంచలయ్యకు ఉత్తమ సర్జన్ ప్రశంసా పత్రం అందజేశారు.జిల్లా వైద్యాధికారి డా.రజిత, పోగ్రాం ఆఫీసర్లు డా.ఏంజెలీనా, డా అనిత, డా.సంపత్, డా.గీతాంజలి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# నియోజకవర్గంలోని ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం

### చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



ప్రజాపక్షం/గంగాధర: తెలంగాణ రాష్ట్రంలోని పల్లెల అభివృద్ధి లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆద్వర్యంలో ప్రభుత్వం పనిచేస్తుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. చొప్పదండి నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామన్నారు.శుక్రవారంగంగాధర మండలం లక్ష్మి దేవిపల్లి, కురిక్యాల, గట్టుభూత్కూర్ గ్రామాల్లో రూ.30లక్షలతో నిర్మించిన సిసి రోడ్లను మేడిపల్లి సత్యం ప్రారంభించారు. ఒద్యారం మాజీ సర్పంచ్ మూలుకుంట్ల సంపత్ స్థానిక ప్రభుత్వ పాఠశాలకు 43 ఇంచెస్ టీవీ, వాటర్ ఫ్యూరిఫైయర్, బీరువా, విద్యార్థులకు షూలు, స్పోర్ట్స్ డ్రెస్‌లను ఎమ్మెల్యే చేతుల మీదుగా పాఠశాలకుఅందజేశారు. గంగాధర మార్కెట్ కమిటీ చైర్మన్ జాగిరపు రజిత, శ్రీనివాస్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ తిర్మల్‌రావు, వైస్ చైర్మన్ వేముల భాస్కర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, దుబ్బాసి బుచ్చయ్య, బూరుగు గంగన్న, అజయ్‌రావు, రోమాల రమేష్, సాయి గౌడ్, గుజ్జల బాపురెడ్డి, పడితపల్లి కిషన్, దోర్నాల శ్రీనివాస్‌రెడ్డి, తదితరులున్నారు.

# లాటరీ పద్ధతిన ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు

### సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝు



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్లప్రతినిధి : పారదర్శకంగా లబ్దిదారులకు లాటరీ పద్ధతిలో ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు చేస్తున్నామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝు అన్నారు. శుక్రవారం సందీప్ కుమార్ ఝు ముస్తాబాద్ మండల కేంద్రం మాతృశ్రీ గార్డెన్స్‌లో ముస్తాబాద్, గూడెం, కొండాపూర్ ఇందిరమ్మ ఇం డ్ల లాటరీ కేటాయింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ 94 ఇందిరమ్మ ఇండ్లను లబ్దిదారులకు లాటరీ పద్ధతిలో పారదర్శకంగా కేటాయించడం జరుగుతుందని అన్నారు.ఇండ్లు లేని నిరుపేదలకు నేడు ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు ప్రొసీడింగ్స్ అందిస్తామని, ఇండ్లు పోందిన ప్రతి ఒక్కరికి కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు.కొండాపూర్ ఇందిరమ్మ ఇండ్ల వద్ద రోడ్డు, ప్లంబింగ్ పనులు నిర్మించాల్సి ఉందని వీటి నిర్మాణం కోసం 30 లక్షల రూపాయలు కలెక్టరేట్ నిధుల నుంచి మంజూరు చేసి నెల రోజుల లోపు పూర్తి చేస్తామని అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల వద్ద మౌలిక వస్తువుల కల్పనకు ఇసుక, మోరం (మట్టి) సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కూడా వేగవంతంగా లబ్ధిదారులు పూర్తి చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల పురోగతి వివరాలను ఎప్పటికప్పుడు అధికారులు ఆన్ లైన్ లో అప్ డేట్ చేస్తూ సంబంధిత లబ్దిదారులకు ప్రభుత్వం నుంచి సహాయం అందేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. పరిశ్రమల శాఖ మంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో సాండ్ ట్యాక్సీ విధానం అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. 200 మంది యువకులకు వాహనాలు అందించే వారి ద్వారా ఇసుక మట్టి తరలింపుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం గూడెం గ్రామం పరిధిలోని నూతనంగా కేటాయించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం చేసి లబ్దిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కేకే మహేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్పర్సన్ తాలారీ రాణి పీడీ.హౌసింగ్ శంకర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేషాద్రి, మండల ప్రత్యేక అధికారి ఎంపి భారతి, తాసిల్దార్, ఎంపీడీవో సంబంధిత అధికారులు, సిబ్బంది ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.కోటితో సిసి రోడ్లు నిర్మాణం

### పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణరావు



ప్రజాపక్షం /సుల్తానాబాద్ : తెలంగాణ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమేముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యమని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు. శుక్రవారం మండలంలోని కదంబాపూర్, తొగరాయి గ్రామాలలో కోటి 5 లక్షల రూపాయలతో సిసి రోడ్లు డ్రైనేజీలా నిర్మాణాలకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేపట్టారు. తొగర్రాయి గ్రామంలో సమ్మక్క సారలమ్మ గద్దెల నిర్మాణానికిప్రహరీ, ఇందిరమ్మ గృహలకు భూమి పూజ కదంబపూర్‌లో మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభించారు. అనంతరం కదంబాపూర్, తొగర్రాయిలో సమావేశంలో మాట్లాడుతూ పేదలకు ఇల్లు, రేషన్ కార్డులు అందించి మహిళలను మహారాణులు గా మార్చేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. రెండు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల రేషన్ కార్డుల మంజూరి పత్రాలను అందించారు. అలాగే గ్రామాల్లో అనేక అభివృద్ధి పథకాలను, రోడ్లు, డ్రైనేజీలు రవాణా వంటి మౌలిక సదుపాయాలను చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం మానేరు పరివాహక ప్రాంతం నుండి ఇసుకను లారీల ద్వారా విక్రయించకుండా కేవలం గ్రామాలలో ట్రాక్టర్ ద్వారా నియోజకవర్గంలో ఉదయం 6 గంటల నుండి సాయంకాలం 6 గంటల వరకు సరఫరా చేస్తున్నామన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు , మండల పార్టీ అధ్యక్షులు చిలుక సతీష్,కేడీసీసీ జిల్లా డైరెక్టర్ సింగల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్,శ్రేణులుసాయిరిమహేందర్, దన్ నాయక్ దామోదర్‌రావు పాల్గొన్నారు.

## జనాభా పెరుగుదలపై అవగాహన

### మంచిర్యాలలో ర్యాలీలు, ప్రచార కార్యక్రమాలు

**ప్రజాపక్షం / నస్పూర్ :** ప్రజల్లో జనాభా పెరుగుదలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా విస్తృత కార్యక్రమాలు చేపట్టామని జిల్లా అధికారులు తెలిపారు. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి హరీష్ రాజు ఆదేశాల మేరకు, మంచిర్యాల జిల్లాలో ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశ జనాభా వృద్ధి రేటు 1.9 కి తగ్గిందని, యువతకు తగిన ఆరోగ్య సేవలు, జ్ఞానం, స్వేచ్ఛ అందుబాటులో ఉంటే భవిష్యత్తును స్వయంగా నిర్మించుకునే అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. కుటుంబ సంక్షేమ కార్యక్రమాలు, మాతా శిశు కేంద్రాలు, 102 అమ్మఒడి, తల్లి బిడ్డ సురక్షిత పథకం వంటివి జనాభా స్థిరీకరణకు దోహదం చేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కృపాబాయి, డా. అనిత, బుక్క వెంకటేశ్వర్, డాక్టర్ రమేష్, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్మూర్ ఆర్‌టిసి డ్రైవర్ నిర్వాకంపై ప్రజల ఆగ్రహం

**ప్రజాపక్షం / ఆర్మూర్ :** ఆర్మూర్ పట్టణానికి చెందిన ఓ యువతి హైదరాబాదులో బిటెక్ మూడో సంవత్సరం చదువుతుంది. గురువారం సాయంత్రం జూబ్లీహిల్స్ బస్టేషన్‌లో ఆర్మూర్ రావటానికి సూపర్ లగ్జరీ బస్సు సాయంత్రం టిఎస్ 16 జడ్ 0249 ఎక్కింది. ఆ యువతి వాష్‌రూమ్‌కు వెళ్లాలని, వాష్‌రూమ్‌లు ఉన్నచోట బస్సు ఆపాలని ఎంతో ప్రాధేయపడ్డా, డ్రైవర్ వినిపించుకోకుండా ఎక్కడ ఆపలేదు, చివరికి ఇందల్వాయి టోల్ ప్లాజా దగ్గర రాత్రి 9.30 గంటలకు ఆపాడు. ఆ యువతి వాష్‌రూం వెళ్లొచ్చేసరికి బస్సును ఆర్మూర్‌కు తీసుకొచ్చాడు. ఆ యువతి అక్కడే ఉండిపోయింది. ఏం చేయాలో తోచక చివరికి తమ తండ్రికి ఫోన్ ద్వారా సమాచారం అందిస్తే తండ్రి ఆ రాత్రి 10 గంటలకు ఆర్మూర్ నుండి ఇందల్వాయికి వెళ్ళి ఆ యువతిని కారులో ఇంటికి తీసుకొచ్చాడు. ఇదే విషయంపై శుక్రవారం బస్ డిపో మేనేజర్‌కు ఫిర్యాదు చేయడానికి తమ తల్లిదండ్రులతో డిపో మేనేజర్ దగ్గరికి వచ్చారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని వారికి తెలిపారు. డిపో మేనేజర్ ఆ డ్రైవర్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

## ఎస్‌పిని కలిసిన ఆర్‌ఎస్‌ఐలు



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఈరోజు ఆర్మడ్ రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు (ఆర్ఎస్ఐలు) తమ ఆన్‌ఫీల్డ్ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు.శిక్షణానంతరం,వారు జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఉపేందర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఆర్ఎస్ఐలకు శుభాకాంక్షలు తెలియజేశారు.పోలీసు సేవ అనేది ప్రజల రక్షణ కోసం,న్యాయం కోసం ఉద్దేశించినది,క్రమశిక్షణ,జవాబుదారీతనంతో కూడిన విధులు నిర్వహించడం ద్వారానే పోలీసు శాఖపై ప్రజల్లో నమ్మకాన్ని పొందవచ్చు అని ఆమె పేర్కొన్నారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ఆర్ఎస్ఐలు పాత్ర చాలా కీలకమని ఆమె గుర్తు చేశారు.ఆర్ఎస్ఐలు తమ శిక్షణలో నేర్చుకున్న పంచుకున్నారు.భవిష్యత్తులో జిల్లా పోలీసు యంత్రాంగానికి తమ వంతు సేవలు అందిస్తామని,ప్రజల భద్రతకు నిబద్ధతతో కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సమావేశం ఆర్ఎస్ఐలకు మరింత స్ఫూర్తినిచ్చి,వారి విధులను సమర్థవంతంగా నిర్వర్తించడానికి ప్రోత్సాహాన్ని అందించింది.

## నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి శిక్షణ

### జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం

**ప్రజాపక్షం/నస్పూర్ :** జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ వారి ద్వారా స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాలు ఉచితంగా అందించడం జరుగుతుందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ.పురుషోత్తం ఒక ప్రకటనలో తెలిపారు. ఎకౌంట్స్ అసిస్టెంట్ (ట్యాలీ)లో బి.కామ్ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు మూడున్నర నెలలు, గ్రాఫిక్ డిజైనింగ్, డిటిపిలో, కంప్యూటర్ హార్డ్వేర్ అసిస్టెంట్లో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారికి మూడున్నర నెలలు, ఆటో మొబైల్ 2, 3 వీలర్ సర్వీసింగ్‌లో 10వ తరగతి ఉత్తీర్ణులైన వారికి మూడున్నర నెలలు, ఎలక్ట్రిషియన్ (డొమెస్టిక్)లో 10వ తరగతి ఉత్తీర్ణులైన వారికి 4 నెలలు, సోలార్ సిస్టమ్ ఇన్స్టలేషన్ సర్వీస్ లో ఐటిఐ, ఇంటర్ ఉత్తీర్ణులైన వారికి 4 నెలలు, ఎలక్ట్రిషియన్ (డొమెస్టిక్) అండ్ సోలార్ సిస్టమ్ ఇన్స్టలేషన్ సర్వీస్‌లో ఐటిఐ., డిప్లొమా ఉత్తీర్ణులైన వారికి 6 నెలలు, కంప్యూటర్ హార్డ్వేర్, సెల్ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్, సి.సి. టివి టెక్నీషియన్ లో 10వ తరగతి ఉత్తీర్ణులైన వారికి 6 నెలలు, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, జరోజి, క్విల్ట్స్, బ్యాగ్స్ మేకింగ్ లో 8వ తరగతి ఉ ఉత్తీర్ణులైన వారికి 6 నెలలు, బేసిక్ అడ్వాన్స్ బ్యూటీషియన్ లో 10వ తరగతి ఉత్తీర్ణులైన వారికి 2/3 నెలలు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఇతర వివరాలకు 9133908000, 9133908222, 9133908111 లలో సంప్రదించవచ్చని, జిల్లాలోని గ్రామీణ పేద నిరుద్యోగ యువతకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## రైతులకు జొన్నలు, మినుముల మినీ కిట్ల పంపిణీ



**ప్రజాపక్షం/కౌడిపల్లి :** ఈ వాన కాలంలో వర్షా బావ పరిస్థితుల దృశ్య రైతులు వరికి ప్రత్యామయాయంగా ఆరుతడి పంటలు వేసుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు డివి రాజశేఖర్ రైతులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రమైన కౌడిపల్లి లోని రైతు వేదికలో జాతీయ ఆహార పోషక భద్రత పథకం కింద అర్హులైన రైతులకు మినుములు, జొన్నల మినీ కిట్లను వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డివి రాజశేఖర్ మాట్లాడుతూ, ఈ వాన కాల సీజన్లో వర్ష బావ పరిస్థితుల్లో వరి పంట వేసుకుంటే నీటికి ఇబ్బంది అవుతుందని వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలను వేసుకోవాలని రైతులకు సూచించారు. ఆరుతడి పంటలు అయితే తక్కువ పెట్టుబడి ఎక్కువ ఆదాయం పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని స్వప్న జాదవ్, మండల విస్తరణ అధికారిని సాహితీ ,సృజన, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్య సమస్యలతో తల్లీ కూతురు ఆత్మహత్య



**ప్రజాపక్షం/గజ్వేల్:** అనారోగ్య సమస్యలతో తల్లి కూతురు ఆత్మహత్య చేసుకున్న విషాదకర సంఘటన సిద్దిపేట జిల్లా వర్గల్ మండల పరిధిలోని గౌరారంలో చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి బాధితులు, గౌరారం ఎస్సై కరుణాకర్ రెడ్డి అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వెల్దుర్తి కవిత (32) పుట్టుకతో వికలాంగురాలు కాగా, ఆమె తల్లి భారతమ్మ (65) గత కొంతకాలంగా నరాల వ్యాధితో బాధపడుతోంది. అయితే వీరి బాగోగులు చూస్తున్న అల్లుడు మంజునాథ్ నెల రోజులుగా పచ్చ కామెర్ల వ్యాధితో వ్యాధితో బాధపడుతూ చికిత్స కోసం హైదరాబాద్ వెళ్లాడు.
అయితే మంజునాథ్ కు ఏమైనా జరగరానిది జరిగితే తమ పరిస్థితి ఏమిటని ఆందోళన చెందిన తల్లి కూతుర్లు కవిత, భారతమ్మ ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో వారు గురువారం పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గౌరారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తుండగా, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు కవితకు ఓ కూతురు, ఓ కుమారుడు ఉండగా, ఈ సంఘటనతో గౌరారంలో తీవ్ర విషాదం నెలకొంది.

# విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు: కలెక్టర్



**ప్రజాపక్షం/రామాయంపేట:** రామాయంపేట మున్సిపాలిటిలో మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పర్యటించారు. ఫ్రైడే.. డ్రైడేలో బాగంగా శుక్రవారం కలెక్టర్ మున్సిపాలిటిలోని 7వ వార్డు గొలిపర్తిలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరాంతో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా అక్కడ గుంతల్లో నీటి నిల్వలు, చెత్తాచెదారాన్ని చూసిన కలెక్టర్ పారిశుద్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో ఎక్కడ లేని డెంగ్యూ వ్యాదులు ఇక్కడ ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. విదుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ అధికారులను హెచ్చరించారు. మున్సిపాలిటి పరిదిలో నెలకొన్న పారిశుద్య పరిస్థితులను మెరుగుపరచడంతో పాటు సీజనల్ వ్యాదులను కట్టడి చేసేందుకు సమాంతరంగా తీసుకోవాల్సిన అత్యవసర చర్యలను పాటించేందుకు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. యాంటీ లార్వా ఆపరేషన్, మురుగు కాల్వలు, మురుగునీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వంటివి వేస్తున్నామని, దోమల నిర్మూలన కోసం ఫాగింగ్ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. దోమల ద్వారా వచ్చే వ్యాదులపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుందన్నారు. ఈకార్యక్రమంలో తహాశీల్దార్ రజినికుమారితో పాటు మున్సిపల్ మేనేజర్ రఘువరన్, వార్డు అధికారి నవీన్, సైదయ్య, సిబ్బంది ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సంక్షేమమే ప్రాధాన్యం

### మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

### కలెక్టర్ పి.ప్రావీణ్య

**ప్రజాపక్షం/సంగారెడ్డిప్రతినిధి:** విద్యార్థులు మన భవిష్యత్తు అని వారికి నాణ్యమైన విద్యావాతవరణం కల్పించాల్సిన భాధ్యత సంక్షేమాదికారుల దని జిల్లా కలెక్టర్ పి .ప్రావిణ్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ చాంబర్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులతో జిల్లాలో వసతి గృహాల నిర్వహణ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై విస్తృతంగా సమీక్ష జరిపారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడారు. వసతి గృహాలలో మౌలిక సదుపాయాల విషయమే ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ తెలిపారు. వసతి గృహాలలో నీటి సరఫరా విద్యుత్ సౌకర్యం, పరిసరాల పరిశుభ్రత మరుగుదొడ్లు ,మంచినీటి నాణ్యత ఆరోగ్యకరమైన వాతావరణం వంటి అంశాలపై అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. ప్రతి రోజు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశించారు. ఆహార నాణ్యతను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి మెనూ పాటించకపోతే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. విద్యార్థులకు సరైన సమయంలో పాఠ్యపుస్తకాలు నిబందనలకు అనుగుణంగా యూనిఫాంలో అవసరమైన పాఠశాల సామాగ్రి అందించాలన్నారు. వసతి గృహాల్లో మరమ్మతులు చేపట్టాల్సిన మరమ్మతులు వివరాలు అందించాలని పెండింగ్ పనులు వెగంగా పూర్తి చేయాలనీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సాంఘీక సంక్షేమాధికారి అఖిలేష్ రెడ్డి, బీసీ సంక్షేమాధికారి జగదీష్, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి దేవుజా పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, సీజనల్ వ్యాధుల నివారణపై సమీక్ష



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, సీజనల్ వ్యాధుల నివారణ, వనమహోత్సవం తదితర అంశాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. అవసరమైన వారికి మహిళా సంఘాల ద్వారా రుణాలు ఇప్పించే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు. వర్షాకాలంలో వ్యాధుల నియంత్రణకు ఫాగింగ్, బ్లీచింగ్, కాలువల శుభ్రత పనులు నిరంతరం చేపట్టాలని తెలిపారు.ఫీవర్ సర్వేలు, ఔషధాలు సరఫరా, రోగనిర్ధారణ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. గతంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలు వచ్చిన ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి వారు ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండాలని, మహిళా సంఘాల సభ్యులకు రక్త పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. వనమహోత్సవంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని, ఇప్పటికే నాటిన మొక్కల పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డిఓ రత్నకళ్యాణి, జడ్పీ సీఈఓ గోవింద్, ఇంచార్జి డిఆర్డిఓ శ్రీనివాస్, డిఎంహెచ్ఓ రాజేందర్, హౌసింగ్ పీడీ రాజేశ్వర్, అధికారులు, పాల్గొన్నారు.

## ఇంజనీర్ల సేవలు అమోఘం



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** ఇంజనీర్ల సేవలు అమోఘమైనవని నిజాంసాగర్ ప్రాజెక్టు ఏఈఈలు అక్షయ్ సాకేత్‌లు కొనియాడారు. శుక్రవారం నిజాంసాగర్ ప్రాజెక్టు సృష్టికర్త నవాబ్ అలీ నవాబ్ జంగ్ బహుదూర్ 148వ జయంతి సందర్భంగా తెలంగాణ ఇంజనీర్సడే వేడుకలను నిజాంసాగర్ ప్రాజెక్టు వద్ద ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రాజెక్టు వద్ద నవాబ్ అలీజంగ్ బహుదూర్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈఈలు, వర్క్ ఇన్స్పెక్టర్లు, ప్రాజెక్టు ఇరిగేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం /మంచిర్యాల ప్రతినిధి:** భారీ వర్షాలతో ఏర్పడే వరద పరిస్థితుల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శు క్రవారం జిల్లాలోని కోటపల్లి మండలం సర్పా, వేమనపల్లి మండలం రాచర్ల గ్రామాలలో ప్రాణహిత నది తీరంలో వరద నీరు పంట చేలలోకి రావడంతో కోటపల్లి మండల తహశీల్దార్ రాఘవేందర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి లక్ష్మ య్య, సి.ఐ. బన్సీలాల్ లతో కలిసి వరద పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాల దృష్ట్యా లోతట్టు ప్రాంతాలు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. వరద కారణంగా నదులు, వాగులు ఉప్పొంగి ప్రవహించే అవకాశం ఉన్నందున చేపలు పట్టేందుకు, వాగులు, నదులు దాటేందుకు ఎవరు వెళ్ళకుండా బందోబస్తు చర్యలు తీసుకోవాలని, ప్రజలందరికీ తెలిసే విధంగా గ్రామాలలో టాంటాం వేయించాలని తెలిపారు. గ్రామాలలో ప్రజలకు ఎలాంటి త్రాగునీటి ఇబ్బందులు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. వరద విపత్తి సమయంలో ప్రజల సహాయార్థం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నం.08736 250501 ఏర్పాటు చేయడం జరిగిందని, విద్యుత్ బిల్లుల సంబంధిత సమస్యలపై సైతం ఈ నంబర్లో సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎఒ సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## విరివిగా పంట రుణాలు పంపిణీ



### జిల్లాస్థాయి బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** రుణాల పంపిణీలో నిర్దేశిత లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేందుకు అంకిత భావంతో కృషి చేస్తూ తద్వారా ఆయా వర్గాల అభ్యున్నతికి బ్యాంకర్లు దోహదపడాలని కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. జిల్లాకు వ్యవసాయమే ప్రధాన ఆధారంగా ఉన్నందున పంట రుణాల పంపిణీకి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ త్రైమాసిక సమావేశం జరిగింది. ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి కేటాయించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతి, ప్రస్తుత వానకాలం పంటలకు గాను రైతాంగానికి అందించాల్సిన పంట రుణాలు తదితర అంశాలపై ఆయా బ్యాంకుల వారిగా కలెక్టర్ సమీక్షించారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రుణ ప్రణాళికను విడుదల చేశారు. వ్యవసాయ అనుబంధ, వ్యవసాయేతర, ఇతర అన్ని రంగాలకు కలిపి రూ. 17990.59 కోట్ల రుణాలు అందించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందులో ప్రాధాన్యత రంగాలకు రూ.13928.92 కోట్ల సదుపాయం కల్పించాలని వార్షిక ప్రణాళికలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పూర్తిస్థాయిలో పంట రుణాల లక్ష్యాన్ని సాధించేందుకు బ్యాంకర్లు చొరవ చూపాలని, రుణ పంపిణీ లక్ష్యాన్ని అధిగమించాలన్నారు. ఆయా రంగాల్లో పలు బ్యాంకులు లక్ష్యానికనుగుణంగా రుణాలు అందిస్తుండగా మరికొన్ని బ్యాంకులు వెనుకంజలో ఉండిపోతున్నాయన్నారు. ముఖ్యంగా విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు వీలుగా అందుబాటులోని రుణ వసతిపై వారికి అవగాహన కల్పిస్తూ ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులకు విద్యా రుణాలను అందించేందుకు చొరవ చూపాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, ఆర్బీఐ ఎల్‌డీఓ రాములు, డీఆర్‌డీఓ సాయగౌడ్, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ అశోక్ చవాన్, నాబార్డు ఏజియం ప్రవీన్‌కుమార్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

### ప్రకృతి వైపరీత్యాల నుండి

## ప్రజా రక్షణకు ముందస్తు చర్యలు

### కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం/నస్పూర్:** ప్రకృతి వైపరీత్యాల నుండి ప్రజల రక్షణకు ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం వర్షాలు విస్తారంగా కురుస్తున్నందున ప్రజల సౌకర్యార్థం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. భారీ వర్షాలు సంభవించినప్పుడు ఏర్పడే వరదలు, విపత్తుల సమయంలో ప్రజలను రక్షించేందుకు, ఆస్తులు నష్టపోకుండా సత్వరమే సేవలు అందించేందుకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వరదలు, విపత్తులు సంభవించినప్పుడు సహాయం కోసం ప్రజలు కంట్రోల్ రూమ్ నం.08736 250501 లో సంప్రదించవచ్చని, విద్యుత్ బిల్లులకు సంబంధించిన సమస్యలు సైతం వినియోగదారులు ఈ నెంబర్ లో సంప్రదించవచ్చని తెలిపారు. విద్యుత్ బిల్లుకు సంబంధించిన డాక్యుమెంట్లను వాట్సాప్ నం.9492120078 కు పంపించాలని తెలిపారు. జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జిల్లా అధికార యంత్రాంగం ఎల్లప్పుడు అందుబాటులో ఉండి అవసరమైన సేవలు అందిస్తుందని, ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు.

### పోక్సో కేసులో నిందితుడికి

## నాలుగేళ్ల జైలుశిక్ష, జరిమానా

### నిర్మల్ జిల్లా కోర్టు సంచలన తీర్పు..

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్:** నిర్మల్ జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టుపోక్సో ప్రత్యేక న్యాయస్థానం గౌరవ న్యాయమూర్తి శ్రీవాణి 2020 నాటి పోక్సో కేసులో నిందితుడికి నాలుగేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.6,000 జరిమానా విధిస్తూ సంచలన తీర్పు వెలువరించారు. ఈ తీర్పు జూలై 10 2025ను వెలువడింది. ఈ కేసు వివరాల్లోకి వెళ్తే 2020 సంవత్సరంలో నిర్మల్ జిల్లాలోని సోన్ మండలం జాఫ్రాపూర్ గ్రామానికి చెందిన దుమ్మాల శ్రీనివాస్ అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన 13 ఏళ్ల బాలికపై అత్యాచార యత్నం చేశాడు. ఈ దారుణ ఘటనపై సోన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు తక్షణమే దర్యాప్తు పారంభించారుజకేసు విచారణ సందర్భంగా పోలీసులు సమర్పించిన సాక్ష్యాలు, ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సమాజంలో ఇలాంటి నేరాలకు పాల్పడేవారికి గట్టి సందేశం పంపే విధంగా ఈ శిక్ష విధించారు.

**ఎస్‌పి డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ అభినందనలు..**

ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ మాట్లాడుతూ, సమాజంలో నేరం చేసిన వారు ఎవరూకూడా శిక్ష నుండి తప్పించుకోలేరని స్పష్టం చేశారు. నిర్మల్ పోలీసులు ప్రాసిక్యూషన్ విభాగం సమన్వయంతో,నేరస్తులకు శిక్షలు పడేలా కృషి చేస్తారని పునరుద్ఘాటించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడటంలో కీలక పాత్ర పోషించిన పబ్లిక్ ప్రాసిక్యూటిర్ కె.వినోద్ రావు, విచారణ అధికారులు ఎండి ఆశిఫ్(ఎస్ఐ), డ్యూటీ ఆఫీసర్స్ అయిన ఏఎస్ఐ డల్లు సింగ్, భాస్కర్, ప్రభాకర్ హెచ్‌సీలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ తీర్పుతో బాధితురాలి కుటుంబానికి న్యాయం జరిగిందని, భవిష్యత్తులో ఇలాంటి నేరాలను అరికట్టేందుకు ఇది ఒక హెచ్చరికగా నిలుస్తుందని అన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

### అదనపు కలెక్టర్ దీపక్ తివారి



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్:** నిరుపేదల కొరకు ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్ మండలం ఎన్జీవోస్ కాలనీ గ్రామ పంచాయతీలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నిరుపేదలకు గూడు కల్పించే ఉద్దేశ్యంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఇండ్ల నిర్మాణ దశలను రికార్డులలో నమోదు చేయాలని, తదనుగుణంగా సంబంధిత లబ్దిదారులకు బిల్లులు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిబంధనల ప్రకారం నిర్ణీత విస్తర్ణంలో ఇల్లు నిర్మించుకునే విధంగా లబ్దిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం, ప్రధాన మంత్రి శ్రీ నిధుల ద్వారా నూతనంగా నిర్మిస్తున్న అదనపు తరగతి గదులను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టిసారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ ఎంపిడిఒ కోట ప్రసాద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నూతన సిఐగా దేవయ్య బాధ్యతలు స్వీకరణ




**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎన్. దేవయ్య శుక్రవారం తాండూరు పోలీస్ సర్కిల్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్కిల్ పరిధిలోని ప్రజలు శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, శాంతిభద్రతలకు భంగం కలిగించినా, చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన సిఐ కుమారస్వామి ఖమ్మం జిల్లా మధిర సర్కిల్‌కు బదిలీపై వెళ్లారు.

# క్రీడ

## హడలెత్తించిన బుమ్రా



**387 పరుగులకే** తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ ఆలౌట్



**లా**ర్డ్స్ టెస్టులో భారత పేసర్ల విజృంభణతో ఇంగ్లాండ్ రెండో సెషన్‌లోనే ఆలౌట య్యింది. జస్ప్రీత్ బుమ్రా(574) ఇంగ్లాండ్ బ్యాటింగ్ యూనిట్‌ను కకావికలం చేశాడు. తొలి సెషన్‌లో మూడు వికెట్లతో ఆతిథ్య జట్టును దెబ్బతీసిన స్పీడ్‌స్టర్.. లంచ్ తర్వాత ఆర్చర్‌ను బౌల్డ్ చేసి ఐదో వికెట్ సాధించాడు. ఒకదశలో 271కే ఏడు వికెట్లు పడినా.. బ్రాండన్ కార్సే(56), వికెట్ కీపర్ జేమీ స్మిత్(51)ల అసమాన పోరాటంతో స్టోక్స్ సేన కోలుకుంది. వీళ్లిద్దరూ ఎనిమిదో వికెట్‌కు 84 పరుగుల కీలక భాగస్వామ్యంతో భారీ స్కోర్ అందించారు. అర్ధ శతకం తర్వాత జోరు పెంచిన కార్సే.. సిరాజ్ సంధించిన స్లో బాల్‌కు బౌల్డ్ కావడంతో 387 పరుగులకే ఇంగ్లాండ్ కుప్పకూలింది. బర్మింగ్‌హామ్‌లో సూపర్ విక్టరీతో సిరీస్ సమం చేసిన భారత జట్టు లార్డ్స్‌లోనూ పట్టుబిగించే దిశగా సాగుతోంది. రెండో రోజు తొలి సెషన్‌లో నిప్పులు చెరిగిన బుమ్రా (574) ఇంగ్లండ మిడిలార్డర్‌ను చకచకా చుట్టేశాడు. సిరాజ్ (285) కూడా ఓ చేయి వేయడంతో రెండో సెషన్‌లోనే ఆతిథ్య జట్టు ఆలౌటయ్యింది. రెండో కొత్త బంతితో చెలరేగిన అతడు బెన్ స్టోక్స్(44), జో రూట్(114) లను బౌల్డ్ చేసి ఆతిథ్య జట్టు నడ్డివిరిచాడు. అయితే.. రెండో టెస్టులో మాదిరిగానే టెయిలెండర్లు ఈసారి ప్రతిఘటించారు. ఏడు వికెట్ల పడి ఆలౌట్ అంచున నిలిచిన ఇంగ్లండ్‌ను వికెట్ కీపర్ జేమీ స్మిత్ (51) మరోసారి ఆదుకున్నాడు. 5 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద కేఎల్ రాహుల్ క్యాచ్ జారవిడవడంతో బతికిపోయిన స్మిత్.. అర్ధ శతకంతో ఆదుకున్నాడు. పేసర్ బ్రాండన్ కార్సే(56)తో కలిసి ఎనిమిదో వికెట్‌కు విలువైన 84 రన్స్ రాబట్టాడు. లంచ్ తర్వాతి ఓవర్లో స్మిత్‌ను ఔట్ చేసిన సిరాజ్ వికెట్ల వేటకు తెరతీశాడు. ఆ తర్వాత ఆర్చర్‌ను బౌల్డ్ చేసిన బుమ్రా ఐదో వికెట్ ఖాతాలో వేసుకున్నాడు. లార్డ్స్ మైదానంలో అతడు ఐదు వికెట్ల ప్రదర్శన చేయడం ఇదే మొదటిసారి. ఓ వైపు వికెట్లు పడుతున్నా ధాటిగా ఆడి హాఫ్ సెంచరీ బాదిన కార్సేను సిరాజ్ బౌల్డ్ చేయడంతో 387 వద్ద ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ ముగిసింది.

## నాకో సమస్య ఉంది..

### బయటపడే మార్గాలను అన్వేషిస్తున్నా: నీరజ్ చోప్రా

**భా**రత జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా ఈ సీజన్‌లో సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. పారిస్ డైమండ్ లీగ్‌లో ఛాంపియన్‌గా నిలిచిన చోప్రా.. స్వదేశంలో తన పేరుతో నిర్వహించిన ఎన్‌సీ క్లాసిక్ తొలి సీజన్‌లో విజేతగా అవతరించాడు. ప్రస్తుతం యూరప్‌లో శిక్షణకు సిద్ధమవుతున్న వరల్డ్ బెస్ట్ జావెలిన్ త్రోయర్ తన వ్యక్తిగత జీవితం గురించి ఒక ఆసక్తికర విషయాన్ని పంచుకున్నాడు. తన ఆటలో ఓ సమస్య ఉందని.. అదేంటో ఈమధ్యే తెలుసుకున్నానని చెప్పాడు చోప్రా. 'నా గేమ్ పరంగా ఒక సమస్య ఉంది. ఈ ప్రాబ్లమ్ ఏంటనేది ఈమధ్యే తెలుసుకున్నా. అదేంటంటే.. ఈటెన్ బలంగా విసిరేసిన తర్వాత నేను తరచూ ఎడమ పక్కకు పడిపోతున్నా. అయితే.. శిక్షణ సమయంలో నేను అలా పడిపోవడం లేదు. కానీ, పోటీలోకి దిగాక మాత్రం బడిసెను శక్తికొద్ది దూరం విసిరిన తర్వాత నాకు తెలియకుండానే ఎడమ వైపు కూలబడుతున్నా. దీనికి కారణం నేను ఎక్కువ శక్తిని ఉపయోగించడమే కారణమని కోచ్ చెప్పాడు.



అందుకే ఈ సమస్య మళ్లీ తలెత్తకుండా చూసుకోవడంపై దృష్టి సారించాను' అని చోప్రా వెల్లడించాడు. ఈమధ్యే దోహా డైమండ లీగ్‌లో తొలిసారి 90 మీటర్ల మార్క్ అందుకున్న చోప్రా అసాధ్యమన్నది లేదని చాటాడు. ఇదే అంశంపై స్పందించిన బడిసె వీరుడు ఏం అన్నాడంటే.. 'నా కెరీర్లో మొదటిసారి 90 మీటర్ల దూరం విసిరాను. అందుకు చాలా సంతోషంగా ఉంది. కానీ, ప్రతిసారి తొంభై మీటర్ల మార్క్ అందుకోవడంపై ఫోకస్ పెడుతున్నా. అయితే నేను నిలకడగా 88-89 మీటర్ల దూరం చేరుకుంటున్నా. నా ప్రదర్శన పట్ల కోచ్ సంతృప్తిగా ఉన్నానని చెప్పాడు. నేను మరింత నిలకడగా రాణించాలని అనుకుంటున్నా. నా తదుపరి లక్ష్యం వరల్డ్ ఛాంపియన్‌షిప్స్. అక్కడ కచ్చితగా పతకం గెలవాలి. సో.. ఆ టోర్నీ సన్నద్ధతకు ఏ ఈవెంట్ పనికొస్తుందో కోచ్‌తో మాట్లాడాక తేల్చుకుంటాను' అని చోప్రా వివరించాడు. టోక్యో వేదికగా సెప్టెంబర్‌లో వరల్డ్ ఛాంపియన్‌షిప్స్ ప్రారంభం కానుంది. 13 నుంచి 21 తేదీ వరకూ జరుగబోయే ఈ మెగా టోర్నీ కోసం నీరజ్ చెక్ రిపబ్లిక్‌లో 57 రోజులు శిక్షణ తీసుకోనున్నాడు.

## టీమిండియాపై రూట్ పదకొండో సెంచరీ




సుదీర్ఘ ఫార్మాట్‌లో పరుగుల వీరుడిగా పేరొందని జో రూట్ మరో శతకంతో రెచ్చిపోయాడు. భారత్‌పై సూపర్ సెంచరీతో జట్టును ఆదుకున్న రూట్ కెరియర్లో 37వ సారి మూడంకెల స్కోర్ అందుకున్నాడు. తనకు అచ్చొచ్చిన వేదికపై మరెవరికీ సాధ్యం కాని రికార్డును పట్టేశాడు రూట్. ఇక టీమిండియాపై అత్యధిక పర్యాయాలు వంద కొట్టిన రెండో ఆటగాడిగా చరిత్ర సృష్టించాడీ ఇంగ్లాండ్ మాజీ సారథి. లార్డ్స్‌లో కీలక ఇన్నింగ్స్‌తో శతకం బాది జట్టును పటిష్ట స్థితిలో నిలిపిన రూట్ ఒకే మైదానంలో అత్యధిక సెంచరీల వీరుల క్లబ్‌లో చేరాడు. అతడికి ఈ మైదానంలో ఇది ఎనిమిదో సెంచరీ కాగా.. శ్రీలంక వెటరన్ మహేల జయవర్దనే కొలంబో మైదానంలో ఏకంగా 11 సెంచరీలతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

## సిరాజ్‌కు బిగ్ వికెట్..



లార్డ్స్ టెస్టులో ఇంగ్లాండ్ ఆలౌట్ అంచున నిలిచింది. లంచ్ తర్వాత రెండో ఓవర్లోనే సిరాజ్ ఆతిథ్య జట్టును గట్టి దెబ్బ కొట్టాడు. క్రీజులో కుదురుకున్న జేమీ స్మిత్(51)ను ఔట్ చేసి స్టోక్స్ సేనకు షాకిచ్చాడు. వికెట్ కీపర్ జురెల్ అద్భుతంగా అందుకున్నాడు. అంతే.. 8వ వికెట్‌కు 84 పరుగుల కీలక భాగస్వామ్యానికి తెరపడింది. తొలి సెషన్లో సిరాజ్ ఓవర్లో 5 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద కేఎల్ రాహుల్ క్యాచ్ జారవిడవడంతో బతికిపోయిన స్మిత్.. అర్ధ శతకంతో ఆదుకున్నాడు. కానీ, ఈసారి మాత్రం సిరాజ్‌కే వికెట్ ఇచ్చేసి వెనుదిరిగాడీ యువకెరటం.

# సైన్స్ ఫోకస్



ఎ★★ అనే బ్లాక్ హోల్ నుంచి ఒక మిలియన్ సంవత్సరాల క్రితం విసిరిన శక్తివంతమైన ఢీల వలన ఏర్పడ్డవని పాలపుంత గెలాక్సీ గతంలో బ్లాక్ హోల్ క్రియాశీలత, గ్యాలాక్టిక్ వాయు ప్రవాహాలపై మరింత స్పష్టత లభిస్తోంది.

## ఫెర్మీ బబుల్‌లో చల్లని హైడ్రోజన్



**పా**లపుంత (మల్కీ వే) గెలాక్సీలో ఫెర్మీ బబుల్స్ ఉన్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించడం ఖగోళ శాస్త్రంలో కొత్త ఆవిష్కరణలకు తావిస్తున్నది. ఫెర్మీ బబుల్స్ అనేవి మన గెలాక్సీ మధ్యభాగం నుంచి రెండు దిక్కులకూ వ్యాప్తి చెందిన భయంకరమైన గ్యాస్ వాయువు గోళాలు. వీటిని తొలిసారిగా 2010లో నాసాకు చెందిన ఫెర్మీ గామా రే స్పేస్ టెలిస్కోప్ ద్వారా కనుగొన్నారు. ఇవి శక్తివంతమైన గామా రే ఉద్గారాలను వెలువరిస్తూ గెలాక్సీకి పైకి, కిందకీ సుమారు 25,000 లైట్ ఇయర్స్ వరకు విస్తరించి ఉన్నాయి. ఇలాంటి దట్టమైన, అధిక ఉష్ణోగ్రతలతో నిండిన ప్రాంతంలో చల్లని హైడ్రోజన్ కనుగొనడం అనేది అద్భుతమైన, విప్లవాత్మక విషయం. ఈనెల ప్రారంభంలో గ్రీన్ బ్యాంక్ టెలిస్కోప్ (జిబిటి) అనే అత్యాధునిక రేడియో డెలిస్కోప్‌ను ఉపయోగించి, ఫెర్మీ బబుల్స్ ప్రాంతంలో చల్లగా ఉన్న హైడ్రోజన్ మేఘాలను పరిశోధకులు గుర్తించారు. ఇవి చాలా తక్కువ ఉష్ణోగ్రతల్లో ఉండే గ్యాస్‌తో, తక్కువ ఉష్ణవిద్యుత్తుతో ఉన్నాయని తేల్చారు. సుదీర్ఘ గమనికల ద్వారా ఈ గ్యాస్ మేఘాలు ఫెర్మీ బబుల్స్ లోపలే ఉన్నాయి అని స్పష్టమైంది. ఫెర్మీ బబుల్స్ వంటి ప్రదేశాల్లో అధిక ఉష్ణోగ్రతల వాతావరణం ఉంటుంది. అలాంటిది చల్లని గ్యాస్ ఉండటం అనేది శాస్త్రవేత్తల అంచనాలకు విరుద్ధం. అందుకే, ఇప్పటి వరకూ ఉన్న కొన్ని సిద్ధాంతాలు లేదా అభిప్రాయాలు భవిష్యత్తులో మారడం ఖాయంగా కనిపిస్తున్నది. ఈ బబుల్స్, పాలపుంత కేంద్రంలోని సజిటేరియస్ ఎ** అనే బ్లాక్ హోల్ నుంచి ఒక మిలియన్ సంవత్సరాల క్రితం విసిరిన శక్తివంతమైన ఢీల వలన ఏర్పడ్డవని భావిస్తున్నారు. పాలపుంత గెలాక్సీ గతంలో బ్లాక్ హోల్ క్రియాశీలత, గ్యాలాక్టిక్ వాయు ప్రవాహాలపై మరింత స్పష్టత లభిస్తోంది. కాగా, చల్లని హైడ్రోజన్ మనం చూసే సాధారణ గెలాక్సీ నిర్మాణంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. గెలాక్సీ కేంద్ర భాగం చుట్టూ ఉన్న గ్యాస్ వాతావరణం ఎలా ఉండేదో ఈ కనుగొనడం ద్వారా స్పష్టమవుతుంది. దీని ద్వారా భవిష్యత్తు గ్యాలాక్సీ ఏర్పాట్లు, నక్షత్రాల జననం, వాయు ప్రవాహాల మెకానిక్స్ గురించి కొత్త మోడల్స్ రూపొందించవచ్చు. అమెరికాలోని పశ్చిమ విజినియాలో ఉన్న ప్రపంచంలోనే అతిపెద్ద రేడియో టెలిస్కోప్ జిబిటి సాయంతో చేసిన 220గంటల పర్యవేక్షణల ద్వారా ఈ చల్లని హైడ్రోజన్ మేఘాల గురించిన అంచనాలు స్థిరపడ్డాయి. ఈ అధ్యయన వివరాలను 'నేచర్ ఆస్ట్రానమీ' పత్రికలో ప్రచురించారు. ఈ సంచలనాత్మక ఆవిష్కరణ ఫెర్మీ బబుల్స్ చుట్టూ ఉన్న శక్తివంతమైన, ప్రమాదకరమైన వాతావరణం కేవలం వేడిగా మాత్రమే కాకుండా కొన్ని ప్రాంతాల్లో చల్లగా, నిరీక్షణలో ఉండే నక్షత్ర మూలాలతో కూడినదిగా ఉండవచ్చని పేర్కొంటున్నది. ఖగోళశాస్త్రంలో ఇది భవిష్యత్తు పరిశోధనలకు దిశానిర్దేశం చేస్తుంది. అందుకే ఈ ఆవిష్కరణను ఖగోళ శాస్త్రం, ప్రత్యేకించి మన గెలాక్సీపై లోతైన అధ్యయనానికి దిక్సూచిగా శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.



## నాసా 'డార్ట్'తో భూగోళానికి రక్షణ!

**అ**మెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా' చేపట్టిన 'డబుల్ ఆస్టెరాయిడ్ రిడైరెక్షన్ టెస్ట్' (డార్ట్) విజయవంతం కావడంతో, గ్రహ శకలాల నుంచి భూమికి చాలా వరకు రక్షణ లభిస్తుందని శాస్త్రవేత్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. గ్రహశకలాల నుంచి భూమిని కాపాడే తొలి ప్రయత్నంగా ఈ ప్రయోగాన్ని భావించవచ్చు. భవిష్యత్తులో భూమికి హానికరం చేసే గ్రహశకలాలను కనిపెడితే, వాటి దిశను మార్చి భూమిని రక్షించే అవకాశం ఉందా? అనే ప్రశ్నకు సమాధానంగా డార్ట్ ప్రయోగాన్ని రూపొందించారు. 2025లో వచ్చిన తాజా అధ్యయన ప్రకారం, డార్ట్ ఢీకొనడం వల్ల వందకు పైగా పెద్ద గ్రహశకలాలు బయటకు వెళ్తున్నట్టు గుర్తించారు. ఇవి డిమార్ఫోస్ ఉపరితలంపై ఉన్న మట్టిని, పరిసరాల నుంచి విడదీసి, బయటకు తోస్తాయి. డార్ట్ ప్రయోగంతో, విజయవంతమైన ఢీ ద్వారా భవిష్యత్తులో భూమికి హానికరంగా మారే గ్రహశకలాలపై మానవ జాతికి దిశ మార్చే శక్తి ఉందని చూపించింది. తక్కువ గురుత్వాకర్షణగల పర్యావరణ శాస్త్రంలో భాగమైన 'ఆబ్జెక్టివ్ బిహేవియర్' మీద జరుగుతున్న పరిశోధనలు డార్ట్ ప్రయోగం ఆధారంగా మరింత ముందుకు సాగుతున్నాయి. గ్రహ శకలాన్ని ఢీకొన్న తర్వాత ఏర్పడిన ధూళి మేఘాల ఆదారంగా డిమార్ఫోస్ అంతర్గత నిర్మాణం తీరుపై విలువైన సమాచారం లభించినట్టు శాస్త్రవేత్తలు ప్రకటించారు. డార్ట్ మాదిరిగానే యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (ఇఎస్ఎ) కూడా 'హెరా' మిషన్‌ను రూపొందిస్తున్నది. ఇది డిమార్ఫోస్‌కి 2026లో చేరి, అది ఎలా మారిందనే విషయంపై అధ్యయనం చేస్తుంది. ఇలావుంటే, డార్ట్ ప్రయోగం చివరి 5 సెకన్లలో పంపిన చిత్రాలు ప్రపంచ వ్యాప్తంగా వైరల్ అయ్యాయి. గ్రహశకలాన్ని ఢీకొన్న తీరు అద్భుత దృశ్యాన్ని ఆవిష్కరించింది.

## ఫీజు బకాయిలు విడుదల చేయండి

### ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అజిత్ డిమాండ్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** విద్యార్థులకు రావాల్సిన ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డిఐఇఒ వెంకటేశ్వరరావుకు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లకుండా చేస్తున్నారని మండిపడ్డారు. సర్టిఫికెట్లకోసం కాలేజీ యాజమాన్యాలు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, డబ్బులు చెల్లించలేని వారు చదువులకు స్వస్తి చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్‌జిల్లా సహాయ కార్యదర్శి గుండాల సుజన్, జిల్లా సమితి సభ్యులు కమల్, నాయకులు మహేష్, రవి, వెంకటేష్, సునీల్, యోగి, ఆదిత్య పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలు నియంత్రించండి

### ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో పోలీసులకు వినతి



**ప్రజాపక్షం/భద్రాచలం :** మత్తుపదార్థాల నివారణకు కృషి చేయాలని కోరుతూ ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఎస్ఐ శ్యాంప్రసాద్‌కు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఈసందర్భంగా ఎఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సాధనపల్లి సతీష్ మాట్లాడుతూ మత్తు పదార్థాల నియంత్రణలో భాగంగా అడ్డుకోవడం, అమ్మకాలు సాగించే వారిని, వాడే వారిని కఠినంగా శిక్షించడం వంటి చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా యువత చెడు దారుల్లో పయణించకుండా ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కొక్కిరేణి అశోక్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు నారపోగు ఏసు, కటిటపు మహేష్, ప్రవీణ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## విషజ్వరాలు ప్రబలకుండా మెడికల్ క్యాంప్‌లు : సిపిఐ డిమాండ్



**ప్రజాపక్షం/మణుగూరు :** విషజ్వరాలు ప్రబలకుండా మణుగూరు మండలం మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాలలో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని సిపిఐ మణుగూరు పట్టణ, మండల కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, జక్కుల రాజబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కావడంతో చెత్తా చెదారం పెరిగిపోయి, దోమలు స్వైర విహారం చేయడంతో జనాలు జ్వరాలు బారిన పడి ఇబ్బంది పడుతున్నారన్నారు. సంబంధిత అధికారులు గ్రామాల్లో ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని, కాలువలు శుభ్రం చేయాలని, బావులలో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, దోమలు ప్రబలకుండా క్లోరినేషన్ చల్లాలని, హాస్టల్స్‌లో విద్యార్థులకు మెడికల్ క్యాంపులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి మణుగూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు రాయల భిక్షం, గడ్డం వెంకటేశ్వర్లు, సిపిఐ పట్టణ, సహాయ కార్యదర్శులు తోట రమేష్, చింతల దశరథం, ఎడారి రమేష్, వేర్పుల నరేష్, ఆధర్ల రాములు, కొత్తపల్లి సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి పోరాటాలు

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి

### 15న దేవరకొండలో సిపిఐ నల్లగొండ జిల్లా 23వ మహాసభలు



**ప్రజాపక్షం/దేవరకొండ :** జిల్లాలో తాగు, సాగు నీటి సరఫరాకు పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి పోరాటాలు ఉధృతం చేస్తామని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో జరిగిన దేవరకొండ, చందంపేట, కొండమల్లేపల్లి, పిఏపల్లి, నేరేడుగొమ్ము, గుడిపల్లి మండలాల మండల కౌన్సిల్ సమావేశానికి పల్లా నర్సింహారెడ్డి హాజరై మాట్లాడారు. జిల్లాకు శాశ్వత కరువు నివారణకు చేపట్టిన ఎస్ఎల్‌బిసి సొరంగ నిర్మాణం, డిండి ఎత్తిపోతల పథకం, బి వెల్లెంల ఎత్తిపోతల, పిల్లాయిపల్లి ధర్మారెడ్డి ఫీడర్ ఛానల్స్, మైనర్ ఇరిగేషన్ పథకాలకు గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో నిధులు కేటాయించకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ఈ ప్రాజెక్టులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం త్వరగా పూర్తి చేయుటకు అధిక నిధులు కేటాయించి పనులు పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నిత్యావసర సరుకుల ధరలు అదుపు చేయకుండా పెట్రోల్, డిజిల్, వంట గ్యాస్ ధరలు పెంచి సామాన్య ప్రజలపై మోయలేని భారం మోపుతున్నారని, పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి 4లేబర్ కోడ్లుగా తీసుకువస్తుందన్నారు. కేంద్రంలో ప్రజా వ్యతిరేకపాలన చేస్తున్న బిజెపి నుంచి దేశాన్ని రక్షించుకోవడానికి ప్రజాస్వామ్య లౌకిక శక్తులు ఐక్యం కావాల్సిన అవసరం ఉన్నదన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో అనేక వాగ్దానాలు చేసిందని, ఇచ్చిన హామీలన్నీ పరిష్కరించాలని కోరారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నల్లగొండ జిల్లా 23వ మహాసభలు ఈనెల 15న దేవరకొండలోని ముదిగొండ రోడ్డులోని మందాడి నర్సింహారెడ్డి ప్రాంగణం(సాయిరమ్య ఫంక్షన్‌హాల్) జరుగనున్నాయని ఆయన తెలిపారు. జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభలో చర్చించి భవిష్యత్ పోరాట కార్యక్రమాన్ని రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శులు దేప సుదర్శన్‌రెడ్డి, ఉప్పునూతల వెంకటయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, అచ్చయ్య, జయరాములు, సహాయ కార్యదర్శి రామస్వామి, పట్టణ కార్యదర్శి ఆంజనేయులు, మండల కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు పల్లా రంగారెడ్డి, వెంకట్రాములు, రాంరెడ్డి, పాండురంగారెడ్డి, అనిత, వెంగలయ్య, యాదయ్య, గోవర్ధన్, మైనోద్దీన్, జ్యోతిబస్, రమేష్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్‌కు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు డిమాండ్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** డ్యూటీలో ఉండగా చనిపోయిన అంగన్‌వాడీ టీచర్‌కు ఎక్స్‌గ్రేషియా చెల్లించి కుటుంబాన్ని ఆదుకోవాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వీర్నపల్లి మండలం మద్దిమల్ల గ్రామం లబ్ధి తండాలో విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్, ఈనెల 8న స్కూలు నుంచి వస్తున్న క్రమంలో తనకు లిఫ్ట్ ఇచ్చి దారి మళ్లించి తీసుకెళ్తున్న క్రమంలో జరిగిన ప్రమాదంలో రోడ్డుపై పడి తీవ్రంగా గాయాలపాలయింది. స్థానికులు గమనించి హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మరణించడం బాధాకరమన్నారు. ఆయాలపై ఇలాంటి అఘాయిత్యాలపై పాల్పడుతున్న వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాని, ఇతర ప్రాంతాలలో విధులు నిర్వహిస్తున్న ఆయాలకు, టీచర్లకు భద్రత కల్పించాలని, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఎదురుగట్ల మమత, కల్లూరి చందన, టీచర్లు శాంత, సరోజన, మంజుల, అన్నపూర్ణ, వనజ, శోభ పాల్గొన్నారు.



## జిల్లా సమగ్ర అభివృద్ధికి ఉద్యమాలు

### సిపిఐ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్

### ఈనెల 13, 14న సిపిఐ జిల్లా మహాసభలు

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** జిల్లా సమగ్ర అభివృద్ధికి ఉద్యమాలు చేపడతామని సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 13,14 న నిర్వహించే భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 5వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రావి నారాయణరెడ్డి భవన్‌లో సిపిఐ నాయకులతో కలిసి మహాసభల పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ ఈ మహాసభలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు 150 మంది డెలిగేట్స్ తో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా మహాసభలను ఈ నెల జులై 13 న రేగొండ ఎస్ఎల్ఎన్ గార్డెన్ లో మహా సభ నిర్వహించడం జరుగుతుందని, 14న జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో భారీ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మహాసభలో జిల్లా సమగ్ర అభివృద్ధికి చర్చించి భవిష్యత్ కార్యక్రమం రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా భూపాలపల్లికి బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయాలని, జిల్లా సమగ్ర అభివృద్ధిని ప్రతిబింబించే విధంగా మహాసభలలో చర్చించడం జరుగుతుందన్నారు. జిల్లా అభివృద్ధి కోసం అధిక నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపైన పెద్ద ఎత్తున చర్చ జరిపి తీర్మానాలు ప్రవేశపెట్టి భవిష్యత్తు ఆందోళన పోరాటాలు చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లా మహాసభలను ప్రజలు, మేధావులు, కార్మికులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని రాజ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఐ, ఎఐటియుసి నాయకులు మాతాంగి రామచందర్, గురుజేపల్లి సుధాకర్‌రెడ్డి, సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొరిమి సుగుణ, క్యాతరాజ్ సతీష్, నేరెళ్ల జోసెఫ్, వేముల శ్రీకాంత్, గోలి లావణ్య, పెద్దమాముల సంధ్య, పొన్నగంటి లావణ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## సంక్షేమబోర్డులో అర్హులకు సభ్యత్వం



### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్

**ప్రజాపక్షం/చింతలపాలెం :** అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులందరికీ సంక్షేమ బోర్డులో సభ్యత్వం కల్పించాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండల కేంద్రంలో టిప్పర్ డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టిప్పర్ డ్రైవర్లు, వర్కర్స్‌ను సంక్షేమ బోర్డులో సభ్యులుగా చేరే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పించాలని కోరారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసి పని గంటలు పెంచే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులందరికి ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలదేనన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అప్పనంగా కార్పోరేట్ వ్యక్తులకు అప్పజెప్పే విధానాన్ని కార్మికులతో పాటు దేశ ప్రజలు కూడా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్ మాట్లాడుతూ సంక్షేమబోర్డులో అర్హులైన అసంఘటిత రంగ కార్మికులం దరినీ సభ్యులుగా చేర్పించి వారికి రావాల్సిన బెనిఫిట్లను తక్షణమే విడుదల చేయాలని, పెండింగ్‌లో క్లైమ్స్‌ను అర్జిదారులకు అందించే విధంగా అధికారులు, ప్రభుత్వం పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి యూనియన్ నాయకులు అమరబోయిన శ్రీనివాస్, మునగా నర్సింహరావు, కారింగుల కొండ లెనిన్, విజయ్‌కుమార్ స్వామి, మహిమూద్, లింగస్వామి, వెంకన్న, నారాయణరెడ్డి, భాగ్యరాజు, వెంకటేశ్వర్లు, ధర్మ, లింగరాజు, ప్రసాద్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## మైనారిటీ గురుకుల పాఠశాలలో ఉద్యోగాలకు దరఖాస్తులు

జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** జిల్లా మైనారిటీ గురుకులం, జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న టీచింగ్ ఉద్యోగాలకు ఔట్ సోర్సింగ్ పద్ధతిన భర్తీ చేయుటకు అర్హులైన అభ్యర్థుల దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఎం.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. టిజిటి ఉర్దూ1, టిజిటి సైన్స్1, పిఇటి 1 ఉద్యోగాల భర్తీకి ఇంగ్లీష్ మీడియంలో బోధించుటకు అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 11 నుండి 15వరకు దరఖాస్తులు చేసుకోవాలని వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల శాఖ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

## పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సోతుకు ప్రవీణ్ కుమార్



**ప్రజాపక్షం/మల్హర్:** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 5వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ మల్హర్ మండల కమిటీ ఆధ్వర్యంలో తాడిచర్ల హనుమాన్ సెంటర్లో శుక్రవారం వాల్ పోస్టర్ (గోడపత్రిక) ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సోతుకు ప్రవీణ్ కుమార్, సిపిఐ మండల కార్యదర్శి పన్నాల కుమారస్వామిలు మాట్లాడుతూ, నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతు 99 వసంతాలను పూర్తి చేసుకున్న భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా మహాసభలను ఈ నెల 13,14వ తేదీన రేగొండ ఎస్ఎల్ఎన్ గార్డెన్ లో లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ జిల్లా మహాసభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాస్ రావు ముఖ్యఅతిథిలు గా హాజరవుతున్నారని తెలిపారు. మహాసభలో జిల్లా సమగ్ర అభివృద్ధికై చ ర్చించి భవిష్యత్ కార్యక్రమం రూపొందించుకోవడం జరుగుతుందని అన్నారు. ముఖ్యంగా మల్హర్ మండలం అభివృద్ధి ఆమడ దూరం లో ఉంది అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు క్యాతరాజ్ సతీష్, గ్రామశాఖ కార్యదర్శి ఎండి.రహీమ్, మండల శాఖ సహాయ కార్యదర్శి యాషాదాపు రాజయ్య, ప్రజలు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## గనిలో కరువైన కార్మికుల సంక్షేమం

ఎఐటియుసి అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ ఆసిఫ్ పాషా



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** కెటికె 5వ గనిలో కార్మికుల సంక్షేమం కరువైందని ఎఐటియుసి అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ ఆసిఫ్ పాషా ఆరోపించారు. కెటికె 5ఇంక్లైన్లో డిస్ట్రిబ్యూషన్ పాయింట్ వద్ద గుర్తింపు సంఘం ఎఐటియుసి ఆధ్వర్యంలో పిట్ సెక్రటరీ దోర్నాల తిరుపతి అధ్యక్షతన గేట్ నిర్వహించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ ఎండి అసిఫ్ పాషా మాట్లాడుతూ, గనిలో కార్మికుల సంక్షేమం కరువైందనిని ఆరోపించారు. గని సమస్యలపై సేఫ్టీ కమిటీ, మైన్స్ కమిటీ లలో గుర్తింపు సంఘం నాయకులు కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లిన అధికారులు వాటిని పరిష్కరించడంలో విఫలమవుతున్నారని అన్నారు. 1S/5ఎ సెక్షన్ లో మ్యాన్ రైడింగ్ ను పొడిగించాలని ఎక్టెన్షన్ చేయాలని, మ్యాన్ రైడింగ్ కుర్చీలను పెంచాలని, ఎస్ ఎస్ 2 డిస్టిక్లో వెంటిలేషన్ మెరుగు పరచాలని, బ్యాంక్ హెడ్, సిహెచ్ పి, సిసి, ట్రామర్, షెడ్లలో రేకులు మార్చాలని, రెస్ట్ షెల్టర్ లో ఉన్న పాత సామాన్లను తీసివేయాలని, స్టేజి మీద షెడ్ ఏర్పాటు చేయాలని, ట్రావలింగ్ రోడ్ హాలేజ్ రోడ్లలో లైటింగ్ ఏర్పాటు చేయాలని, మహిళ జనరల్ అసిస్టెంట్లకు ప్రత్యేకంగా వాష్ రూమ్ ఏర్పాటు చేయాలని, కార్మికునికి మైన్ షూతో పాటు సాక్స్ కూడా ఇవ్వాలని, క్యాంటీన్లో చట్నీని రుచికరంగా తయారు చేయాలని, 150 హెచ్ పి హానర్ మోటార్లను నాణ్యత మైనవి తెప్పించాలని డిమాండ్ చేస్తూ గని మేనేజర్ అనుగ్రహ నారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పిట్ సెక్రటరీలు నల్ల సత్తి, రాజేందర్, నాగేంద్రబాబు, పి.నారాయణమూర్తి, ప్రకాష్, శ్రీకాంత్, రఘు, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు త్వరగా పూర్తి

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో వరంగల్ పశ్చిమ నియోజక వర్గ స్థాయిలో ఇందిరమ్మ ఇండ్లు, రెండు పడక గదుల ఇళ్లు, కాజీపేట ఆర్వోబీ నిర్మాణ పనుల పురోగతి, భద్రకాళి చెరువు పూడికతీత పనులపై జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి లతో కలిసి రెవెన్యూ, మున్సిపల్, గృహ నిర్మాణ, ఆర్అండ్‌బి, సాగునీటిపారుదల శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కాజీపేట ఆర్వోబీ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. పనులు ఆలస్యం కాకుండా వేగంగా చేపట్టాలన్నారు. అధికారులు, గుత్తేదారు సంస్థ సమన్వయంతో పనులు పూర్తిచేయాలన్నారు. హనుమకొండ ఆర్‌డిఒ రాథోడ్ రమేష్, హౌసింగ్ పిడి రవీందర్, ఆర్అండ్‌బి ఈఈ సురేష్ బాబు, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, సాగునీటి పారుదల శాఖ ఈఈ శంకర్, హనుమకొండ,కాజీపేట తహసీల్దారులు రవీందర్ రెడ్డి, భావు సింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణ స్థలం పరిశీలించిన ఎమ్మెల్యే గండ్ర



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా లో నూతనంగా ఏర్పాటైన గోరి కొత్తపల్లి మండలానికి నూతన పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి స్థలాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పరిశీలించారు. శుక్రవారం కొత్తపల్లి గోరి మండలం కేంద్రంలో నూతనముగా ఏర్పాటు అయిన పోలీస్ స్టేషన్ కు అవసరమైన తాత్కాలిక భవనమును భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, భూపాలపల్లి డి ఎస్ పి సంపత్ రావు, చిట్యాల సీఐ మల్లేష్ రేగొండ ఎస్ఐ సందీప్ లతో కలిసి పరిశీలించారు.అదేవిధంగా ఈ నెల చివరికల్లా నూతన పోలీస్ స్టేషన్ భవనము శంకుస్థాపన కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి లేదా వరంగల్ జిల్లా ఇంచార్జీ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వస్తారని ఎమ్మెల్యే జీఎస్సార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైద్యంలో ఫోరెన్సిక్, పాథాలజీ వైద్యులది కీలకపాత్ర

వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య



**ప్రజాపక్షం/ వరంగల్ టౌన్ :** కాకతీయ మెడికల్ కాలేజీలో ఫోరెన్సిక్ అండ్ టాక్సికాలజీ వైద్యుల రాష్ట్రస్థాయి రెండు రోజుల సదస్సుకు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. మెడికల్ విభాగంలో ఫోరెన్సిక్, పాథాలజీ వైద్యులు కీలక పాత్ర పోషిస్తారని ఎంపి డాక్టర్ కడియం కావ్య అన్నారు. నేర విచారణలో ఫోరెన్సిక్ ఆధారాలు ప్రధానమని తెలిపారు. వైద్యపరమైన ఆధారాలను విశ్లేషించడంతో పాటు న్యాయ ప్రక్రియలో ఫోరెన్సిక్ వైద్యులు సహాయం చేస్తారని పేర్కొన్నారు. అనుమానాస్పద మరణాలు, హత్యలు, ప్రమాదాలు, ఆత్మహత్యల వంటి సందర్భాల్లో ఫోరెన్సిక్ వైద్యులు పాత్ర గొప్పదని అన్నారు. ఫోరెన్సిక్ వైద్యుల సమస్యలను పార్లమెంట్ వేదికగా పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రతి ఏడాది ఫోరెన్సిక్ స్టేట్ కాన్ఫరెన్స్ నిర్వహించాలని తద్వారా ఏమైనా సమస్య లు ఉంటే త్వరగా పరిష్కరించుకోవచ్చని ఎంపి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జి ల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి. నిర్మల గీతాంబ, కెఎంసి ప్రిన్సిపల్ సంధ్య , ఫోరెన్సిక్ వైద్యుల రాష్ట్ర అధ్యక్షులు అభిజిత్ సుబేదా, ఉస్మానియా హెచ్ఓడి శ్రీధరాచారి, గాంధీ హెచ్ఓడి కృపా సింగ్, ఇతర ఫోరెన్సిక్ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## వన దేవతలను దర్శించుకున్న మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** వన దేవతలు సమ్మక్క సారలమ్మలను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్‌లతో శుక్రవారం దర్శించుకున్నారు. అనంతరం గోవిందరావుపేట మండలంలోని మొట్లగూడెంలో రాండ్‌స్టాడ్ గ్లోబల్ స్పోర్టి ఫౌండేషన్ సెంటర్, సయోధ్య హోమ్ ఫర్ ఉమెన్ ఇన్ నీడ్ వారి సహకారంతో సమ్మక్క సారలమ్మ అడవి ఆదివాసీ సహకార సమాఖ్య ఆధ్వర్యంలో ప్లేట్ తయారీ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ రమేష్, ఎఫ్ఆర్ఓ అబ్దుల్ రహమాన్, రాండ్‌స్టాడ్ గ్లోబల్ సంస్థ ప్రతినిధులు అక్మల్, స్వాప్న విట్టల్, సంయుక్త మిక్కిలినేని, షైల్ దాసికా, సిఎస్ఆర్ టీమ్ ప్రణత్ పూర్ణ, శైలజా, వంశీ కృష్ణ, వినయ్, వంగల, స్మిత కదారి, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## అధిక జనాభాతో అభివృద్ధికి ఆటంకం

వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి:** అధిక జనాభాతో అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా వరంగల్ కలెక్టరేట్‌లో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా అనర్థాలకు కారణం అవుతుందన్నారు. ఈ మేరకు జనాభా నియంత్రణ అవశ్యకతను ప్రజలకు వివరించాలన్నారు. జనాభా నియంత్రణ అదుపులో ఉండాలని, లేనిచో భావితరాలకు మౌలిక వసతులు, ఆరోగ్య రంగంపై ఒత్తిడి, విద్యా వనరులపై ప్రభావము, ఉద్యోగ అవకాశాల కొరత, లింగ అసమానతలు, సామాజిక వ్యత్యాసాలు వస్తాయని, వనరులు సరిపోక సమస్యలు ఉద్భవిస్తాయని అన్నారు. జనాభాను నియంత్రణలో ఉంచడానికి బాలికల విద్యను ప్రోత్సహించాలని, బాల్య వివాహాలను నిర్మూలించాలని, గర్భ నిరోధక పద్ధతులపై అవగాహన కల్పించాలని, ఆర్థిక స్వావలంబనను ప్రోత్సహించాలని, సామాజిక అభిప్రాయాలను మార్చడానికి విస్తృత ప్రచారం చేయాలని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖతోపాటు వివిధ శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలలో జనాభా పెరుగుదల వలన వచ్చే సమస్యలపైన అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా జనాభా నియంత్రణలో కృషిచేసిన వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందిని సన్మానించడం, కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించిన దంపతులకు వెయ్యి రూపాయల ప్రోత్సాహక బహుమతి కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం జనాభా పెరుగుదలను అరికట్టడానికి ప్రజల్లో అవగాహన కల్పనకు రూపొందించిన కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముందుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం ఈ సంవత్సరం థీమ్ శరీరము, మనసు సిద్ధంగా ఉన్నప్పుడే తల్లి కావడానికి సరి అయిన సమయం పురస్కరించుకొని ఎంజీఎం వరంగల్ నర్సింగ్ స్కూల్ వద్ద నుండి ఎంజిఎం సర్కిల్ వరకు నర్సింగ్ విద్యార్థులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ద్వారా ర్యాలీ నిర్వహించడం జరిగింది. డాక్టర్ బి సాంబశివరావు వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ ప్రపంచ జనాభా దినోత్సవం జరుపుకోవడం 1989 జులై 11న మొదలైనదని తెలిపారు. ప్రపంచంలో ఇండియాలోనే జనాభా మొదటి స్థానంలో చేరుకున్నది, దానిని నియంత్రించడానికి వైద్య ఆరోగ్యశాఖ ప్రజలలో తాత్కాలికమైన, శాశ్వతమైన కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పిస్తామన్నారు . ఈ కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిఆర్వో విజయలక్ష్మి , డిప్యూటీ డిఎంహెచ్వోలు డాక్టర్ ప్రకాష్, డాక్టర్ కొమురయ్య, ఆర్ఎంఓ డాక్టర్ శశి కుమార్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ అర్చన, డాక్టర్ ఆచార్య , డాక్టర్ విజయకుమార్,డాక్టర్ మోహన్ సింగ్, వైద్యాధికారులు ఆరోగ్యశాఖ సిబ్బంది, నర్సింగ్ కాలేజ్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల విద్యార్థులకు యూనిఫామ్..



**ప్రజాపక్షం/ఏటూరునాగారం:** ఏటూరునాగారం చిన్నబోయినపల్లి గ్రామంలోని చింతలమూరిలో సిఎస్ఆర్ మద్దతుతో రాండ్‌స్టాడ్ స్పోర్టి ఫౌండేషన్ సహకారంతో దత్తత తీసుకున్న 9 ఆదివాసీ గురుకుల పాఠశాలలను విద్యా సంవత్సరం 2025–26లో 260 మంది గిరిజన పిల్లలకు పాఠశాల యూనిఫాంలు, క్లాస్ రూమ్స్ ఫర్నిచర్, ల్యాప్‌టాప్ పాఠశాల సంచులు, ఎడ్యూకేషనల్, స్పోర్ట్స్ మెటీరియల్స్, ట్రంక్ బాక్స్‌లు, ప్రథమ చికిత్స వస్తు సామాగ్రిని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, గ్రంథాలయ సంస్థల చైర్మన్ రవిచందర్‌లతో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో ఎఫ్ఆర్ఒ అబ్దుల్ రహమాన్, రాండ్‌స్టాడ్ గ్లోబల్ సంస్థ ప్రతినిధులు అఖిల్, సయోధ్య, ఎన్‌జిఓ సంతోష్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## టేకులగూడెం వంతెన మూసివేత

జిల్లా ఎస్పి డాక్టర్ శబరీష్ ఐపిఎస్



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ములుగు జిల్లా లోని గోదావరి నది పరివాహక గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ములుగు జిల్లా ఎస్పి డాక్టర్ శబరీష్ ఐపిఎస్ హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ములుగు జిల్లా ఎగువ భాగం నుండి గోదావరి నదికి వరద ఉధృతి పెరిగినందున తెలంగాణ, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాలను అనుసంధానించే జాతీయ రహదారి 163పై పేరూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని శివారులో గల రేగుమాగు వాగు పొంగి టేంగి వంతెన మీదుగా వరద నీరు ప్రవహిస్తున్నందున, వరద ఉధృతి తగ్గే వరకు ఇట్టి వంతెనపై ప్రయాణాలను నిషేధిస్తున్నామని, వంతెన ముఖద్వారం వద్ద బారికేడ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సరిహద్దు గ్రామాల ప్రజలు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే పోలీస్ వారి సహాయం తీసుకోవాలని సూచించారు. ఇరు రాష్ట్రాల ప్రజలు ఒక వేళ ప్రయాణం చేయాల్సి వస్తే భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం మీదుగా ప్రయాణం చేయాలని సూచించారు.

## రాష్ట్ర ఆర్థిక స్థితిపై 13న సదస్సు

తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ



**ప్రజాపక్షం/హనుమకొండ :** వలసాంధ్ర పాలకుల వల్ల నిర్లక్ష్యానికి గురైన తెలంగాణలో విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగ, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు కుదేలై తెలంగాణ నిరుద్యోగులు, విద్యార్థులు, సబ్బండ కులాల నేడు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, తెలంగాణలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై అయోమయ స్థితిలో ఉందని, ఇలాంటి స్థితిలో తెలంగా ణ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి మౌలిక రంగాలను అభివృద్ధి చేసే దిశ దశను సూచించే సదస్సును ఈ నెల 13న హనుమకొండ జిల్లా కేంద్రం హరిత కాకతీయ హోటల్‌లో ఉ:10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఏర్పాటు చేసినట్లు, అట్టి సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అన్నారు. శుక్రవారం బాలసముద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పది సంవత్సరాల పాలనలో అన్ని రంగాల్లో తెలంగాణ నష్ట పోయిందని, ముఖ్యంగా మిగులు రాష్ట్రం అప్పుల రాష్ట్రంగా మారిందని, రాష్ట్రాన్ని అప్పుల ఊబి నుండి తప్పించడానికి, రాష్ట్ర అభివృద్ధి సక్రమ మార్గంలో నడవడానికి ప్రభుత్వం, విధాన కర్తలు ఒక ప్రణాళిక బద్ధంగా పని చేయడంపై సదస్సులో మేధావులు సందేశమిస్తారని అన్నారు. ఈ సదస్సులో ప్రొఫెసర్లు హరగోపాల్, డి ఎన్ రెడ్డి, ఇటికాల పురుషోత్తం, ఎ సదానందం, ఆర్ రమణమూర్తిలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా పుల్లూరు సుధాకర్ మాట్లాడుతూ 2014లో మిగులు బడ్జెట్ తో మొదలైన రాష్ట్ర ప్రభుత్వ ఖజానా 2023 నాటికి రూ.8లక్షల కోట్ల అప్పుతో విలవిలలాడి జీతాలు, పెన్షన్లు, సాంఘిక సంక్షేమ హాస్టల్ బిల్లులు, విద్యార్థుల ఫీజులు పాఠశాలల విద్యుత్ బిల్లులు, గ్రామపంచాయతీల అభివృద్ధి పథకాల బిల్లులు చెల్లింపులు చేయలేని దుస్థితి ఏర్పడిందన్నారు. 2014లో కేవలం 95 వేల కోట్ల రూపాయల మొత్తం కేటాయింపులతో మొదలైన రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ 2025–25 నాటికి 3 లక్షల నాలుగు వేల కోట్ల స్థాయికి చేరినప్పటికీ, ఇదే క్రమంలో రాష్ట్ర అప్పులు కూడా ఎనిమిది లక్షల కోట్ల కు మించి పోయాయని అన్నారు. ఈ సమావేశంలో ఫోరం ఫర్ బెటర్ వరంగల్ అధ్యక్షులు పుల్లూరు సుధాకర్, తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర కన్వీనర్ సోమ రామమూర్తి, రెడ్ క్రాస్ కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్, విశ్రాంత అధ్యాపకులు బాబురావు, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు పల్లపు సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ త్వరితగతిన పూర్తి

మిల్లర్లకు జిల్లా కలెక్టర్ ఆదేశం



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** మిల్లర్లు సిఎంఆర్ డెలివరీ త్వరగా పూర్తి చేయాలని జనగామ జిల్లా కలెక్టర్ ఆదేశించారు. 2024–25 రబీ, ఖరీఫ్ సిఎంఆర్ ఇప్పటికీ పూర్తి చేయకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రబీ, ఖరీఫ్ 202425 సిఎంఆర్ డెలివరీ పై అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి తహసీల్దార్లు, రైస్ మిల్లర్లలో సమీక్షా సమావేశం నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లక్ష్యాలకు అనుగుణంగా మిల్లర్లు సిఎంఆర్ నిర్ణీత సమయంలో డెలివరీ చేయాని, లేనిచో చర్యలు తప్పవన్నారు. ఖరీఫ్ 2024–25 సీజన్‌లో 91827.554 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని డెలివరి చేయాల్సి ఉండగా 73664.210 మెట్రిక్ టన్నులు మాత్రమే ఇవ్వడం జరిగిందని మరో 18163.344 మెట్రిక్ టన్నులు డెలివరీ చేయాల్సి ఉందన్నారు. 2024–25 రబీకి సంబందించి 144834.216 మెట్రిక్ టన్నులకు గాను 38135.916 మెట్రిక్ టన్నులు మాత్రమే ఇవ్వడం జరిగిందని, మరో 106698.300 మెట్రిక్ టన్నులు ఇవ్వాల్సి ఉందన్నారు. దేవరుప్పుల మండలం మన్పాహడ్ గ్రామానికి చెందిన శ్రీసాయి రామ్ మోడరన్ బిన్నీ రైస్ మిల్ రబీ 2022–23, 2023–24కు సంబందించి 5.67 కోట్ల విలువుగల సిఎంఆర్ ను క్లియర్ చేయనందున యజమాని పి చంద్రశేఖర్‌రెడ్డిపై క్రిమినస్ కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం ఆస్తులు జప్తుకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా రైస్ మిల్లర్ యజమానులు సివిల్ సప్లయ్ అధికారులు సమన్వయంగా పనిచేయాల్సిన అవసరం ఉందనానరు. అనంతరం తహశీల్దార్లలో కలెక్టర్ సమీక్ష నిర్వయించారు. కొత్త రేషన్ కార్డుల జారీ పాత రేషన్ కార్డులలో మార్పులు, చేర్పులకు సంబందించి ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చినదరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, నోటీస్ ఇచ్చిన ధరఖాస్తులకి వారం రోజుల్లో హియరింగ్ పెట్టి భూ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఎన్ఎఫ్‌బిఎస్ ధరఖాస్తులకు సంబందించి క్షేత్ర స్థాయి పరిశీలనను వేగవంతం చేయాలని ఎన్ఎఫ్‌బిఎస్ జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద 769 మంది అర్హులైన లబ్ధిదారుల జాబితాను ప్రభుత్వానికి పంపగా అందులో 576 మందికి 20వేల చొప్పున కోటీ 15లక్షల 20వేల రూపాయలు మంజూరు అయ్యాయని కలెక్టర తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డిఓలు గోపిరాం, వెంకన్న, సివిల్ సప్లయ్ అధికారులు, మిల్లర్లు, తహాశీల్దార్లు పాల్గొన్నారు.

## ప్రజాస్వామిక వేదిక ఆధ్వర్యంలో 13న రాష్ట్ర సదస్సు

అంబేద్కర్ విగ్రహం వద్ద పోస్టర్ ఆవిష్కరించిన నాయకులు



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక ఆధ్వర్యంలో ఈనెల 13న యుద్ధం ఎవరి కోసం అనే అంశంపై జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద భాగస్వామ్య పార్టీల నాయకులు పోస్టర్‌ను ఆవిష్కరించారు. వరంగల్ నగరంలోని ఎల్బీనగర్‌లో గల అబ్బూస్ ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం 12 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ (న్యూ డెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు మాట్లాడు తూ రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత దేశాల మధ్య జరిగే యుద్ధాలు ఆ దేశ ప్రజల సమస్యల పరిష్కారానికి మార్గంగా కనబడలేదని అన్నారు. సదస్సుకు కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ వి నాయక రెడ్డి అధ్యక్షత వహిస్తారని, వక్తలుగా టిఎస్డిఎఫ్ రాష్ట్ర కన్వీనర్ జస్టిస్ చంద్రకుమార్, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి శ్రీనివాసరావు, ఇనాం సంస్థ జాతీయ అధ్యక్షులు కృష్ణ ప్రసాద్, సిపిఐ ఎంఎల్ (న్యూ డెమోక్రసీ) రాష్ట్ర అధికార ప్రతినిధి జే చలపతిరావు, ఎం సిపిఐయు రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, సిపిఐ ఎంఎల్ రాష్ట్ర నాయకులు గుర్రం విజయ్ కుమార్, ఆర్ఎస్పి రాష్ట్ర కార్యదర్శి జానకి రా ములు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆరెల్లి కృష్ణ, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కా ర్యదర్శి రమేష్ రాజా, భారత్ బచావో రాష్ట్ర నాయకులు వెంగల్ రెడ్డి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్, టి ఎస్ డిఎఫ్ రాష్ట్ర నాయకులు నైనాల గోవర్ధన్ లు ప్రసంగిస్తారని వారు తెలిపా రు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎంసిపిఐయు జిల్లా కార్యదర్శి ఎన్ రెడ్డి హంసా రెడ్డి, ఆర్ఎస్పి ఉమ్మడి జిల్లా కార్యదర్శి శివాజీ, భారత్ బచావో నాయకులు రాజ్ మహమ్మద్, ఎం సదానందం ఏఐసిటియు జిల్లా కార్యదర్శి మొగిలి శ్రీనివాసరావు, ఎఐఎఫ్టిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున, గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి, పిడిఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్, డిఎస్ఎ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్, కో కన్వీనర్ ఉప్పులశివ, టిడిపి నాయకులు పిట్ట శ్రీనివాస్, పోలబోయిన రాజు తదితరులు పాల్గొన్నారు.

## చిన్న వయసులోనే తోట స్రవంతిని కోల్పోవడం దురదృష్టకరం


స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**ప్రజాపక్షం/ధర్మసాగర్ :** చిన్న వయసులోనే సర్పంచ్‌గా ఎన్నికై గ్రామ ప్రజల హృదయాలను గెలుచుకున్న తోట స్రవంతి మృతి బాధాకరమని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాల గ్రామ మాజీ సర్పంచ్ తోట స్రవంతి దశ దిన కర్మ కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సంతాప సభలో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. తోట స్రవంతి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్పంచ్ గానే కాకుండా వ్యక్తిగతంగా కూడా అనేక అభివృద్ధి, సేవ కార్యక్రమాలు చేసి అందరి మన్ననలు పొందిన సౌమ్యురాలైన తోట స్రవంతిని కోల్పోవడం అత్యంత దురదృష్టకరమని తెలిపారు. చిన్న వయసులోనే సర్పంచ్ గా ఎన్నికై గ్రామ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన స్రవంతి ఈ రోజు మన మ ధ్య లేకపోవడం బాధాకరమని అన్నారు. ఇలాంటి విషాద సంఘటన నాగరాజు కుటుంబానికి తీరని బాధను మిగిల్చిందని తెలిపారు. స్రవంతి లేని లోటు ఎవరూ పుడ్చలేనిదని ఆ భగవంతుడు ఆ కుటుంబానికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. స్రవంతి నాగరాజు ల పిల్లలకు ఒక తాత స్థానంలో ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## నేడు సిపిఐ మండల మహాసభ
పార్టీ మండల కార్యదర్శి బత్తుల రాధాకృష్ణ



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తిరుమలాయపాలెం మండల మహాసభను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి బత్తుల రాధాకృష్ణ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కొక్కిరేణి గ్రామంలో శనివారం ఉదయం 9గంటలకు మండల మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కొక్కిరేణి గ్రామంతా ఎర్ర తోరణాలతో స్వాగతం పలుకుతుందని తెలిపారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, రాష్ట్ర రైతు సంఘం నాయకుడు మహమ్మద్ మౌలానా, జిల్లా కార్యవర్గ సభ్యులు దండి సురేష్, జిల్లా కార్యవర్గ సమితి సభ్యులు దంతాల బాలరాజు తదితరులు పాల్గొంటారని తెలిపారు.



## వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి
ఎస్‌పి రోహిత్ రాజ్
గోదావరి కరకట్టను పరిశీలించిన ఎస్‌పి

**ప్రజాపక్షం/భద్రాచలం :** గోదావరికి వరద నీరు వచ్చి చేరుతున్నందున అధికారులు అంతా అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎస్‌పి రోహిత్‌రాజ్ అన్నారు. శుక్రవారం ఆయన భద్రాచలం గోదావరి కరకట్ట వద్ద ఎఎస్‌పి విక్రాంత్ సింగ్ కుమార్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వరదనీటి ఉధృతి, తీసుకుంటున్న జాగ్రత్తలు, బఫర్ స్టాక్, వరద సహాయక శిబిరం తదితర అంశాలను అక్కడే ఉన్న అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. వరద తాకిడి మరింత పెరిగితే తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటి నుండే దృష్టిసారిస్తే మంచిదన్నారు. వరదల వల్ల ఎలాంటి ఆస్థి, ప్రాణనష్టం వాటిల్లడానికి వీల్లేదని, డిడిఆర్‌ఎఫ్ బృందాలు, గజీతగాళ్లు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. నదీలోనికి దిగే సమయంలో లైఫ్ జాకెట్లు తప్పకుండా ధరించాలని సూచించారు. స్లూయిస్‌ల నుండి వరద నీరు పట్టణంలోని ప్రవేశించకుండా ఇరిగేషన్ శాఖ అధికారులు చేపడుతున్న చర్యలను ఎస్‌పికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఇరిగేష్ డిఇ జానీ, గ్రామపంచాయతీ ఇఓ శ్రీనివాసరావుతో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ప్రాణం తీసిన మందు పార్టీ
మూడో రోజు మృతదేహం లభ్యం

**ప్రజా పక్షం/మణుగూరు :** దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సరదాగా పార్టీ చేసుకుందామని స్నేహితులు స్థానిక రేగులగండి దగ్గర మందు పార్టీ ఏర్పాటు చేసుకొని ఎంజాయ్ చేద్దాం అనుకుంటే ఆ మందు పార్టీ ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది.. వివరాల్లోకి వెళితే. మణుగూరు సింగరేణిలోని 45 బ్యాచ్‌లో 15మంది ఇపి ఆపరేటర్లు ఒకచోట కలుసుకొని మందు పార్టీకి రేగులగండిని ఎంచుకొని అక్కడ పార్టీ చేసుకున్నారు. పార్టీ అనంతరం పికెఓసిడికి చెందిన ఐదుగురు ఆపరేటర్లు సరదాగా ఈతకు చెరువులోకి దిగారు. కొద్దిసేపటికి అందులో నలుగురు ఒడ్డుకు రాగా, మరొక ఆపరేటర్ సుంకరి శ్రీనివాస్ చూస్తుండగానే చెరువులో మునిగిపోయాడు. తోటి మిత్రులు రక్షించాలని ఎంత ప్రయత్నం చేసినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. దీంతో శ్రీనివాస్ చెరువులో గల్లంతయిన విషయాన్ని తోటి స్నేహితులు స్థానిక అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాప శాఖ అధికారులు, రెవిన్యూ టీం, రిస్క్ టీం సింగరేణి అధికారులు గల్లంతైన శ్రీనివాస్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం గురువారం ఎంత వెతికినా శ్రీనివాస్ మత్రృదేహం లభ్యం కాలేదు. దీంతో స్థానిక తహసీల్దార్ నరేష్ భద్రాచలంలో ఉన్న ఎండి ఆరే బృందానికి సమాచారం ఇవ్వగా రంగంలోకి దిగిన ఎండి ఆరే బృందం విశ్వ ప్రయత్నాలు చేసి చివరికి శుక్రవారం ఉదయం సమయంలో మృతదేహాన్ని బయటకి తీశారు. శ్రీనివాస్ మృతదేహం చూసిన కుటుంబ సభ్యులు తోటి స్నేహితులు కన్నీటి పర్యంతమయ్యారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 14న కలెక్టరేట్ వద్ద రైతు సంఘం ఆందోళన

**ప్రజాపక్షం/ఖమ్మం :** తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో రైతాంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 14న ఖమ్మం కలెక్టరేట్ వద్ద ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టినట్లు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావులు నేడొక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ప్రకటించినట్లుగా రెండు లక్షలు పైబడిన రుణాలను మాఫీ చేయాలని, పంటల బీమా పథకాన్ని తక్షణం అమలు చేయాలని, పాలేరు వద్ద యుటి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి సాగునీటిని వదలాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివిధ రకాల పద్ధతుల్లో మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులు నష్ట పోకుండా కంపెనీలపై తగు చర్యలు తీసుకోవాలని స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలుచేస్తూ రసాయనిక ఎరువుల కొరతను నివారించాలని, పోడు భూమిసాగు చేసుకుంటున్న రైతులకు భూ భారతి చట్టం ద్వారా హక్కులు కల్పించాలని, 55 ఏళ్లు నిండిన రైతులకు ఐదువేల పింఛన్ ఇవ్వాలని ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు తెలిపారు. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రమేష్, గోవిందరావు లు కోరారు.

## స్మార్ట్‌కిడ్జ్‌లో వన మహోత్సవం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పర్యావరణాన్ని పరిరక్షించాలని, కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించాలని సందేశమిస్తూ ఖమ్మం స్మార్ట్‌కిడ్జ్ చిన్నారులు వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో, మైదానంలో ప్రధాన రహదారులకు ఇరువైపులా విద్యార్థులు మొక్కలు నాటారు. సేకరించిన వివిధ రకాల మొక్కలను స్వయంగా విద్యార్థులు గుంతలు తీసి మొక్కలు నాటారు. అనంతరం స్కూల్ సమీపంలోని వీధుల్లో విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని వనమహోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రజలను చైతన్యపరిచారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య మాట్లాడుతూ మానవులతో పాటు అన్ని జీవులు ప్రాణవాయువుతోనే జీవనం కొనసాగిస్తాయన్నారు. ఆ ప్రాణవాయువు మనకు చెట్ల ద్వారానే వస్తుందని అందుకే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. పాఠశాల విద్యార్థులు పుట్టిన రోజు సందర్భంగా తప్పనిసరిగా ఒక మొక్క నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రియ ఉత్పత్తుల వాడకం ఆరోగ్యకరం

వ్యవసాయంలో ఎరువులు, రసాయనాలు తగ్గించాలి
ప్లాస్టిక్ వాడకం నిషేధించాలి
రోడ్ల నిర్మాణ పనులకు, సేంద్రియ మార్కెట్‌ను ప్రారంభించిన మంత్రి తుమ్మల





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సేంద్రియ ఉత్పత్తుల వాడకం ఆరోగ్యకరమని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం ఖమ్మం నగరంలో పర్యటించారు. మేయర్ పునుకొల్లు నీరజ, అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజతో కలిసి 55వ డివిజన్ బ్యాంక్ కాలనీ నందు రూ.39.25లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డు, డ్రైన్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం 54వ డివిజన్ వీడియోస్ కాలనీలో ఏర్పాటు చేసిన సేంద్రియ రైతుబజార్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ రసాయనాలు, పురుగు మందులు వాడకుండా సహజ వనరులను ఉపయోగించి సాగుచేసిన ఆహార ధాన్యాలు, పప్పు దినుసులు, పండ్లు, కూరగాయలు వినియోగదారులకు తక్కువ ధరకు ఒకే చోట అందుబాటులో ఉంచడం కోసం రాష్ట్రంలోనే మొదటిసారిగా ఖమ్మం జిల్లాలో సేంద్రియ మార్కెట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సేంద్రియ రైతు మార్కెట్‌నందు ప్లాస్టిక్ కవర్ల వాడకం నిషేధించామని ఇక్కడ జ్యూట్ కవర్లు, బట్ట సంచులు అమ్మడానికి మహిళా సమాఖ్య కోసం ఒక స్టాల్ కేటాయించామన్నారు. రసాయనాలు, పురుగు మందులు వాడకపోవడం వల్ల సాగు ఖర్చు తగ్గుతుందని వాతావరణం, భూగర్భ జలాల కాలుష్యం నుంచి కాపాడతామని, అందరికీ ఆరోగ్యకరమైన పోషకాలు కలిగిన ఆహారం అందుతుందన్నారు. పూర్వీకులు సేంద్రియ ఉత్పత్తులు తినడం వల్ల చాలా కాలం ఆరోగ్యంగా ఉన్నారన్నారు. ప్రస్తుతం సేంద్రియ ఆహార పదార్థాలకు డిమాండ్ గణనీయంగా పెరిగిందన్నారు. సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన ఉత్పత్తులను రైతులు నేరుగా మార్కెట్‌లో వినియోగదారులకు అమ్ముకోవడం ద్వారా అధిక లాభం వస్తుందన్నారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ఎకరానికి రూ.51వేలు సబ్సిడీ అందిస్తామన్నారు. అంతర పంట ద్వారా మొదటి మూడేళ్లు ఆదాయం లభిస్తుందని వాతావరణ మార్పులు, వరదల బాధ, కోతుల బాధ ఈ పంటకు ఉండదన్నారు. సేంద్రియ సాగు చేసే రైతులకు అవసరమైన సంపూర్ణ సహకారం ప్రభుత్వం అందిస్తుందన్నారు. మహిళా సంఘాలు ఉత్పత్తి చేసే ఆహార పదార్థాలు కూడా ఇక్కడ విక్రయం జరిగేలా చూడాలన్నారు. రైతులు భూసార పరీక్షలు నిర్వహించుకుని మట్టికి తగినవిధంగా సాగు చేయాలని అనవసరంగా మందులు, రసాయనాలు వాడవద్దన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మీ నారాయణ, జిల్లా ఉద్యానవన శాఖాధికారి ఎంవి.మధుసూదన్, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఎ అలీమ్, మున్సిపల్ ఇఇ కృష్ణలాల్, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సైదులు, అగ్రి హార్టికల్చర్ సొసైటీ సలహాదారులు నల్లమల వెంకటేశ్వరరావు, కార్పొరేటర్లు మోతారపు శ్రావణి, మిక్కిలినేని మంజుల, సేంద్రియ రైతులు రామిరెడ్డి, రామారావు, పలువురు అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## నానో యూరియాతో అధిక ప్రయోజనం

**ప్రజాపక్షం/చింతకాని :** నానో యూరియా వాడకం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయ శాఖ ఎడిఎ స్వర్ణ విజయచంద్ర రైతులకు సూచించారు. మండల పరిధిలోని నాగులవంచ, మత్కేపల్లి గ్రామల్లో వ్యవసాయ పంట పొలాలను పరిశీలించి నానో యూరియా వాడకం వల్ల కలుగు ప్రయోజనాలను రైతులకు వివరించారు.

నానో యూరియా వాడకం వల్ల మొక్కకు పోషకాలు ఎక్కువ మోతాదులో అందుతాయని, పర్యావరణ కాలుష్యం తక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. నానో యూరియాను ఎంపిక చేసిన కలుపు మందులతో కలిపి పిచికారి చేయవచ్చని రైతులకు వివరించారు. నాగులవంచ గ్రామంలో పచ్చిరొట్ట పంటలైన జీలుగు, జనుమును పరిశీలించి రైతులకు పలు పచ్చిరొట్టల వల్ల కలుగు ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిని ఎస్ మానస, ఎఇవోలు కల్యాణి, కార్తీక్, రైతులు తన్నీరు పుల్లారావు, తాళ్లూరి రమేష్, బందెల నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

## మేడికుంట ఆక్రమణలను అడ్డుకున్న ఇరిగేషన్ అధికారులు




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** 'మాయమవుతున్న మేడికుంట' అనే శీర్షికతో ప్రజాపక్షంలో ప్రచురితమైన కథనానికి విశేష స్పందన లభించింది. కథనంలో ఇరిగేషన్ అధికారుల్లో చెలనం వచ్చింది. లారీ ఆఫీస్ పక్క నుండి గొల్లగూడెం ప్రధాన రహదారిని అనుకుని ఉన్న సుమారు 400గజాలు గల భూమిలో కొందరు వ్యక్తులు మట్టిని నింపి చదువు చేస్తుండటంతో పూర్తి ఆధారాలతో వార్తా కథనం ప్రచురితమైంది. శుక్రవారం ఇరిగేషన్ అధికారులు ఆ స్థలం వద్దకు వెళ్లి చదును చేసే కార్యక్రమానికి ప్రస్తుతం చరమగీతం పాడి ఆ స్థలంలో ఉన్న మట్టికుప్పలను తొలగించారు. కాగా ఆ స్థల వివాదం కోర్టులో ఉందని, కోర్టు తీర్పుకు అనుగుణంగా అంతా వ్యవహరించాల్సి ఉందని మట్టి చదువును చేసినవారికి ఎఇ సూచించారు.

అయితే కోర్టు వివాదం కొనసాగుతున్నందున భూమి కొలతలు వేసేందుకు అనువుగా ఉంటుందని చదునుచేస్తున్నట్లు వారు చెప్పారని ఎఇ గురువేష్ ప్రజాపక్షంకు తెలిపారు. చెరువు శిఖం భూములను ఆక్రమిస్తే సహించేదిలేదని, అలాంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇదిలా ఉండగా కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలో మొత్తం ఎన్ని చెరువులు ఉన్నాయి. వాటి వాస్తవిక శిఖం ఎంత, ప్రస్తుతం ఏ మేరకు కబ్జాకు గురైంది అనే వివరాలు కావాలని కోరడంతో డివిజన్ కార్యాలయానికి విషయాన్ని తెలియపరిచి త్వరంలో అందజేస్తామని చెప్పారు.

## కలెక్టర్‌ను కలిసిన ఆసుపత్రి సూపరింటెండెంట్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఎం. సురేందర్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని మర్యాద పూర్వకంగా కలిశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం శుక్రవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని ఆసుపత్రి సూపరింటెండెంట్ సురేందర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించారు.

ఈ కార్యక్రమంలో డిఎంఅండ్‌హెచ్‌వో కళావతి బాయి, పలువురు వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 13న టియుడబ్ల్యుజె (ఐజెయు) నగర మహాసభ






**ప్రజాపక్షం/ఖమ్మం :** తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ టియుడబ్ల్యుజె (ఐజెయు) ఖమ్మం నగర మహాసభ ఈనెల 13న జిల్లాపరిషత్ మీటింగ్ హాల్‌లో జరుగుతుందని నగర అధ్యక్ష, కార్యదర్శులు మైసా పాపారావు, చెరుకుపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ మహాసభలో టియుడబ్ల్యుజె (ఐజెయు) రాష్ట్ర కార్యదర్శి కె.రాంనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్, రాష్ట్ర సమితి సభ్యులు సామినేని కృష్ణ మురారి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావు, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర నాయకులు నర్వనేని వెంకట్రావు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి కనకం సైదులు తదితరులు పాల్గొంటారని వారు తెలిపారు. ఖమ్మం నియోజక వర్గ పరిధిలోని జర్నలిస్టులు సకాలంలో హాజరు కావాలని వారు కోరారు.

## వెంకటరెడ్డి మృతి సిపిఐకి తీరని లోటు
సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వేపూరి రవీంద్రబాబు



**ప్రజాపక్షం/చింతకాని :** సిపిఐ సీనియర్ నాయకుడు ఆవులూరి వెంకటరెడ్డి మృతి పార్టీకి తీరని లోటని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వేపూరి రవీంద్ర బాబు పేర్కొన్నారు. కోమట్లగూడెం గ్రామానికి చెందిన సిపిఐ నాయకుడు ఆవులూరి వెంకటరెడ్డి(76) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వేపూరి రవీంద్ర బాబు కోమట్లగూడెం చేరుకొని వెంకటరెడ్డి మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవీంద్రబాబు మాట్లాడుతూ వెంకటరెడ్డి కోమట్లగూడెం గ్రామంలో పార్టీ ఎదుగుదలకు ఎంతో కృషి చేశాడని బ్రతికినంత కాలం నిబద్ధత గల కమ్యునిస్టుగా బ్రతికాడన్నారు. వెంకటరెడ్డి కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. నివాళులర్పించిన వారిలో పార్టీ జిల్లా సమితి సభ్యుడు పావులూరి మల్లిఖార్జునరావు, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, నాయకులు వేముల జానకిరాములు, షేక్ జానిమియా, చాట్ల రమేష్, మాజీ సర్పంచ్ వేమిరెడ్డి తిరపతమ్మ తదితరులు ఉన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన ప్రాంతీయ ఇంటెలిజెన్స్ అధికారి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని ప్రాంతీయ ఇంటెలిజెన్స్ అధికారి (ఉమ్మడి ఖమ్మం జిల్లా) రామోజీ రమేష్ మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని ప్రాంతీయ ఇంటెలిజెన్స్ అధికారి రామోజీ రమేష్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో ఇంటెలిజెన్స్ డిఎస్‌పి వెంకన్నబాబు, భద్రాద్రి కొత్తగూడెం ఇంటెలిజెన్స్ డిఎస్‌పి చలువాది శ్రీనివాసరావు, వైవి ప్రసాద్, జోనల్ ఇన్‌స్పెక్టర్స్, ఖమ్మం హరి సింగ్, జెడ్ ఎస్ఐ భద్రాద్రి కొత్తగూడెం శ్రీనివాస రావు, ఎఎస్ఐ విజయ్, హెచ్‌సిలు పాల్గొన్నారు.

# విద్యా ప్రమాణాలు పెంచడమే లక్ష్యం

జులై 15 నాటికి దుస్తులు, పుస్తకాల పంపిణీ పూర్తిచేయాలి
విద్యాశాఖపై సమీక్షించిన జిల్లా కలెక్టర్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రతి విద్యార్థి విద్యాప్రమాణాలు పెంచడమే అంతిమ లక్ష్యంగా విద్యాశాఖ పనిచేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి విద్యాశాఖపై సంబంధిత అధికారులతో శుక్రవారం సమీక్షించారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాల పంపిణీ, ఎఫ్ఆర్ఎస్ అమలు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అభివృద్ధి పనులు, ఎఫ్ఎల్ఎన్ పురోగతి తదితర అంశాలపై కలెక్టర్ చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యాశాఖపై ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఖర్చుచేస్తుందని మౌలిక సదుపాయాల కల్పన, హెచ్ఆర్‌పై పెట్టే ఖర్చుకు తగిన ఫలితం సాధించేలా పనిచేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన పిల్లలకు మంచి విద్యా ప్రమాణాలు అందాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు పంపిణీ చేసిన ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జులై 15 నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల దుస్తులు, పాఠ్యపుస్తకాల పంపిణీ పూర్తిచేసి వివరాలు అప్‌డేట్ చేయాలన్నారు. పాఠశాలల తనిఖీ సమయంలో విద్యార్థులు యూనిఫాం వేసుకోని పక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు. కొత్తగా చేరిన పిల్లలకు అవసరమైన వర్క్ బుక్స్, టెక్స్ట్‌బుక్స్, నోటు బుక్స్ పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో చేపట్టిన ఎన్‌రోల్‌మెంట్, మౌలిక వసతుల కల్పన వివరాలు, యుడిఐఎస్ఇలో మండల విద్యాశాఖాధికారులు అప్‌డేట్ చేయాలన్నారు. మండలాలవారీగా విద్యార్థులకు అవసరమైన బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు అప్‌డేట్ యుద్ధప్రాతిపదికన చేసేందుకు సిఎస్ఇ ద్వారా క్యాంపు పెట్టాలన్నారు. జులై 18 నుంచి మండల స్థాయిలో ఆధార్ అప్‌డేట్ చేసేందుకు ప్రత్యేక క్యాంపులు ఏర్పాటుచేయాలన్నారు. ఈ క్యాంపుల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించి ప్రతి విద్యార్థి ఆధార్ కార్డు తప్పనిసరిగా అప్‌డేట్ అయ్యేలా చూడాలన్నారు. విద్యార్థులకు ఆధార్ అప్‌డేట్ చేసిన తర్వాత వంద శాతం అపార్ జనరేట్ చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో 71 శాతం ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ రికగ్నిషన్ సిస్టం) ద్వారా ఉపాధ్యాయుల, విద్యార్థుల నమోదు జరుగుతుందన్నారు. జీరో ఎఫ్ఆర్ఎస్, అటెండెన్స్ ఉన్న పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధవహించాలన్నారు. 95 శాతం ఎఫ్ఆర్ఎస్, విద్యార్థుల హాజరు శాతం ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన మౌలిక వసతుల కల్పన పెండింగ్ పనులపై రిపోర్టు అందించాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాధికారి ఎస్.సత్యనారాయణ, సిఎంవో రాజశేఖర్, ఇఇ ఆర్ అండ్ బి పవార్, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు, మండల విద్యాశాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

### పారదర్శకంగా లబ్ధిదారులకు ఇండ్ల కేటాయింపు

పారదర్శకంగా లబ్ధిదారులకు కంప్యూటర్ ద్వారా ర్యాండమైజేషన్ పద్ధతిలో డబుల్‌బెడ్‌రూం ఇండ్లను కేటాయించినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం యాతాలకుంట, రేజర్ల, పినపాకలో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇండ్ల కేటాయింపు కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంత్రి ఆదేశాల మేరకు డబుల్ బెడ్‌రూం ఇండ్ల లబ్ధిదారులకు అలాట్‌మెంట్ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందన్నారు. పైరవీలకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా ఇండ్ల కేటాయింపు జరిగిందన్నారు. 67 డబుల్‌బెడ్‌రూం ఇండ్లను లబ్ధిదారులకు కంప్యూటర్ ర్యాండమైజేషన్ పద్ధతిలో పారదర్శకంగా కేటాయించామన్నారు. ఇండ్లు లేని నిరుపేదలకు డబుల్‌బెడ్‌రూం ఇండ్ల కేటాయింపు పట్టాలను త్వరలోనే సత్తుపల్లి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మంత్రి చేతుల మీదుగా అందిస్తామన్నారు.

సత్తుపల్లి నియోజకవర్గంలోని యాతాలకుంటలో 40, రేజర్లలో 20, పినపాకలో ఏడు, మొత్తం 67 ఇండ్లను గ్రామసభ ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారులకు ర్యాండమైజేషన్ పద్ధతిలో ఇండ్లను కేటాయించామన్నారు. ఈ జాబితాను గ్రామంలో ప్రదర్శిస్తామని జిల్లా వెబ్‌సైట్‌లో కూడా పెట్టడం జరుగుతుందన్నారు. ఎన్నోఏళ్లుగా కలగా ఉన్న సొంతింటిని జిల్లా కలెక్టర్‌గా వచ్చిన నెల రోజుల్లోనే సాకారం చేశారని సంతోషంగా ఉందని కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఆర్డీవో ఎల్.రాజేందర్ గౌడ్, డబుల్‌బెడ్‌రూం ఇండ్ల లబ్ధిదారులు, అధికారులు పాల్గొన్నారు.

# లీల

## కిరణ్ అబ్బవరం తాజా చిత్రం ‘తిమ్మరాజుపల్లి టీవీ’



హీరో కిరణ్ అబ్బవరం సమ్మెర స్టూడియోస్‌తో కలిసి తన సొంత నిర్మాణ సంస్థ కేఏ ప్రొడక్షన్స్ పై నిర్మిస్తున్న సినిమాకు ‘తిమ్మరాజుపల్లి టీవీ’. అనే పేరును ఖరారు చేశారు. తేజేశ్వర్ రెడ్డి వేల్పుచర్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంతో సాయి తేజ్, వేద శ్రీ హీరో హీరోయిన్స్‌గా పరిచయమవుతున్నారు. సాయి తేజ్ కిరణ్ అబ్బవరం గత సినిమాల్లో కెమెరా అసిస్టెంట్‌గా పనిచేశాడు. ‘తిమ్మరాజుపల్లి టీవీ’ చిత్రంతో వి.మునిరాజు దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. వి.మునిరాజు కిరణ్ అబ్బవరం మూవీస్ కు ఆన్ లైన్ ఎడిటింగ్ చేసేవారు. ‘తిమ్మరాజుపల్లి టీవీ’ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ ఆసక్తి కలిగిస్తున్నాయి. విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో సాగే పీరియాడిక్ డ్రామాగా ఈ సినిమా రూపొందుతోంది.

## ‘కొత్తపల్లిలో ఒకప్పుడు’ ట్రైలర్ రిలీజ్

రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా సమర్పణలో తెరకెక్కిన ‘కొత్తపల్లిలో ఒకప్పుడు’. సినిమా ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమం రామానాయుడు స్టూడియోలో జరిగింది. నటి,చిత్రనిర్మాత ప్రవీణ పరుచూరి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. పరుచూరి విజయ ప్రవీణ ఆర్ట్స్ ఈ సినిమాను నిర్మిస్తోంది. రికార్డ్ డ్యాన్స్ స్టూడియో ఓనర్ అయిన రామకృష్ణ సావిత్రిని ప్రేమిస్తాడు. ఒక రోజు, సావిత్రి అతన్ని గడ్డివాము వద్ద కలవమని అడుగుతుంది. రామకృష్ణ చాలా ఉత్సాహంగా వెళ్తాడు. కానీ ప్రేమికుడి ఇక్కడే షాకింగ్ మలుపు తిరుగుతుంది. అతని జీవితాన్ని గందరగోళంలోకి నెట్టివేస్తుంది. ఆ క్షణం నుండి ఊహించని మలుపులతో ఒక విస్మిలింగ్ ఎలిమెంట్ తెరకెక్కి రావడం చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. గురుకిరణ్ ఐతలూ రాసిన ఈ కథ ఊహించని ట్రైలింగ్ అంశాలతో చిత్రానికి ప్రత్యేకమైన ఫ్లేవర్‌ని తీసుకొచ్చింది. ప్రవీణ పరుచూరి దర్శకత్వం వహించడంతో పాటు ఓ కీలకమైన పాత్రను కూడా పోషించారు.






## బాహుబలి టీమ్ పదేళ్ల సంబరం

ప్రభాస్ హీరోగా, ఎస్ ఎస్ రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన బాహుబలి సినిమా ఎంతటి ఘన విజయాన్ని సాధించిందో అందరికి తెలిసిందే. తెలుగు సినిమా చరిత్రను మార్చింది. తెలుగు సినిమాను పాన్ ఇండియా స్థాయికి తీసుకువెళ్లిన చిత్రం బాహుబలి. రెండు భాగాలుగా తెరకెక్కిన ఈ సినిమాతో పాన్ ఇండియా స్టార్‌గా ప్రభాస్ వెనక్కి తిరిగి చూడాల్సిన అవసరం లేకుండా పోయింది. ఈ సినిమాలో ప్రతి క్యారెక్టర్, ప్రతి సన్నివేశం అద్భుతంగా తీర్చిదిద్దిన ఘనత దర్శకుడు రాజమౌళికి దక్కుతుందని చెప్పడం అతిశయోక్తి కాదు. ఈ సినిమా విడుదలై పదేళ్లు అవుతున్న సందర్భంగా టీమ్ సభ్యులంతా కలిసి సెలబ్రేషన్ చేసుకున్నారు. ఇండియన్ సినిమాపై ఓ మైలురాయిగా నిలిచిన బాహుబలి చిత్రాన్ని తిరిగి అక్టోబర్ 31న మళ్ళీ విడుదల చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## ‘కేడీ ది డెవిల్’ టీజర్ ఆవిష్కరణ



కన్నడ యాక్షన్ ప్రిన్స్ ధ్రువ సర్జా హీరోగా కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద నిర్మాత వెంకట్ కె. నారాయణ అత్యంత భారీ ఎత్తున నిర్మించిన చిత్రం ‘కేడీ ది డెవిల్’. ఈ సినిమాను ప్రేమ్ తెరకెక్కించారు. ఈ మూవీలో ధ్రువ సర్జాకు జోడీగా రీష్మా నటించారు. ఇక ఈ ప్రాజెక్ట్‌లో సంజయ్ దత్, శిల్పా శెట్టి, నోరా ఫతేహి వంటి భారీ తారాగణం ముఖ్య పాత్రల్ని పోషించారు. ఈ చిత్రానికి సంబంధించిన టీజర్‌ను హైదరాబాద్ ఆర్ కె సినీ ప్లెక్స్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ మాట్లాడుతూ.. ‘హైదరాబాద్‌తో నాకు ఎంతో అనుబంధం ఉంది. ఇక్కడ ఎంతో మందితో కలిసి పని చేశాను. మరీ ముఖ్యంగా నాకు హైదరాబాద్ ఫుడ్ అంటే చాలా ఇష్టం. నేను ప్రభాస్ రాజా సాబ్ సినిమాకు పని చేస్తున్నాను. అక్కడే తెలుగు నేర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాను. నాకు తెలుగులో చిరంజీవి గారంటే చాలా ఇష్టం. కేవీఎన్ ప్రొడక్షన్స్ వెంకట్ సర్, సుప్రీత్‌లకు సినిమా పట్ల ఎంతో ప్యాషన్ ఉంది. అందుకే ఇలాంటి మూవీని ఇంత గొప్పగా నిర్మించగలిగారు. డైరెక్టర్ ప్రేమ్ చాలా మంచి వ్యక్తి. ఆయన ఎంతో ఒదిగి ఉంటారు. రీష్మా చాలా చక్కగా నటించారు. ధృవ్ నా తమ్ముడు లాంటివారు. ధృవ చాలా ఎత్తుకు ఎదగాలని కోరుకుంటున్నాను. శిల్పా శెట్టితో ఎప్పుడు పని చేసినా అదే ఎనర్జీ ఉంటుంది. మా సినిమాను అందరూ చూసి సక్సెస్ చేయండి’ అని అన్నారు.

## ఆగస్ట్ 29న ‘మైనే ప్యార్ కియా’




మలయాళ చిత్రం మైనే ప్యార్ కియా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఇది రొమాన్స్, కామెడీ, సస్పెన్స్ లతో కూడిన థ్రిల్లర్‌వి సినిమాగా నూతన దర్శకుడు, రచయిత ఫైజల్ దర్శకత్వంతెరకెక్కించారు. ఈ చిత్రాన్ని స్పైర్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సంజు ఉన్నితన్ నిర్మించారు. హృదు హరూన్, ప్రీతి ముకుందన్ హీరో హీరోయిన్ గా నటించారు. డిఫరెంట్ లవ్ స్టోరీగా ఈ సినిమాను రూపొందించారు. ఈచిత్రానికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసి ఆగస్ట్ 29న థియేటర్లలో విడుదల చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నారు. హీరోయిన్ ప్రీతి ముకుందన్, తమిళ చిత్రం స్టార్, అస్సై కూడైలో దృష్టిని ఆకర్షించిన తర్వాత మలయాళంలో అరంగేట్రం చేస్తోంది.

## ‘వీసా వింటారా సరదాగా’ ఫస్ట్ లుక్



సితార ఎంటర్‌టైన్‌మెంట్స్. బ్యానర్‌పై నిర్మించిన మరో విభిన్న చిత్రం ‘వీసా వింటారా సరదాగా’. ఈ సినిమా ఫస్ట్ లుక్ విడుదలైంది. వినోదం, ప్రేమ, భావోద్వేగాలతో నిండిన ఓ సరికొత్త యూత్‌ఫుల్ సినిమాగా తెరకెక్కిస్తున్నారు. అమెరికా నేపథ్యంలో సాగే ఈ చిత్రం.. విదేశాలలో చదువుతున్న భారతీయ విద్యార్థుల జీవితాలను, వారి కలలను, సందిగ్ధతలను, స్నేహాలను, మధుర క్షణాలను ప్రేక్షకుల మనసుకి తాకేలా చూపించనుంది. యువత మెచ్చేలా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి నూతన దర్శకుడు ఉద్భవ్ దర్శకత్వం వహిస్తున్నారు.

## థమన్ స్టూడియోలో ప్రభాస్



ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న రాజాసాబ్ సినిమా షూటింగ్ ప్రస్తుతం చివరి దశలో ఉంది. ఒకపక్క షూటింగ్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. థమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా కోసం ప్రభాస్ థమన్ స్టూడియోకు వచ్చారు. రీ రికార్డింగ్ జరుగుతున్న సమయంలో ప్రభాస్ థమన్ స్టూడియోకు వచ్చి కాసేపు గడిపారు. ఇటీవలే విడుదల చేసిన రాజాసాబ్ టీజర్ కు మంచి స్పందన వచ్చింది. హర్రర్ , యాక్షన్ డ్రామా గా తెరకెక్కిస్తున్న ఈ సినిమాకు రీ రికార్డింగ్ కు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. దీనికోసం థమన్ ఎంతో కష్టపడి పని చేస్తున్నారు. చాలా రోజుల తరువాత ప్రభాస్ నటిస్తున్న అచ్చమైన తెలుగు సినిమా కావడంతో ఈ సినిమాను ఎలాగైనా సూపర్ డూపర్ హిట్ చెయ్యాలనే తపనతో సినిమా యూనిట్ పని చేస్తోంది.

## ఫిష్ వెంకట్‌కు జెట్టి సినిమా హీరో ఆర్థిక సహాయం



జెట్టి సినిమా హీరో కృష్ణ మానినేని ఆధ్వర్యంలో నడుస్తున్న స్వచ్ఛంద సంస్థ థౌసండ్ డ్రెయిన్స్ ఫౌండేషన్ తరపున సినీ నటుడు ఫిష్ వెంకట్ వైద్య అవసరాల కోసం జెట్టి సినిమా హీరో కృష్ణ ఆర్థిక సహాయం చేశారు. వైద్య ఖర్చుల కోసం ఫిష్ వెంకట్ కుమార్తె స్రవంతికి రెండు లక్షల రూపాయలను కృష్ణ అందించారు. చిత్రపరిశ్రమలో తనదైన హాస్యంతో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న ఫిష్ వెంకట్ అనారోగ్యంతో బాధపడుతుండగా, ఆయన వైద్య ఖర్చులకు మానవతా దృక్పథంతో సహాయం చేశానని హీరో కృష్ణ మాని నేని చెప్పారు.

## ‘ఏ ఊరికెళ్తావే పిల్లా’ పాట ఆవిష్కరణ

మల్టీ ట్యాలెంటెడ్ అర్జున్ సర్జా దర్శకత్వం వహిస్తున్న లేటెస్ట్ ప్రాజెక్ట్ ‘సీతా పయనం’. శ్రీ రామ్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఐశ్వర్య అర్జున్, నిరంజన్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. అర్జున్, ధ్రువ సర్జా పవర్ ఫుల్ పవర్ ఫుల్ పాత్రల్లో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ప్రజా యుద్ధ నౌక గద్దర్ భార్య విమలా గద్దర్ చేతుల మీదుగా ఈ సినిమా నుంచి ‘ఏ ఊరికెళ్తావే పిల్లా’ పాటను ఆవిష్కరించారు. కనకవ్వ, గంగవ్వ, జోగిని శ్యామల, బేబీ లాంటి జానపద కళాకారుల సమక్షంలో ‘సీత పయనం’ టీం అందరిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో గద్దర్ కుమార్తె వెన్నల’ కూడా పాల్గొన్నారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందించిన ఈ పాటను. రాహుల్ సిప్లిగంజ్, మధు ప్రియ ఆలపించారు. ఆస్కార్ అవార్డు, తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డు గ్రహీత చంద్రబోస్ సాహిత్యం అందించారు. ఈ చిత్రంలో సత్యరాజ్, ప్రకాష్ రాజ్, కోవై సరళ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి డిఓపి జి.బాలమురుగన్, ఎడిటర్ అయూబ్ ఖాన్, డైలాగ్స్ సాయి మాధవ్ బుర్రా రాశారు.



# సామాజిక న్యాయానికి కట్టుబడ్డాం

(మొదటి పేజీ తరువాయి)

ఇన్‌ఛార్జి మంత్రి అడ్లూరు లక్ష్మణ్‌కుమార్ లతో కలిసి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గత 100 సంవత్సరాలలో భారతదేశంలోని ఏ రాష్ట్రము చేయని బిసి కుల గణన 1.04 లక్షల ఎన్యూమరేటర్ల ద్వారా సేకరించి విజయవంతం చేశామని, ఇచ్చిన మాటప్రకారం కులగణన చేసి బిసిలకు స్థానిక సంస్థ ఎన్నికల్లో 42శాతం అమలు కోసం చట్టం తెచ్చామని, జూలై 10న నిర్వహించిన క్యాబినెట్ సమావేశంలో బిసిలకు 42 శాతం స్థానిక సంస్థల ఎన్నికల్లో నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. అలాగే ప్రజల కోసం ఎస్సీ వర్గీకరణ చేశామని, బిసి కులగణన, ఎస్సీ వర్గీకరణ అనే రెండు క్యాబినెట్ సబ్ కమిటి చైర్మన్‌గా నేనే వ్యవహరించానని తెలిపారు. జూలై 14న కొత్త కార్డులను ఇవ్వబోతున్నామని, అదనంగా కుటుంబ సభ్యులని రేషన్‌కార్డులో చేర్చుతున్నామని రూ.13 వేల కోట్ల రూపాయల ద్వారా రూ. 3.10 కోట్ల మందికి ఆరుకేజీల సన్న బియ్యం ఉచితంగా ఇచ్చి 95 లక్షల కుటుంబాలకు చెందిన పేదవారికి కడుపునిండా అన్నం పెట్టి ఆకలి తీర్చడం, అర్హులందరికి రేషన్‌కార్డులు ఇవ్వడం సంతోషమని, సంతృప్తిని ఇచ్చాయని, ఇలాంటి పేదవారికి ఆహార భద్రత కల్పించే సంక్షేమ పథకాలు స్వతంత్ర భారతదేశంలోనే లేవని తెలిపారు. ఖరీఫ్, రబీ సిజన్‌లలో 281 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పండించి భారతదేశంలోనే తెలంగాణ అగ్రగామిగా నిల్చిందని, యాసంగి సీజన్‌లో చివరి గింజ వరకు 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. ధాన్యం సేకరణ సన్నబియ్యం పంపిణి, రేషన్‌కార్డుల జారీ లాంటివి ప్రజలకి ఇచ్చి గ్రామీణ రైతులు బాగుండాలని తెలంగాణ సశ్యశ్యామలం అయ్యేలా ఈ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు.

**పేదవారికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయం: మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్**

పేదవారికి సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్వేయమని, గత పాలకులు పేదల సంక్షేమం కోసం ఏ పథకం చేయలేదని, పేద వారికి నూతన రేషన్‌కార్డులు ఇవ్వలేదని ఉమ్మడి నల్లగొండ జిల్లా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. కాని ప్రజా ప్రభుత్వం వచ్చినప్పటి నుండి పేదల సంక్షేమం కోసం కృషి చేస్తుందని, ఈనెల 14న మధ్యాహ్నం మూడు గంటలకి జరిగే నూతన రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమానికి అందరు సమన్వయం చేసుకుంటూ ఎవరు ఊహించని విధంగా విజయవంతం చేయాలని సూచించారు.

ఎమ్మెల్యే మందుల సామేలు మాట్లాడుతూ.. బిసిలకు 42శాతం స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదములు తెలుపుతూ 14న రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమానికి 9 మండలాలు, రెండు మున్సిపాలిటిలు, 154 గ్రామ పంచాయతీల నుండి 70వేల మందిని తరలించి సభను విజయవంతం చేయాలని తెలిపారు. ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ మాట్లాడుతూ భారతదేశంలో ఎక్కడ లేని విధంగా సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలు జరుగుతుందని తెలిపారు. కృష్ణా, గోదావరి జలాలపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పిపిటి ద్వారా వివరించి గత పాలకుల వల్ల తెలంగాణ ప్రజలకు అర్థం అయ్యేలా వివరించారని అన్నారు. ఎంపి కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని అందరం కలిసి విజయవంతం చేయాలని తెలిపారు.

ఈ సమావేశంలో రాష్ట్రవ్యవసాయ కమిషన్ మెంబర్ చెవిటి వెంకన్నయాదవ్, జిల్లా ఎస్‌పి కె.నర్సింహా, అదనపు కలెక్టర్ పి.రాంబాబు, డిఆర్‌డివో వివి అప్పారావు, డిపివో సతీష్‌కుమార్, డిఎస్‌వో మోహన్‌బాబు, ఆర్డీవో వేణుమాదవరావు, తహసిల్దార్ హరిప్రసాద్, అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పర్యావరణహిత నిర్మాణాలే పరిష్కారం

**2024–25లో నిర్మాణ రంగం వృద్ధి రేటు 11.97 శాతం**

**యువ సివిల్ ఇంజినీర్లు వినూత్నంగా ఆలోచించాలి : మంత్రి శ్రీధర్ బాబు**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న వాతావరణ మార్పులు, పట్టణీకరణ, కాలుష్యం, కర్బన ఉద్గారాల పెరుగుదల తదితర ఎన్నో సమస్యలకు పర్యావరణహిత నిర్మాణాలు పరిష్కారం చూపుతాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తుందని, ఈ ప్రయాణంలో భాగస్వామ్యం కావాలని సివిల్ ఇంజనీర్లను కోరారు. మూడున్నరేళ్లలో 5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను అర్హులకు పంపిణీ చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్(హైదరాబాద్) సెంటర్ ఆధ్వర్యంలో రాయదుర్గంలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ‘నెక్స్ట్ జెన్ హైరైస్ బిల్డింగ్స్ (అడ్వాన్స్మెంట్స్ ఇన్ కాంపోజిట్ & స్టీల్ స్ట్రక్చర్స్)‘ అనే అంశంపై నిర్వహించిన రెండ్రోజుల జాతీయ సదస్సును ఆయన శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో నిర్మాణ రంగం 11.97 శాతం వృద్ధి రేటును నమోదు చేసి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు రూ.80,000కోట్లకు పైగా ఆదాయాన్ని సమకూర్చింది. రాష్ట్ర సేవల స్థూల విలువ జోడింపులో ఇది 24.9 శాతం. ఈ గణాంకాలు తెలంగాణ నిర్మాణ రంగ ప్రగతికి నిదర్శనం అని మంత్రి వివరించారు. ‘ఇటీవల కాలంలో దేశంలోని అన్ని మెట్రో నగరాల్లో హైరైస్ భవన నిర్మాణాల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. ఈ తరహ భారీ భవనాల నిర్మాణంలో రీన్‌ఫోర్స్ సిమెంట్ కాంక్రీట్(ఆర్ సీసీ) నిర్మాణాలకు బదులుగా కాంపోజిట్ & స్టీల్ స్ట్రక్చర్స్‌కు ప్రాముఖ్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది’ అని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో ఆవిష్కరణలు కేవలం మాటలకే పరిమితం కావడం లేదు. ఆచరణలోనూ చూపిస్తున్నాము. స్మార్ట్ నగరాలు, స్థిరమైన గృహనిర్మాణం, సుస్థిర మౌలిక సదుపాయాల కల్పన ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేరుస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ ప్రతినిధులు ఎస్ జీఎస్‌మూర్తి, మహేందర్‌రెడ్డి, శేషాద్రి, తదితరులు పాల్గొన్నారు.

# 37 అడుగులకు గోదావరి

(మొదటి పేజీ తరువాయి)

నీటి మట్టం 37 అడుగులకు చేరుకుంది. ఇది శుక్రవారం రాత్రి వరకు నెమ్మదిగా పెరిగి క్రమేపీ తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది. గోదావరి వరదల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. వరద 43 అడుగుల మొదటి ప్రమాదహెచ్చరిక దాటి ప్రవహిస్తే దుమ్ముగూడెం మండలంలో సుమారు 24 గ్రామాలు ప్రభావానికి గురవుతాయి. మరింత వరద తాకిడి పెరిగితే తూరుబాకవద్ద గోదావరి రోడ్డుపైకి వచ్చి చేరుతుంది. తద్వారా రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. భద్రాచలంపట్టణంలోని సుభాష్ నగర్, కొత్త కాలనీలోనికి వరదనీరు వచ్చి చేరకుండా స్లూయిస్‌లు పకడ్బంధీగా ఏర్పాటు చేశారు. రామాలయం సమీపంలోని స్లూయిస్‌ల వద్ద మోటార్లు సిద్ధం చేస్తున్నారు. ఇదిలా ఉండగా వర్షాలు అధికంగా పడినా స్లూయిస్‌లో వద్ద వర్షపు నీరు చేరి అన్నదాన సత్రం, రామాలయం పరిసరాలు నీటి మునిగే అవకాశం ఉండటంతో అలాంటి విపత్కర పరిస్థితులను తట్టుకునేందుకు సిద్ధం చేయడంతో పాటు పెద్ద ఎత్తున ఇసుక బస్తాలను అందుబాటులో ఉంచారు. మరో ప్రక్క కూనవరం రోడ్లో గోదావరి వరదల వల్ల ఇబ్బంది కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. కాగా గోదావరి వరదల వల్ల ఈ సారి భద్రాచలానికి కొద్దిపాటి తిప్పలు తప్పవని నిపుణులు చెబుతున్నారు. పోలవరం వద్ద కాపర్ డ్యాం నిర్మాణం కొనసాగుతున్నందున దిగువకు నీటి విడుదల అలస్యమయ్యే అవకాశం ఉందని, ఎగువ ప్రాంతాల్లో వరద తీవ్రత గతంకంటే కొద్దిగా ఎక్కువ ఉండే అవకాశం ఉన్నట్లు నీటిపారుదల నిపుణులు చెబుతున్నారు.

# బిజెపి కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన ఇండియా కూటమి సమావేశంలో ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బిహార్‌లో ఎన్నికలను బిజెపి హైజాక్ చేయకుండా నిరోధించాలని నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) తన విధిని నిర్వర్తించకుండా, బిజెపి ప్రయోజనాల కోసం పనిచేస్తోందని మండిపడ్డారు. ఐదుగురు పెట్టుబడిదారుల పాపం కోసం బిజెపి ప్రభుత్వాన్ని నడుపుతోందని, దేశంలోని సామాన్య ప్రజల పక్షాన ఏ మాత్రం పనిచేయదని దుయ్యబట్టారు. ‘జల్, జంగల్, జామిన్’ (నీరు, అడవి, భూమి) గిరిజనులకే చెందుతుందని, ఎప్పటికీ వారికే ఉంటుందని పేర్కొన్నారు. ఒడిశా బిజెపి ప్రభుత్వం పంచాయతీల (షెడ్యూల్డ్ ప్రాంతాలకు పొడిగింపు) చట్టం, 1996ను అమలు చేయలేదన్నారు. గిరిజనులకు అటవీ హక్కుల పట్టాలు అందించలేదని, కాంగ్రెస్ ‘పెసా, గిరిజన బిల్లు’ను తీసుకువచ్చిందని చెప్పారు. తాము ఈ చట్టాలను అమలు చేస్తామని, గిరిజనులకు వారి భూమి వారికే లభించేలా చూస్తామన్నారు. బిజెడి తన హయాంలో చేసినట్లుగానే ఒడిశాను బిజెపి ప్రభుత్వం దోచుకుంటోందని మండిపడ్డారు.

**గిరిజనులు, దళితులు, మహిళలకు రక్షణ లేదు : ఖర్గే**

బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగం నుండి లౌకికవాదం, సోషలిజం అనే పదాలను తొలగించడానికి ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. కాషాయపార్టీ పాలనలో గిరిజనులు, దళితులు, మహిళలు, యువకులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. పేదలు, గిరిజనులను రక్షించడానికి కాంగ్రెస్ 2006లో అటవీ హక్కుల చట్టాన్ని ప్రవేశపెట్టిందన్నారు. అయితే, నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం ఆ చట్టాన్ని బలహీనపరచడానికి ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. పరిశ్రమల పేరుతో, బిజెపి ప్రభుత్వం ప్రతిచోటా అడవులను నాశనం చేస్తోందని, దళితులు, గిరిజనులు, యువకులు తమ హక్కుల కోసం పోరాడటం నేర్చుకోకపోతే వారిని కూడా తుడిచిపెడుతుందని ఖర్గే పేర్కొన్నారు. ఒడిశాలోని బిజెపి మద్దతుదారులు దళితులు, ప్రభుత్వ అధికారులపై దాడి చేస్తున్నారని ఖర్గే ఆరోపించారు. ఇటీవల ఒడిశాలోని గంజాంలో ఇద్దరు దళితులను చితకబాది, మోకాళ్లపై పాకించి, బలవంతంగా గడ్డి తినమని, మురికి నీరు తామని ఒత్తిడి చేశారని, భువనేశ్వర్‌లో ఒక ప్రభుత్వ అధికారిని కూడా ప్రజల సమక్షంలోనే దాడి చేశారని ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం భారతదేశంలో 160 ప్రభుత్వ రంగ సంస్థలను ఏర్పాటు చేయగా, బిజెపి ప్రభుత్వం వాటిలో 23 ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించిందని కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. కాంగ్రెస్ సృష్టించిన ప్రజా ఆస్తులను మోదీ తన స్నేహితులకు అక్రయిస్తున్నారని, ఆయనకు ఒకే ఒక ఎజెండా ఉందని, అది రాజ్యాంగాన్ని నాశనం చేయడమేనన్నారు. గత లోక్‌సభ ఎన్నికల సమయంలో రాజ్యాంగాన్ని మార్చగలిగేలా 400 కంటే ఎక్కువ సీట్ల కోసం ఓటర్లను అభ్యర్థించారని కాంగ్రెస్ అధ్యక్షుడు అన్నారు. ఒడిశాకు తాము ఎంతో చేశామని చెప్పుకుంటున్న బిజెపికి ఒడిశా, భువనేశ్వర్ పట్ల ఎలాంటి సహకారమూ అందించలేదన్నారు. వారు రాష్ట్రం కోసం ఏమీ చేయకుండా క్రెడిట్ కొట్టేయాలనుకుంటున్నారని, కానీ తాము ఒడిశా ప్రజలకు అండగా నిలబడుతామన్నారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com